
# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 6, జూన్ 2026

వెల: రూ. 25/-





శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 6


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం
డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్
**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| 'కర్మవాసనలే జన్మ పరంపర అందరకూ శ్రీహరే అంతరాత్మ' | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| మార్గదర్శకులు – మహర్షులు | 24 |
| మీ ప్రశ్న మా సమాధానం | 29 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 30 |
| జయదేవుని 'గీత గోవిందము' (సీరియల్) | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 43 |
| నవవిధ భక్తిమార్గాలు | 50 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 54 |
| యమునా నదీ పుష్కరాలు | 60 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


ఎడిటోరియల్

# శరీరం, మనస్సు, ఆత్మ

మానవ జీవితంలో శరీరం, మనస్సు మరియు ఆత్మ మూల స్తంభాల వంటివి. ఈ మూడు వేరు వేరు ఐనప్పటికీ ఒకదానితో ఒకటి విడదీయలేని విధంగా పెనవేసుకుని ఉంటాయి. వీటి సమతుల్యతే నిజమైన ఆరోగ్యానికి, సంతోషానికి మూలం. శరీరాన్ని క్షేత్రం అని కూడా అంటారు. ఇది ఆత్మకు, మనస్సుకు నిలయమైన ఆలయం లాంటిది. దీనిద్వారా మనం ప్రపంచంతో పరస్పరం చర్యలు జరుపుటకు ఉపయోగపడే సాధనం. శరీరం ద్వారానే భౌతిక ప్రపంచంలో పనులు చేస్తుంటాము. సాత్త్విక ఆహారం, వ్యాయామం, తగిన విశ్రాంతి ద్వారా దీనిని ఆరోగ్యంగా ఉంచుకోగలము. ఇక మనస్సు ఆలోచనల కేంద్రం. కోరికలు, భావోద్వేగాలు, జ్ఞాపకాలతో మనస్సు ఉక్కిరి బిక్కిరి చేస్తుంటుంది. దీనిని అదుపు చేయకపోతే మనిషి పతనమగుట తథ్యం. కాబట్టి మనస్సును అదుపు చేసి తగిన మోతాదులో కోరికలను తీర్చుకొనుట జ్ఞానుని లక్షణం. సానుకూల దృక్పథం, ధ్యానం, సద్గ్రంథ పఠనం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చును. జీవితంలో చక్కని లక్ష్యాలను పొందాలంటే మనస్సును అదుపులో పెట్టుకొనుట ఎంతో అవసరం. ఇక ఆత్మ. ఇది మన చైతన్యం. మన ఉనికికి మూలం, ఇది జనన మరణాలకు అతీతమైనదిగా, అంతర్గత శక్తిగా పరిగణించబడుతుంది. ఇది మనస్సు మరియు శరీరానికి ప్రాణశక్తిని, విచక్షణను మరియు నైతికతను అందిస్తుంది. మనం ఎవరు? మన జీవిత పరమార్థం ఏమిటి? అనే విషయాలను ఆత్మద్వారా తెలుసుకోవచ్చును. మనిషి శరీరం నశించవచ్చును కాని ఆత్మ నశించదు. "పునరపి జననం, పునరపి మరణం" చక్రంలో పరిభ్రమించు జీవునికి, వాడు ఎన్ని జన్మలు ఎత్తినా ఆత్మ మాత్రం ఒకటిగానే ఉంటుంది. శరీరం మారవచ్చును కాని ఆత్మ మాత్రం మారదు. ఉదా : మనకు ఒక సెల్ నెంబర్ ఉన్నదనుకుంటే కాలం మారిన కొద్దీ సెల్ పరికరం మారవచ్చు కాని నెంబర్ ఒకటిగానే పెట్టుకున్నట్లు... మన శరీరాలు, ఆకారాలు జనన మరణ చక్రంలో మారినప్పటికీ ఆత్మ మాత్రం ఒకటే ఉంటుంది. దీనిని భగవంతుని అంశగా చెబుతుంటారు. కాబట్టి దీనికి మరణం లేదు. ఇది మన సామర్థ్యాన్ని బట్టి భగవంతుడు స్వయంగా తన యొక్క కొంత శక్తిని మనకు కేటాయించిన అంశనే ఆత్మగా భావించాలి. కాబట్టి దీనిని అత్యంత పవిత్రంగా, నిర్మలంగా పెట్టుకొనుట మన బాధ్యత. నిస్వార్థసేవ, ఆధ్యాత్మిక చింతన మరియు అంతర్ముఖులై ఆలోచించడం ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందవచ్చునంటారు. జీవితంలో సంపూర్ణత్వం సాధించాలంటే శరీరం, మనస్సు, ఆత్మ ఈ మూడింటిని సమన్వయం చేసుకోవాలి. మనిషికి నిజమైన ఆరోగ్యం అంటే శారీరక దృఢత్వం మాత్రమే కాదు, ప్రశాంతమైన మనస్సు, వికసించిన ఆత్మ కూడా అవసరము. వీటిని సాధించాలంటే మనిషి సత్త్వగుణ ప్రధానుడై జీవిస్తూ, నిరంతర దైవధ్యానంలో గడుపుట ద్వారా సాధించవచ్చును. ఈ విధమైన జీవితం గడుపు వ్యక్తి శ్రీవేంకటేశ్వరునికి ప్రియుడు. ఈ లోకంలో ప్రతి మనిషి పుట్టుకతోనే మహాత్ముడు కాకపోవచ్చును. కాని నిత్య అభ్యాస వైరాగ్యాల ద్వారా మనలోని వికారాలను తొలగించుకుని సన్మార్గము వైపు పయనించవచ్చును. ముఖ్యంగా ప్రతి మనిషికి తన శరీరము, మనస్సు, ఆత్మ వేరు వేరని గుర్తుంచుకుని నడుచుకోవాలి. సదా మనస్సును అదుపులో పెట్టుకోవాలి. సదా భగవంతుని అంశయైన ఆత్మను తృప్తి పరుస్తూ జీవించాలి. ఒకవేళ వీటిని అదుపు చేయుటకు శక్తి సరిపోని మానవుడు శ్రీవేంకటేశ్వరునికి శరణాగతుడై రక్షించమని వేడుకొనుట ఉత్తమము.

నమో వేంకటేశాయ
**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్‌డ్ చెక్‌ను


లేదా

**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో ॥సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వాం సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచ ॥**

తాత్పర్యం – ''కర్మ, జ్ఞాన, భక్త్యాది సకల ధర్మములను విడిచి నన్ను ఒక్కని మాత్రమే ఉపాయముగా భావించి శరణాగతి చేయుము. నేను నిన్ను సమస్త పాపముల నుండి విముక్తుని చేసి మోక్షము అనుగ్రహింతును దుఖింపకుము'' అని మోక్షము పొందుటకు (భగవంతుని చేరుటకు) కర్మ, జ్ఞాన, భక్త్యాది ఉపాయముల కంటే శ్రేష్ఠమైన ఉపాయము శరణాగతి (ప్రపత్తి) యే యని దృఢంగా వెల్లడించినాడు. కనుక సుప్రభాత రచయిత కూడా ఇప్పుడు ప్రపత్తి మార్గములో మోక్షము పొందుటకు ప్రయత్నించుచున్నాడు.

**శ్లో ॥ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్ క్షాంతి సంవర్ధినీమ్ ।**
**పద్మాలంకృత పాణి పల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥**

తాత్పర్యం – ఈ ప్రపంచమునకు నాయకి, వేంకటాచలపతి యగు విష్ణుదేవునకు ప్రేయసి, అతని వక్షఃస్థలమున నిత్య నివాసము కోరునది, అతని క్షమా గుణమును అభివృద్ధి చేయునది, చిగురాకుల వంటి చేతులలో పద్మపుష్పములను ధరించినది, పద్మాసనమున కూర్చున్నది, వాత్సల్యము మొదలగు గుణములతో ప్రకాశించునది, జగన్మాత, పూజింపదగినది యగు లక్ష్మీదేవికి నమస్కరించుచున్నాను.

# ముక్తిమార్గము



## సామంతం

అతఁడే సకలవ్యాపకుఁ – డతఁడే యాతురబంధువుఁ
డతఁడు దలంపుల ముంగిట – నబ్బుట యెన్నఁడొకో
॥ పల్లవి ॥

1. సారెకు సంసారంబను – జలనిధు లీదుచు నలసిన
వారికి నిఁక దరిదాపగు – వాఁడిఁక నెవ్వఁడొకో!
పేరిన యజ్ఞానంబను – పెనుఁజీఁకటి తనుఁగప్పిన
చేరువ వెలుగై తోఁపెడి – దేవుఁడ దెవ్వఁడొకో! ॥ అతఁడే ॥

2. దురితపు కాననములలో – త్రోవటు దప్పినవారికి
తెరువిదె కొమ్మని చూపెడి – దేవుఁ డదెవ్వఁడొకో!
పెరిగిన యాశాపాశము – పెడకేలుగఁ దనుఁగట్టిన
వెరవకుమని విడిపించెడి – విభుఁడిఁక నెవ్వఁడొకో!
॥అతఁడే॥

3. తగిలిన యాపదలనియెడి – దావానలములు చుట్టిన
బెగడకుమని వడినార్పెడి – బిరుదిక నెవ్వఁడొకో!
తెగువయు దెంపును గలిగిన – తిరువేంకట విభుఁడొక్కఁడె
సొగసి తలంచినవారికి – సురతరువగువాఁడు ॥అతఁడే॥





భావము – శ్రీవేంకటేశ్వరుడే అంతటను వ్యాపించియున్నవాడు. రోగములచే క్రుంగి కృశించిన లేదా ఇతర విధముల ఆపదల పాలైన ఆర్తులపాలిటి చుట్టమతడే. ఆ పరమాత్ముడు నా తలపుల ముందు ప్రత్యక్షమై నాకు లభించు టెన్నడో గదా!

మాటి మాటికి సంసారమను సాగరము నీదుచు అలసిపోయిన జీవులకు రక్షకుడైనవాడు ఆ దేవుడు తప్ప ఇంకెవ్వడు? దట్టమైన అజ్ఞానమను పెను చీకటి జీవుని ఆవరించిన వేళ దగ్గరి ప్రకాశమై తోచి దారిచూపు మిత్రుడింకొకడేడి?

పాపపు టడవులలో దారి తప్పి చరించువారికి ''ఇదిగో సరియైన దారి, ఇటు పొమ్ము'' అని చూపగల దేవుడితడు గాక మరొకడు గలడా? దిన దినమునకు పెరిగెడు ఆశయను పాశము పెడకేల తన్ను బంధించినప్పుడు భయపడకుమని విడిపింపగల ప్రభువింకొకడెవడున్నాడు?

పైకొన్న ఆపదలనెడు కార్చిచ్చులు తన్ను చుట్టుముట్టినప్పుడు భీతి చెందకుమని వేగిరమున వచ్చి ఆ మంటల నార్పెడు శూరుడు ఆయన దప్ప మరొకడేడి? దాతృత్వము సాహసము సంపూర్ణముగా కలిగిన శ్రీవేంకటేశ్వరుడొక్కడే భక్తితో తన్ను మైమఱచి భావించినవారికి కల్పవృక్షమై తోచి కోరిక లీడేర్పగలవాడు.

# "కర్మ వాసనలే జన్మ పరంపర అందరకూ శ్రీహరే అంతరాత్మ"

– డా|| కె.బి.రాజేంద్రప్రసాద్



నిష్కళంకుడు, నిర్వికల్పుడు, నిరంజనుడు, నిరాభ్యుతుడైన సత్య దైవం నారాయణుడు. ఈ సమస్తానికి శ్రీహరియే ఆధారభూతుడు. విశ్వమంతా వ్యాపించి యున్న పరతత్త్వమే విష్ణుదేవుడు. ఆయనే ఈ జగన్నాటక సూత్రధారి. జీవులు పాత్రధారులు. ఈ జగన్నాటకాన్ని నవరస భరితంగా నడిపించడమే పరమావధిగా పరమాత్మ ఎన్నో లీలలు, మాయలు, వినోదాలు, విలాసాలకు తెర తీయడం జరిగింది. తాను సృష్టించిన జీవాత్మలపై స్వామికి ఎనలేని అనురక్తి. సృష్టి స్థితి లయలకు మూలమైన అంతర్యామిపై మనకు ఉండవలసింది భక్తి. ఈ భక్తి అనన్యమై, అలౌకిక ఆధ్యాత్మికానుభూతిని పొందితే భవబంధ ముక్తి కలుగుతుంది. అదే మోక్షం. అది కూడా మరలా పుట్టుక, చావు లేని శ్రీ కైవల్యం. అంటే శుభకరమైన శ్రీహరి సాయుజ్యం.

జీవులు కర్మలు చేస్తుంటారు. చేయాలి కూడా. నిష్కర్మిగా ఉండరాదు. కాని కర్మ ఫలితానికి కర్త దేవుడు. మనం చేసిన కర్మలు కారణంగానే మనకు దేహాలు అనగా జన్మలు వస్తున్నాయి. అందుకే నిష్కామ కర్మ యోగాన్ని గీతలో స్వామి ఉద్ఘాటించారు. కర్మ ఫలితాన్ని ఆశించకుండా నిస్వార్థ కర్మలు చేయాలి. ఈ కర్మలు సహ ప్రాణులకు ఒప్పుగా మెప్పుగా ఉండాలి. తప్పుగా నొప్పిగా ఉండరాదు. ఎందుకంటే ఈ జన్మ ఆయువు తీరగానే దేహాన్ని వదిలిన జీవుడు, కర్మవాసనలకు సానుకూలమైన శరీరాన్ని అనగా జన్మను పొందుతాడు. అలాగే కర్మానుసారంగా మరల సుఖ దుఃఖాలను పొందుతాడు. కర్మలు శిథిలమై కర్మానుభవం పూర్తైతేనే జన్మ రాహిత్యంతో కూడిన మోక్షం. అప్పటి వరకు

జన్మలు తప్పవు. బ్రతుకు తిప్పలు తప్పవు.

పుణ్యకర్మల వలన మంచి జన్మలు, పాప కర్మల వలన పాపపు జన్మలు విధిగా వస్తాయి. ముఖ్యంగా పాప కృత్యాలకు పశువులు, క్రిములు, కీటక జన్మలు తప్పవని భారతం వివరిస్తోంది. ఈ మంచి, చెడు కర్మలకు మూలం ఆశ. కామ క్రోధ మోహాలనే అంతర్గత శత్రువులు. అందుకే జీవుడు వాటిని వదిలేయాలి. లౌకికంపై ఆశ వదిలితేనే పారలౌకికం పట్టు వడుతుంది. లౌకిక భావనలతో, లౌకిక ఊహలు, ఊసులతో జీవితాన్ని కరిగిస్తే మరలా అదే ఆశలకు, ఊహలకు వీలుగా జన్మిస్తాం. శరీరాలు వస్తాయి. ఆశలు వదలక, సత్యాన్ని గుర్తించక, లౌకికమే నిత్యంగా భావించి జన్మలు ఎత్తిన ఒక జీవాత్మ జన్మ పరంపర చూద్దాం.

శ్రీహరి అలంకార ప్రియుడు. శృంగార రాయుడు. జగన్మోహనాకారుడు. మధురాధిపతి. స్వామి వచస్సు, మనస్సు, తపస్సు, వర్చస్సు మధుర మోహనం. ఆయన ఆకృతి, ప్రకృతి, సత్కృతి సమ్మోహనం. స్వామి గమనం, ఆగమనం, నృత్తం, నృత్యం, గీతం, హావం, భావం, హసితం ఒక్కటేమిటి? అన్నీ మధురాతి మధురం. పరమ హంసలైన మహర్షులే పరంధాముని సౌందర్య మాయలో పడ్డారంటే ఇంక సామాన్య జీవుల గురించి ఏం చెప్పగలం?

ఒక గంధర్వ కాంత. భర్త ఉన్నాడు. సంసారం ఉంది. కాని ఆమె శ్రీమన్నారాయణుని అందచందాలను వింది. మనసు పారేసుకుంది. తన అందంతో శ్రీహరిని దక్కించుకోవాలనుకుంది. ఈమె కోరికలో భక్తి లేదు. అనురక్తి మాత్రమే. కామం మాత్రమే ఉంది. పరమాత్మను దరి చేరి తరించాలనే తాపత్రయం లేదు. శ్రీవారి అందాన్ని అనుభవించాలనే ఆశ, ఆశయంతో, పాలకడలిలో శేషతల్పంపై శ్రీమహాలక్ష్మితో సేద తీరుతున్న స్వామి కడకు వచ్చింది. స్వామి భావనను గ్రహించిన శేషుడు తన వేయి పడగలను విప్పి, స్వామి ఇతరులకు కన్పించని రీతిలో అడ్డుపడ్డాడు. గంధర్వకాంత శేషునిపై ఆగ్రహించింది, ప్రక్కన ఉన్న శ్రీమహాలక్ష్మిని చులకన చేసి మాట్లాడుతూ, శేషునితో వాదనకు దిగింది. స్వామి జగన్నాటకాన్ని చూస్తున్నాడు. ఇంతలో గంధర్వకాంత భర్త అక్కడకు వచ్చాడు. భార్యపై కోపించాడు. లక్ష్మీమాతకు, ఆదిశేషునకు క్షమాపణలు చెప్పాడు. భార్యను తిరిగి రావల్సిందని మందలించాడు. ఆమెలో కసి, అక్కసు కల్గాయి. మొరాయించింది. గంధర్వుడు కోపించాడు. ''మూర్ఖురాలా! దేవదేవుని భక్తితో ఆరాధించి, తరించాలని కోరుకోవాలి. నీవు అందుకు విరుద్ధంగా కామంతో, లౌకిక సుఖాన్ని అపేక్షించి, దారి తప్పినావు. నీవు రాక్షస జాతి స్త్రీగా జన్మిస్తావు'' అని శాపాన్నిచ్చి వెళ్ళిపోయాడు. గంధర్వకాంత శాపాన్ని పట్టించుకోలేదు సరికదా, రాక్షసిగానైనా స్వామికి అర్ధాంగి కావాలన్న అపేక్షతో చురచుర చూసుకుంటూ వెళ్ళిపోయింది.

వైదిక ధర్మాలను లోకాలకు తెల్పడానికి, దుష్ట రాక్షస సంహారం కావించి, దేవ సంఘాలకు, మహర్షులకు సనాతన ధార్మిక నీతిని, రీతిని, అనుభూతిని అందించడానికి శ్రీహరి రామావతారాన్ని ధరించడం జరిగింది.

ఈ అవతారంలో తండ్రి మాట కాపాడడానికి రాముడు భార్య సీత, సోదరుడు లక్ష్మణుడు వెంటరాగా అరణ్యవాసానికి వచ్చాడు.



శ్రీరామచంద్రమూర్తి పరిపూర్ణ సౌందర్య స్వరూపుడు. సీతమ్మ శ్రీమహాలక్ష్మి కాగా ఆదిశేషుడు లక్ష్మణుడు. కామంతో రగిలి పొగిలిపోయిన గంధర్వకాంత లంకాధిపతి రావణుని సోదరి శూర్పణఖగా జన్మించింది. శూర్పణఖ యొక్క భర్తను రావణుడే వధించాడు. ఈ పరిస్థితిలో అడవులలో తిరుగాడుతున్న శూర్పణఖకు సీతారాములు కన్పించారు. తిరిగి ఆమెలో మోహం విజృంభించింది. రాముని సమీపించింది. తన కోరికను తెలిపింది. ''నా కోరికను మన్నించి నన్ను చేపడితే సరి. లేదా నీ భార్య సీతను చంపి తినేస్తాను'' అంది. అప్పుడు రాముడు ''కాంతా! నేను ఏకపత్నీ వ్రతుణ్ణి. నేను ఈ ధర్మాన్ని తప్పలేను'' అంటాడు. అప్పుడామె ఆగ్రహించింది. ''కాంతా!

నా సోదరుడు లక్ష్మణుడు భార్యకు దూరంగా ఉన్నాడు'' అని చూపుతాడు. శూర్పణఖ లక్ష్మణుని సమీపించింది. లక్ష్మణుడు జ్ఞాని. గత జన్మల వాసనను పసికట్టాడు. మాటలతో త్రిప్పి పంపడానికి బహు విధాలుగా నచ్చ చెప్పాడు. ఆమె వినలేదు. ''మాట మాటకు సీతమ్మను చంపుతాను, తినేస్తాను'' అంటూ విసిగిస్తోంది. లక్ష్మణుడు ఆగ్రహించి, ఆమెకు ముక్కు, చెవులు కోసి పంపడం జరిగింది.

నిజానికి తన భర్తను చంపాడని, అన్న రావణునిపై కసిగా ఉన్న శూర్పణఖ స్వామికి ఆయుధమైంది. ఆమె సరాసరి అన్న దగ్గరకు వెళ్ళి, పరాభవాన్ని చెప్పి, సీతమ్మ అందచందాలను విన్పించి, అతనిలో కామాన్ని రగుల్కొలిపింది. మానవ ప్రభుడైన రామునిపై ఆగ్రహం కల్గించింది. ఫలితంగా రామ రావణ యుద్ధం. రాక్షస సంహారం జరిగింది. ఇది పరమాత్మ రచన.

ఇప్పుడు మరలా కథ లోనికి వద్దాం. శూర్పణఖ అవమాన భారంతో కృంగిపోయింది. పుష్కర తీర్థానికి వెళ్ళి శివుని గూర్చి తపస్సు చేసింది. శివదేవుడు ప్రత్యక్షమైనాడు. ''నీకు ఏం వరం కావాల''న్నాడు. ''స్వామీ! నాకు పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు భర్తగా కావాలి'' అంది. ''ఓ కాంతా! కోరరాని కోరికలు కోరరాదు. ఈ జన్మలో ఆయన ఏకపత్నీవ్రతంలో ఉన్నాడు. ఇది సాధ్యం కాదు. అయినా ద్వాపర యుగంలో నిన్ను ఆయన అనుగ్రహించి, ఆదరించి, కొన్ని దినముల పాటు నీతో శృంగార రస సామ్రాజ్యంలో తేలియాడుతాడు. ఓపిక పట్టుము'' అని చెప్పి శంకరుడు అంతర్ధానమయినాడు.

అలా ఆనాటి గంధర్వకాంత, శూర్పణఖగా జన్మించింది, ఆ తర్వాత ద్వాపర యుగంలో ''కుబ్జ''గా జన్మించింది.

కుబ్జ అనగా మరుగుజ్జు, పొట్టి అని అర్థం. బలరామకృష్ణులు మధురకు వచ్చారు. తమ భక్తుల భక్తి కృతులను అనుగ్రహిస్తూ ముందుకు పోతున్నారు. దారిలో కుబ్జ కనిపించింది. పరమాత్మ దృష్టిలో కుబ్జ పడింది. ఆ జీవాత్మపై స్వామికి జాలి కల్గింది. అందమైన గంధర్వకాంత శూర్పణఖ అనే రాక్షసి యైంది. ఆ శూర్పణఖ కంసుని కొలువులో దాసిగా జన్మించింది. అందునా అంతఃపుర సైరంధ్రి. స్వామి చిన్నగా నవ్వుకున్నాడు. కుబ్జ విచిత్రంగా చూచింది. ''ఓ కాంతా! నీవు ఎవ్వరిదానవు? సుగంధాను లేపనములను తీసుకొని వెళ్తున్నావు? ఎవ్వరికొరకు ఈ లేపనములు? మాకు కూడా కొద్దిగా ఇవ్వవచ్చు కదా?'' అన్నాడు. అప్పుడు కుబ్జ నిజానికి



వికారం, పొట్టితనం, మూడు వంకరల దేహంతో ఉంది. ''స్వామీ! చక్కదనం ఉంది కదా అని సరసాలాడకుము. మాకు చక్కదనాలెక్కడివి? నేను కంసుని దాసిని. నా పేరు త్రివక్ర. వినిర్మల తను లేపనాల తయారీ విద్య నేర్చిన దానను. మా ప్రభువు కూడా నన్ను మెచ్చుకుంటుంటాడు. ఇదిగో మీకు కూడా ఈ విలేపనములు ఇస్తున్నాను'' అంటూ కలికితనంతో మాట్లాడుతూ ఇచ్చింది. స్వామి ఆ గంధపు లేపనాలకే సంతృప్తి చెందాడు. కుబ్జ భాగ్యం ఫలించింది. రథం దిగి కుబ్జ పాదాలను తన పాదాలతో త్రొక్కిపట్టి, రెండు వ్రేళ్ళతో కుబ్జ గడ్డం పైకెత్తాడు. అదియేమి వైష్ణవ మాయయో లేదా విష్ణుదేవుని అనుగ్రహమో కుబ్జ ఆకృతి మారిపోయింది. దేహ వక్రతలు పోయాయి. పొట్టితనం కనుమరుగయింది. కాముని బాణమా? కందర్ప దీపమా అన్నంత సర్వాంగ సౌష్ఠవంతో మరో రతీదేవిలా కుబ్జ మారిపోయింది. ''మన్మథాకారా! నా ఇంటికి వేంచేయుము'' అంటూ స్వామి ఉత్తరీయాన్ని పట్టుకుని లాగింది కుబ్జ. స్వామి బలరాముని చూచి, చిన్నగా నవ్వుతూ ''నేను వచ్చిన పని పూర్తయిన పిమ్మట, తప్పక నీ మందిరానికి వస్తాను'' అంటూ అనునయించి స్వామి ముందుకు కదిలాడు.

శ్రీకృష్ణ పరమాత్మ కంసాది రాక్షస ప్రవృత్తులు కలవారిని వధించి, తల్లి తండ్రులైన దేవకీ వసుదేవులను చెఱనుండి విడిపించి, తన కర్తవ్యాలను నెరవేర్చుకొన్న పిమ్మట కుబ్జ ఇంటికి వెళ్ళాడు. ఆ కుబ్జ కోరికలను అనుసరించి, కొన్ని దినాలు ఆమెతో క్రీడించాడు. విష్ణుమూర్తి అందచందాలను, అంగజ కేళితో అనుభవించాలన్న కోరిక యుగాలు మారినా తరగలేదు. తగ్గలేదు. కుబ్జ సంతృప్తి సంతోషాల పారవశ్యంలో తేలియాడింది.

గంధర్వకాంత మూడు జన్మలు. మూడు జన్మలలోను

మూడు మార్లు పరమాత్మను దరి చేరింది. కాని ఒకే రకమైన కోరిక. లౌకిక బంధం. మధ్యలో తపము చేసి శివ దేవుని ప్రత్యక్షీకరించుకుంది. అప్పుడు కూడా ఏ కోరికతో పరితపిస్తూ వచ్చిందో అదే లౌకిక వాంఛ. ఎప్పుడూ, ఎక్కడా, ఏ దేవుని, మోక్షం లేదా సాయుజ్యం లేదా పరమపదాన్ని కోరలేదు. దైవచింతన, భక్తిని అడుగలేదు. కనుకనే జన్మలు అనగా రకరకాలు శరీరాలు, రాక్షసిగా, త్రివక్రయైన కుబ్జగా దేహాలను ధరించింది. చివరకు స్వామి సంస్పర్శనా భాగ్యంతో కోరికలు తీర్చుకుంది. కాని సాయుజ్యాన్ని పొందలేకపోయింది. అందుకే పోతన ''వేదాలకు కూడా అంతు పట్టని స్వామి ఎదురు నిల్చి వరాలివ్వడానికి సిద్ధపడితే ముక్తిమార్గం కోరలేదు సరికదా, స్వామితో ''రతి'' అనగా అంగజకేళి అడిగింది. ఆమె కర్మఫలమెట్టిదో!'' అని అబ్బురపడ్డాడు. ''నిర్వాణ విభూతి'' / మోక్ష సంపద అందరకూ దొరకనిది. లౌకిక వాంఛలు లేని, తత్త్వజ్ఞానం కలవారికే లభిస్తుంది. తత్త్వజ్ఞానానికి వీలైన మార్గం భక్తిమార్గం. కుబ్జ ఈ భక్తిమార్గాన్ని కోరకపోవడం ఆశ్చర్యం.

ఆశాపాశం అనంతం. బంధానుబంధాల మాయ కలగన్న భాగ్యం. కామ క్రోధాదులు జనన మరణ చక్రం నుండి జీవికి విముక్తిని కలిగించవు. జన్మ పరంపరకు దారి తీస్తాయి. తెలిసి నడవడం విచక్షణ.

**"కోరిన కోర్కెలు కోయని కట్లు – తీరవు నీవవి తెంచక**
**భారపు పగ్గాలు పాప పుణ్యములు –**
**నేరుపుల బో నీవు నీవు వద్దనక...**
**మదిలో చింతలు మైలలు మణుగులు –**
**వదలవు నీవవి వద్దనక...**

అని చెప్పిన అన్నమయ్య హితవు శిరోధార్యం. వేంకట విభుని శరణు కోరుటే మార్గం.

## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

### రచనలు పంపవలసిన చిరునామా



**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

39వ భాగము



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు


### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల

### శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులోభాగంగాప్రస్తుతపు 39 వ భాగపు లీలల ప్రచురణ. (ఏప్రిల్ 2022 – జులై 2022).



దాదాపు 2 సంవత్సరాల పైనుండి కోవిడ్ భయము వలన మేము హైదరాబాద్ లో, మా పిల్లలు అమెరికాలో ఉన్నారు. ఈ మధ్యన కోవిడ్ భయం కొంత తగ్గుముఖం పట్టింది. అమెరికాలో మా వదిన కూతురు పెండ్లి మరియు మా పిల్లలను చూడాలనే ఉద్దేశ్యముతో తేది 05-04-2022 నుండి 17-06-2022 వరకు అమెరికా వెళ్ళాము. అక్కడ స్వామి సేవకు దూరమైన కారణంగా స్వామి పట్ల తపించిపోతాను. నిజానికి ఇప్పుడే జీవితమును ఎక్కువ అర్థం చేసుకోగలను. ఇక్కడ నాకు స్వామి దయ వలన ఎన్నో అనుభూతులు కలిగాయి. వాటిని వరుస క్రమములో వ్రాస్తున్నాను.

### స్వామి చతురత

అమెరికాలో మరొక్కసారి స్వామి లీలలను నెమరు వేసుకున్నాను. లీలలు పాతవే అయినప్పటికీ వాటిని నెమరు వేసుకున్నప్పుడు వాటి అంతరార్థము భిన్నంగా, ఎంతో మధురంగా ఉండేది. ఈ విధంగా వ్రాసుకున్నాను.

నేను నా మొదటి సంకల్పములో ఓడిపోయినప్పుడు చాలా విచారించాను. నన్ను నేను అసహ్యించుకున్నాను. ఒక అసమర్థ సేవకుడుగా, నా స్వామికి అపకీర్తి తెచ్చిపెట్టేవాడిగా భావించుకుని బాధపడ్డాను. దీనిని గమనించిన స్వామివారు నేను భాగవతుల ఆశీర్వాద ఫలముగా గెలిచానని చెప్పారు. కాని... నాకు కేటాయించిన సేవలో ఇతరుల జోక్యమును జీర్ణించుకోలేకపోయాను. భాగవతులు స్వామివారికి అత్యంత సన్నిహితులు, నాకు కూడా

పూజనీయులే అయినప్పటికీ నా మనస్సు అంగీకరించలేదు. చివరికి ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నిజానికి నేను విధి వక్రీకరించి లేదా అయోగ్యత వలన ఓడిపోయాను. కాని మీరు నన్ను తృప్తి పరుచుటకు, నా దుఃఖాన్ని తగ్గించి ఆనందపరచుటకు భాగవతుల ఆశీర్వాదమనే గ్రేస్ మార్కులతో ఉత్తీర్ణుణ్ణి చేశారు. దీనికి మీకు కోటి కోటి ధన్యవాదములు. కాని ఈ సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేకపోవుచున్నాను. నా మనస్సు అంగీకరించుట లేదు. మీ మాటను కాదనుచున్నందుకు క్షమించండి. నేను ఈ సేవలో ఓడిపోయాననే భావిస్తున్నాను. నేను చాలా తప్పులు చేశాను. చాలాసార్లు మీరు చెప్పినట్లు వినలేదు. నా సొంత లాభాల కోసం, నా మనస్సు చెప్పినట్లు నడుచుకుని మీ మాటను జవదాటి తప్పు చేశాను. వ్యాపారం వద్దన్నారు, వినలేదు. కేవలం కొన్ని సంవత్సరాలు నా జీవనోపాధికి సరిపడ మాత్రమే అనుమతించారు. కాని దానిపై గల వ్యామోహంతో మీ మాట జవదాటాను. 'నా' అన్నదానిని వదులుకోమన్నారు. దీనిని సాధించుకోలేకపోయాను. ప్రతిక్షణం మిమ్మల్ని స్మరించుమన్నారు. కాని లౌకిక వ్యవహారాలలో చిక్కి మరచాను. ఇలా చాలా విషయాలలో తప్పులు జరిగాయి. పర్యవసానంగా విధి వక్రీకరించి ఓడిపోయాను. అందులో మీ తప్పు ఎంతమాత్రం లేదు. ఈ విషయంలో నేను బాధపడకుండా అత్యంత నెమ్మదిగా నన్ను నేను అర్థం చేసుకునేటట్లు చేసినందుకు కోటి కోటి ప్రణామాలను అర్పిస్తున్నాను'' అని ప్రార్థించాను.

భాగవతులు మీ వారే, నాకు ఆప్తులే. నాదొక విన్నపము. దయచేసి ఆలకించండని ప్రార్థిస్తూ ఈ మొత్తం ఫలితాన్ని భాగవతులకు పంచిపెట్టమన్నాను. అంటే... గత 16 సంవత్సరాల నుండి జపం వ్రాసినవారందరికీ పంచిపెట్టమని, నాకు వద్దని, నేను మళ్ళీ ఈ ఫలితాన్ని అడగనని ప్రార్థించాను. నాకు మరో అవకాశమును ఇచ్చి మిమ్మల్ని పొందే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. స్వామివారు అప్పటి నా ఆరోగ్య స్థితిగతులను పరిగణన లోనికి తీసుకొని నా ప్రార్థన ప్రకారం ''శ్రీనివాస కళ్యాణాలు'' అనే సేవను ప్రసాదించారు. మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించి సంకల్పాన్ని నెరవేర్చుకోవాలి. ఈ విధంగా నేను రెండవ సంకల్పాన్ని స్వామివారి అనుగ్రహంతో పొందాను.

అయితే ఈ సమయాన నాకు రామాయణం లోని భరతుడు గుర్తుకు వచ్చాడు. రామాయణంలో ఈయనది విశిష్టమైన పాత్ర. ఏ తప్పూ చేయకున్నా తప్పు చేసిన వానివలె శిక్ష అనుభవించాడు. తప్పు చేయలేదంటూ విల విలా కొట్టుకున్నాడు. విధి వక్రీకరించి తప్పు చేసినవాడిలా శిక్షననుభవించాడు. శ్రీరాముని వద్దకేగి తాను అభాగ్యుడనని, ఏ తప్పూ తెలియదని, నమ్ముమని విలపించాడు, ఈ శిక్షనుండి రక్షించమని వేడుకున్నాడు. కాని శ్రీరాముడు మాత్రం భరతుణ్ణి ఓదార్చి, భరతుడు ఏ తప్పూ చేయలేదని చెప్పుచూ, విధి రచించిన ఈ లీలలను తప్పక ఒప్పుకోవాలని తెలిపాడు. రాముని ఆజ్ఞను శిరసా వహించిన భరతుడు 14 సంవత్సరాలు రాముని సేవకుడిగా రాజ్యపాలన చేశాడు. ఫలితంగా శ్రీరాముడు అరణ్యవాసం చేశాడు. రాక్షసులను వధించాడు, మునులను కాపాడాడు. రామాయణం ఏర్పడ్డది. యుగయుగాలుగా మానవజాతికి దిక్సూచి లభించింది. ఇలా రాముని కృప ఎంతోమంది రామాయణ పాఠకులకు లభిస్తున్నది. నా విషయంలో కూడా ఇదే జరిగింది. అందుకే నాకు శ్రీ భరతుడు పదే పదే గుర్తుకు వచ్చాడు. నేను ఏ తప్పూ చేయకున్నప్పటికీ తప్పు చేసిన వాడిలా ఓడిపోయాను.

చివరికి శ్రీవేంకటేశ్వరుని ఓదార్పు మాటలకు సంతుష్టుణ్ణైనాను. మరియు రెండవ సంకల్పమైన 'శ్రీనివాస కళ్యాణాలను' ఆర్తితో స్వీకరించాను. దీని ద్వారా శ్రీవేంకటేశ్వర భక్తులకు స్వామివారి సేవాభాగ్యం, కృపా కటాక్షాలు లభిస్తున్నవి. ఇది స్వామి వారి ఆజ్ఞతో విధి ఆడిన నాటకంగా భావించాను.

**మరో విశేషం:** నేను స్వామివారిని రెండు భిన్నమైన కోరికలు కోరాను. మొదటిది : ఈ జీవితంలో తృప్తి చెందేవరకు స్వామివారి సేవాభాగ్యాన్ని ప్రసాదించమన్నాను. రెండవది : 16 సంవత్సరాలు 111 కోట్ల జప సమర్పణ చేసి స్వామివారిని పొందాలి. ఈ రెండు ఒకటి కావు. రెండవది నెరవేరితే మొదటిది నెరవేరుతుందని భావించి మొదటి దానిని రెండవ దానిలో విలీనం చేశాను. ఆ తరువాత మొదటి దానిని మరచాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం సంకల్ప సమయం పూర్తి కాగానే తిరిగి మొదటి దానిని గుర్తుంచుకునేటట్లు నన్ను అప్రమత్తం చేసి దిశా నిర్దేశం చేశాడు. నన్ను ఏమాత్రం నొప్పించక నా చేతనే రెండవ సంకల్పాన్ని ఏర్పాటు చేయించి ''నీవు చెప్పినట్లే చేస్తున్నా''నని చెప్పాడు. ఆయన మహా చతురుడు. ఇలా ఇప్పటివరకు నాకు లభించిన 5 సేవలను

నాతోనే సంకల్పం చేయించి, నేనే చేస్తున్నట్లు చేయడం ఆయన చతురతకు నిదర్శనం. ఇది గుర్తు చేసుకుని మురిసిపోయాను.

ఈ విధంగా నా గతాన్ని పునరాలోచించి స్వామివారి నాటకాన్ని గుర్తిస్తూ, నిజాన్ని గ్రహించి మరో మారు ఆనందించాను.

## కర్తవ్యం గుర్తు చేయుట

మేము తేది 05-04-2022 రోజున అమెరికా వెళ్ళాము. గత రెండున్నర సంవత్సరాల నుండి కోవిడ్ కారణంగా అమెరికాకు వెళ్ళలేదు, మా పిల్లలను చూడలేదు. మరియు మా రెండవ కుమారుని గృహప్రవేశం, మా వదిన కూతురి పెండ్లి మొదలగు మొత్తం కార్యక్రమాల కోసమని రెండున్నర నెలల పాటు అమెరికాలో ఉండాలనే ఉద్దేశ్యముతో వెళ్ళాము. కాని మేము 7 నెలల క్రితం తేది 21-07-2021 నుండి ''శ్రీనివాస కళ్యాణాలు'' అనే కార్యక్రమమును చేపట్టాము. ఈ కార్యక్రమమును చేపట్టినప్పుడు మాకు ఈ సంకల్పం తప్ప ఇతరములైన విషయాలపై కాని, వ్యవహారములపై కాని, మరే విషయములపై కాని నా మనస్సు లగ్నము కాకూడదని స్వామివారు చెప్పారు. నేను కూడా స్వామి ఆజ్ఞ ప్రకారం మొత్తం వ్యాపారాన్ని ఆపుచేసి, మరేదాని పైన ధ్యాస లేకుండా ఈ సంకల్పాన్ని సాధించాలనే ఉద్దేశ్యముతో జీవిస్తున్నాను. ఇప్పుడు ఈ రెండున్నర నెలలు స్వామివారి సేవకు విరామము పలికి అమెరికాకు పోవడం కోసం స్వామివారు కూడా అనుమతించారు. కాని ఇంతకంటే ఒక్క రోజు కూడా ఎక్కువ ఉండకూడదని, అక్కడి సుఖాలకు, వ్యవహారాలకు అలవాటు పడకూడదని మరీ మరీ హెచ్చరించారు. ఈ హెచ్చరికలో భాగంగా నా కర్తవ్యమును పదే పదే గుర్తు చేశారు. అమెరికాకు వెళ్ళిన తెల్లవారు నుండి ఒక వారం రోజులు, రోజుకొకటి చొప్పున నా కర్తవ్యమును గుర్తు చేశారు. వాటిని ఈ క్రింది విధంగా తెలుపుతున్నాను.

## మా అమ్మమ్మ గ్రామములో కళ్యాణమును గుర్తు చేయుట

కళ్యాణ కార్యక్రమము మొదలుపెట్టినప్పుడు నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామమైన అప్పనపల్లిలో స్వామివారి కళ్యాణము చేయాలని సూచించాడు. దానిని ఇంతవరకు చేయని కారణంగా ఇప్పుడు ఈ క్రింది విధంగా గుర్తు చేశారు.

**తేది 06-04-2022 కల :** నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము, అప్పనపల్లిలో చిన్నపిల్లల ఆట చూచాను. ఆ ఊరికి సంబంధించిన చాలా మంది పిల్లలను చూచాను. వారు ఆడుకొనుచున్నారు. వారితో ''నేను పుట్టింది ఈ ఊరే'' అని చెప్పాను. మరియు ఆ ఊరిలో మా బంధువులను చూచాను. ఇంతే కల.

**దీనర్థం:** ''నీవు అప్పనపల్లిలో కళ్యాణము చేయవలసి ఉన్నదని'' నా కర్తవ్యమును గుర్తు చేశాడు.

చిన్నగుండవెల్లిలో చిట్టిమెల్లి శేఖరమని ఒక మిత్రుడున్నాడు. మేము ఊరిలో లేనప్పటికీ మాకు సంబంధించిన పనులను చేసి పెడుతుంటాడు. స్వామివారు ఇప్పుడు దీనిని ఉపయోగించుకున్నారు.

**తేది 07-04-2022 కల :** ఈ నాటి కలలో నేను చిన్నగుండవెల్లిలో ఉన్నాను. నేను ఒక ముఖ్యమైన పని మీద హైదరాబాద్ నుండి చిన్నగుండవెల్లికి వెళ్ళాను. మా పాత ఇంటిలో ఉన్నాను. తిరిగి హైదరాబాద్ రావాలని అనుకున్నాను. ఇంతలో ఏదో పని చేయమని చెప్పుటకు మిత్రుడు శేఖరం ఇంటికి వెళ్ళాను. ఆయనతో కలిసి ఈ విషయం చెప్పాను. ఆయన ఈ పనులు కావటానికి నన్ను ఈ రోజు ఊరిలో ఉండి రేపు హైదరాబాద్ పొమ్మన్నాడు. ఇంతే కల.

ఈ కలలో మా ఊరిలో కళ్యాణం చేయవలసి ఉన్నదనే విషయమును స్వామివారు గుర్తు చేశారు.

మేము అమెరికాకు వెళ్ళకముందు సికింద్రాబాద్ లోని ''హరేరామ హరేకృష్ణ'' వారి అభ్యర్థన మేర వారి ప్రాంగణములో తేది 26-06-2022 నాడు కళ్యాణము చేయ నిర్ణయించి అమెరికాకు వెళ్ళాను. ఇప్పుడు స్వామివారు దీనిని గుర్తు చేశారు.

**తేది 08-04-2022 :** ఈనాటి కలలో సికింద్రాబాద్ లోని ''హరేరామ హరేకృష్ణ''లో కళ్యాణం ఉన్నదనే విషయమును ఒక హృదయాంతర భావం ద్వారా గుర్తు చేశారు. మరియు ఆ ప్రాంతమును చూచాను. అమెరికాలో ఆలస్యం చేయక నీ కర్తవ్యం పూరించు అనే విధంగా స్వామివారు తెలిపారు.

మరో అద్భుతమైన లీలను ప్రసాదించారు. కాని ఈ లీలను మరచుటచే దీని భావం మాత్రం వ్రాస్తున్నాను.

**తేది 10-04-2022 కల :** ఈ కలలో నేను పై విషయములను మరచి లేజీగా ఉండకూడదని, వాటిని ఆయా తేదీలలోనే

నిర్వహించుటకు, వీలైతే అత్యంత త్వరగా నిర్వహించుటకు సిద్ధంగా ఉండమని, ఆదమరవకుమని అన్నాడు. మరియు నీ సంకల్పమును ఎట్టి పరిస్థితిలో మరువకూడదని బోధించాడు.

ఇలా చెప్పుచు అమెరికాలో ఒక్కరోజు ఎక్కువ కాలము పొడిగించక ఇండియా వచ్చి నా కర్తవ్యమును పూర్తి చేయమన్నారు. ఈ విధంగా నన్ను ప్రేరేపించారు.

మరో పర్యాయం ఇలా అన్నారు.

1. ''నీవు నీ తోట బావిని చేరుటే లక్ష్యంగా నీ సాధన ఉండాలి, అవసరమైతే రెండవదే కాదు, మూడవ సంకల్పం తీసుకునైనా నీవు తోట బావిని భక్తులతో కలిసి చేరవలసి ఉంటుంది'' అని చెప్పారు. కాని అప్పుడు దీని అర్థమును గ్రహించలేదు. మరియు
2. నీ తోట బావి వద్ద గల స్థలము హోటళ్ళు, షాపులతో అభివృద్ధి చెందుతుందని అన్నారు.
3. అక్కడ స్వామివారు ఉన్నారని భావించి కళ్యాణాలు లాంటి ఎన్నో శుభకార్యాలు జరుగునని సూచించారు. శ్రీవైష్ణవులు పూజార్లుగా ఉందురని సూచించాడు.

## నీవు ఒంటరివని సూచించిన స్వామివారు

గత 2 సంవత్సరాల క్రితం మా పెద్ద కొడుకు చి|| వేదాంత్ అమెరికాలోని డల్లాస్ నగరములో ఒక ఇల్లు కొన్నాడు. మేము ఆ గృహ ప్రవేశానికి పోలేదు. ఆ తరువాత కోవిడ్ కారణంగా గత 2 సంవత్సరాల నుండి అమెరికాకు పోలేదు. చివరికి తేది 05-04-2022 నాడు వేదాంత్ ఇంటికి పోయాము. మేము పోయిన తెల్లవారి తేది 06-04-2022 నాడు మా చిన్న కుమారుడు చి|| అరవింద్ రెడ్డి వాని భార్యా సహితంగా వేదాంత్ ఇంటికి వచ్చి మాతోనే ఉంటున్నారు. వీరు కూడా ఇదే డల్లాస్ నగరంలో ఒక క్రొత్త ఇల్లు కొన్నారు. కాని ఇంకా ఆ ఇల్లు పూర్తి కానందున ప్రస్తుతం మాతోనే ఉంటున్నారు. మొత్తం మీద మా మొత్తం కుటుంబం ఇద్దరు కొడుకులు, కోడళ్ళు కలిపి మొత్తం ఆరుగురం ఒకే ఇంటిలో నివసిస్తున్నాము. చాలా రోజుల నుండి కలుసుకోలేకపోయిన మేము, 2 సంవత్సరాల తర్వాత అందరం ఒకే దగ్గర ఉంటున్నాము. ఈ సంఘటన నా భార్య సురేఖకు ఆనందాన్నిచ్చింది. చాలా రోజుల తర్వాత కొడుకులు కోడళ్ళతో కలిసి జీవించడం ఎవరైనా ఆనందించే




ఒంటరిగా మిగిలిన సురేఖ (లీల 08-04-2022)

విషయమే! మానవ సహజము.

కాని శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను ఒక ప్రత్యేకమైన కార్యసాధన కోసం, ప్రత్యేకమైన జీవన విధానమును కల్పించి జీవింప చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిలో సురేఖ సాధారణ వ్యక్తి లాగా ప్రవర్తించే సరికి స్వామివారు సురేఖకు జ్ఞానోదయము కలిగించాడు. ఈ జీవిత సత్యమును గుర్తించి తన కర్తవ్యమును తెలుసుకోమన్నాడు. దీనిని ఈ క్రింది కల ద్వారా తెలిపాడు.

**తేది 08-04-2022 కల:** ఈ కలలో మేము హైదరాబాద్ లో ఉన్నాము. మాకున్న ఇన్నోవా కారులో నేను సురేఖ కలిసి ఒక ముఖ్యమైన వ్యక్తుల పెండ్లి కార్యక్రమమునకు, ఒక దూర ప్రాంతమునకు పోయి తిరిగి వస్తున్నాము. మా డ్రైవర్ కలీం కారును నడుపుచున్నాడు. మేము ఒక చక్కని రాచబాట లాంటి రోడ్డుపైన వెళ్ళుచున్నాము. ఆ పట్టణానికి అది ముఖ్యమైన రోడ్డట. ఆ రోడ్డుకు ఇరువైపులా ఎన్నో బిల్డింగులు, షాపులు, రకరకాల మార్కెట్లు, ఎన్నో వచ్చిపోయే వాహనాలు, ఆ రోడ్డు వెంట నడిచే ఎంతోమంది జనాలతో, ఆ రోడ్డు కిటకిట లాడుతోంది. ఇలా కొంతదూరము వెళ్ళిన తరువాత ఆ రోడ్డుపైన సురేఖకు తెలిసిన ఒక ముఖ్యమైన వ్యక్తి కనబడ్డాడు. ఆయనను కలవాలనే ఆత్రుతతో కారును రోడ్డు ప్రక్కన ఆపమన్నది. ఆ తరువాత సురేఖ కారు దిగి ఆ వ్యక్తితో మాట్లాడుటకు ఆయన వద్దకు వెళ్ళింది. మేము మాత్రము కారులోనే ఉన్నాము. సురేఖ ఆ వ్యక్తి వద్దకు వెళ్ళి ఆయనతో రెండు నిమిషాలు మాట్లాడిన తరువాత వెను తిరిగేసరికి అక్కడ కారు కనబడలేదు. మేము ఆమెను వదిలేసి కారు తీసుకుని వెళ్ళిపోయామనుకుందామె. అయ్యో! ఇప్పుడెలా అని ఆశ్చర్యపోతూ ఆ మాట్లాడిన వ్యక్తి వైపు చూడగా ఆయన కూడా మాయమైపోయాడు. ఈమె మరింత ఆశ్చర్యానికి లోనైంది. అంతలో చుట్టుప్రక్కల ఇంతకు ముందు ఉన్నటువంటి బిల్డింగులు, షాపులు మాయమైనవి. ఒక్క వ్యక్తి కనబడలేదు. వచ్చిపోయే జనాలు కాని, వాహనాలు కాని ఏమీ లేవు. ఆ ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా ఒక వ్యక్తి గాని, ఇల్లు కాని, షాపు కాని లేవు. చివరికి రోడ్డు కూడా లేదు. మొత్తం పచ్చిక బయళ్ళతో, చెట్లు చేమలతో నిర్మానుష్యంగా ఉన్నది. ఈమెతో మాట్లాడువారు కాని, ఈమె మొర వినువారు కాని, ఈమెను చూచువారు కాని ఎవ్వరు లేరు. సురేఖ ఏకాకి. ఈ విధమైన పరిస్థితులలో ఏమి చేయాలో తెలియక, తనను నేను మోసగించానని భావించింది. నేను ఆమెను వదిలి వెళ్ళినానని భావించి బాధపడ్డది. చివరికి ఏమి చేయాలో తెలియక ఒంటరిగా ముందుకు నడువ ప్రారంభించింది. కల చెదిరింది.

తెల్లవారి ఉదయం ఈ విషయం చెప్పుచు, నేను ఆమెను వదిలి వెళ్ళినానని మా పిల్లలందరితో చెప్పింది. ఒకరకంగా మోసగించబడ్డానంది. చివరికి ఈ కల ఆంతర్యం గురించి నేను ఆమెకు ఇలా వివరించాను. ''నీవు ఈ పిల్లలు తనవారని భావిస్తూ వారితో కలిసి ఆనందంగా ఉంటున్నావు. కాని ఇది నిజం కాదు, ఒక క్షణం మాత్రమేనని, అసలు నిజ జీవితాన్ని శ్రీవేంకటేశ్వరుడు దర్శింపచేశాడు'' అని అన్నాను. మరియు మనమందరము నిజానికి ఏకాకులము, మనకు తోడు, నీడ, రక్ష, భగవంతుడే తప్ప మరొక్కరు ఉండరు అన్నాను. మన విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. దానిని నీకు అర్థం చేయించుటకు స్వామివారు కల్పించిన లీల ఇదని చెప్పాను. పిల్లలపై మమకారమును వదలి భగవంతునిపై భక్తి పెంపొందిస్తూ ఆయన సేవకే ప్రధాన విలువను ఇవ్వాలని సూచించాను. ఇదే స్వామివారు నీకు తెలుపదలచిందన్నాను. తరువాత రోజులలో ఇదే భావన తన మనస్సులో నిలిచి అదేవిధంగా తనను లాక్కెళుతుంది. దీనితో సురేఖలో కొంత మార్పు వచ్చింది.

## త్వరలోనే వంశాభివృద్ధి జరుగునని సూచించిన స్వామివారు

**తేది 10-04-2022 కల:** ఇది మా పెద్ద కోడలు చి|| సౌ|| పూజకు తేది 10-04-2022 నాడు వచ్చిన కల. ఆ సమయాన మేము అమెరికాలోని మా పెద్ద కొడుకు చి|| వేదాంత్ ఇంటిలో ఉన్నాము. ఈ మధ్య వీడు ఒక పూజామందిరమును కొన్నాడు. దానిని తేది 10-04-2022 శ్రీరామనవమి నాడు నేనే దేవుణ్ణి నిలిపి మొదటిసారి పూజ చేయాలని నిర్ణయించాను. ఒకరోజు ముందు అనగా తేది 09-04-2022 సాయంత్రం పూజకు కావలసిన అన్ని వస్తువులను కొని తెచ్చాము. వీరికి ఇంకా సంతానము కలుగలేదు. కావున శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించి సంతానం కలిగే విధంగా అనుగ్రహించమని ప్రార్థించాలనుకున్న ఈ శుభ సందర్భంగా, అదే విషయం పదే పదే ప్రార్థిస్తూ నా ప్రార్థనకు ఒక నిదర్శనాన్ని చూపవా ప్రభూ! అనుకున్నాను. స్వామివారు ఈ పూజ జరిగిన తరువాత



విస్తారంగా పెరిగిన మనీ ప్లాంట్ (కల 10-04-2022)

తప్పక చూపుదురనుకున్నాను. కాని ఈలోగా తేది 10-04-2022 ఉదయం, అంటే శ్రీరామనవమినాడు, ఈ పూజా మందిరమును ప్రారంభించకముందే నా కోడలు చి|| సౌ|| పూజ తనకు ఒక కల వచ్చిందని చెప్పింది.

**కల:** అందులో అంతకు రెండు రోజుల ముందు మా రెండవ కోడలు చి|| సౌ|| ప్రణీత తెచ్చిన చిన్న మనీప్లాంట్ విస్తారంగా పెరిగిందని, దాని తీగలు, ఆకులు, హాలు మొత్తం నిండిపోయిందని చెప్పింది. దీనిని చూచి ఆమె ఆశ్చర్యపోయిందట. ఇంత తొందరలోనే ఈ ప్లాంట్ ఇంత విస్తరించుట ఏంటి అని అనుకున్నదట. ఇంతే కల.

దీనిని నాకు ఈ ఉదయం 7.30 గంటలకు చెప్పింది. దీనిని విన్న నేను ఆనందానికి లోనైనాను. నేను స్వామివారిని పూజ జరిగిన తరువాత నిదర్శనము చూపమన్నాను. కాని అంతకుముందే చూపాడని సంతోషించాను. స్వామివారు ఇంత త్వరగా చూపుదురని అనుకోలేదని మా కోడలితో అన్నాను. ఆ తరువాత ఉదయం 10 గంటలకు తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆహ్వానించి పూజ చేసి విగ్రహాలను ప్రతిష్ఠించాము. ఈ కల శుభ సూచకమని, కుటుంబ విస్తరణకు సంకేతమని అన్నాను.

ఇలా నాకు ఒక మనవడు పుట్టబోవునని స్వామివారు సూచించుట ఇది నాలుగవసారి.

### విజయము సాధించుట – హరినామక్షేత్ర స్థలము సూచించుట

తేది 16-04-2022 న అమెరికాలో మా వదిన కూతురు చి|| సౌ|| కావ్య పెండ్లి ఉండుట వలన మేము తేది 14-04-2022 న వారింటికి వెళ్ళాము. తేది 15-04-2022 సాయంత్రం వారి ఇంటి వెనకాల గల మైదానములో సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నేను నా భార్య సురేఖ కూర్చున్న టేబుల్ లో సురేఖ పెద్దన్న మిత్రులు కుటుంబ సమేతంగా వచ్చి కూర్చున్నారు. వీరు అమెరికాకు 45 సంవత్సరాల ముందు వెళ్ళారట. వారందరూ మా సురేఖకు చిరకాల పరిచితులు కావడం వలన వారి గురించి అన్ని విషయాలు నాతో చెప్పింది. వీరు హైదరాబాద్ లో చాలా ధనవంతులట, ఆ కాలంలోనే కొన్ని కోట్లు విలువ చేసే ఆస్తిపాస్తులను వదిలి అమెరికాకు వచ్చారని నాతో చెప్పింది.

అంతకుముందు నుండే నేను వీలైనంతవరకు ఎవరితో మాట్లాడకుండా, శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, నా సంకల్పం నెరవేరే ఉపాయం గురించి ఆలోచిస్తున్న నాకు ఈ విషయం వినగానే నా మదిలో ఒక ఆలోచన వచ్చింది. 1970 లోనే కోట్లు విలువచేసే ఆస్తిని వదిలి ఈ అమెరికాకు వచ్చి పని చేస్తూ పైస పైస కూడబెడుతున్న వీరు నాకంటే ధన్యులనిపించింది. వీరి ఉదార స్వభావానికి సలాము చేశాను. వీరిని నాతో పోల్చుకుని నేను వీరికంటే అధముణ్ణని భావించుకున్నాను. 1970 లో కోట్లు విలువ చేసే ఆస్తిని ఇష్టపూర్వకంగా వీరు వదులుకున్నారని, నేను మాత్రం ఎన్నో అనుగ్రహాలు చూపిన నా స్వామి కోసం 'నా' అన్నది వదలలేని అధముణ్ణని భావించుకున్నాను. ఈ ఆలోచన రాగానే నా హృదయం ద్రవించింది. పశ్చాత్తాపంతో కళ్ళవెంట నీరు సుడులు తిరిగాయి. నేను కూడా మా చిన్నగుండవెల్లిలోని మా పిత్రార్జితమైన తోటబావి దగ్గరి భూమిని శ్రీవేంకటేశ్వరునికి అర్పించాలనిపించింది. ఇక్కడ హరినామ క్షేత్రము నెలకొల్పాలనిపించింది. మరియు ఊరిలోని మా ఇంటిని కూడా అర్పించి మహాలక్ష్మి మాత మందిరమును కట్టాలనిపించింది. ఇలా నాకున్న మొత్తం ఆస్తిని స్వామివారికి, వారి దేవేరులకు అర్పించాలనే బుద్ధి పుట్టింది. వారి ఆస్తి కంటే ఈ రోజు చూచినప్పటికీ నాది తక్కువ విలువదే అని భావించాను. ఈ భూమిని స్వామివారికి సమర్పించి నా సంకల్పం నెరవేరే విధంగా చేయాలనిపించింది. శరీరం రోమాంచితం చెందగా స్వామివారిని నా ఈ కోరికను నెరవేర్చమని వేడుకున్నాను. ఇన్ని రోజులు ఈ ఆలోచన రానందుకు సిగ్గుపడ్డాను.

బహుశా నా ఈ నిర్ణయము శ్రీవేంకటేశ్వరునికి ఆనందం కలిగించింది. ఎన్నో రోజుల నుండి హరినామ

క్షేత్రమునకు తగిన స్థలమును సూచించమని అడిగిన ప్రశ్నకు ఇంతవరకు జవాబు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ దిశగా అడుగు పడిందనిపించింది. శ్రీవేంకటేశ్వరుడు ఈ రాత్రి ఒక అద్భుతమైన విషయమును తెలిపి నన్ను ఆనందభరితుణ్ణి చేశాడు. తేది 16-04-2022 ఉదయం దాదాపు 4 గంటల ప్రాంతమున ఈ కల వచ్చింది.

నేను ఇంజనీరింగ్ విద్యనభ్యసించు సమయంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) లో తిరిగేది. ఒక పర్యాయం మా కళాశాలకు వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైనాను. 1985 లో నా ఇంజనీరింగ్ విద్య అయిపోయాక 1986 లో వచ్చిన అసెంబ్లీ ఎలక్షన్ లో సిద్ధిపేట నుండి ఎం.ఎల్.ఎ గురించి నామినేషన్ వేశాను. అదే సిద్ధిపేట నుండి శ్రీమాన్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు కూడా ఎం.ఎల్.ఎ గురించి నామినేషన్ వేశారు. ఆ తరువాత నేను ఆయన మాటపై విరమించుకున్నాను. శ్రీమాన్ చంద్రశేఖర్ రావు గారు మొదటిసారి అప్పుడే ఎం.ఎల్.ఎ గా గెలిచారు. నేను కొన్ని రోజులు ఆయనతో తిరిగి రాజకీయాలు నచ్చక వ్యాపారము వైపు మళ్ళాను. ఆ తరువాత 2014 లో ఆంధ్రప్రదేశ్ తో విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. తెలంగాణకు శ్రీమాన్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నికై నేటికీ కొనసాగుతున్నారు. ఆ తరువాత ఆయనను ఎప్పుడూ కలవలేదు. కాని ఆయన నా విషయంలో నేను ఒక లీడర్ గా ఎదగాలని ప్రయత్నిస్తున్నట్లు ఎప్పటికీ భావించువాడు. నా గురించి ఆయనకు అదే అభిప్రాయము ఉన్నది.

శ్రీవేంకటేశ్వరుడు ఇప్పుడు ఈ విషయాన్ని ఉపయోగించుకుని ఈ క్రింది లీలను చూపాడు.

**తేది 16-04-2022 కల :** ఎన్నో సంవత్సరాల నుండి ప్రయత్నించినా విజయం సాధించలేని ఒకానొక విషయంలో నేను విజయం సాధించానట. చాలా ఆనందంగా ఉన్నది. ఒక ఎం.ఎల్.ఎ లేదా ఎం.పి గా గెలిచినంత ఆనందంగా ఉన్నది. కాని అది పబ్లిక్ ఎలక్షన్ లో కాదట మరో విషయంలో, ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నాను. ఈ పోస్టుకు ఎప్పుడు ప్రమాణ స్వీకారము చేయాలనే విషయాన్ని చర్చించుటకని, మరియు శుభాకాంక్షలు తెలుపుటకని ఆ ప్రాంతపు అత్యంత పెద్ద అధికారి, పాలకుడైన ముఖ్యమంత్రి గారి ఆఫీసుకు నేను మరియు నా భార్య సురేఖ వెళ్ళాము. అప్పటి ముఖ్యమంత్రి




విజయం సాధించిన తర్వాత సీయం కేసీఆర్ గారితో మాట్లాడుట (లీల 16-04-2022)

శ్రీమాన్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి ఛాంబర్ లో ఆయన ముందు కూర్చున్నాము. ఆయన టేబుల్ ముందు మొత్తం 3 కుర్చీలు ఉన్నవి. అందులో ఎదురుగా, మధ్యలో ఉన్న కుర్చీలో నేను, నాకు ఎడమ ప్రక్కనున్న కుర్చీలో సురేఖ కూర్చున్నాము. శ్రీమాన్ చంద్రశేఖర్ రావు గారు తన కుర్చీలో కూర్చుని తలను క్రిందికి వంచి ఏవో ముఖ్యమైన ఫైల్స్ ను చూస్తున్నారు. మేము వచ్చి తన ముందు కూర్చున్న విషయం ఆయనకు తెలుసు. ఏం? ఎలా ఉన్నది? అని మమ్మల్ని అడిగారు. అంటే ఈ విజయ ఆనందం ఎలా ఉన్నదని అర్థం. చాలా రోజుల తర్వాత సిద్ధించిన విజయం కనుక ఎలా ఉన్నదని దీనర్థం. మరియు ప్రమాణ స్వీకారం ఎప్పుడు పెట్టుకుంటావని అడిగారు. దానికి నేను ''మీ ఇష్టం మీరు ఎప్పుడంటే అప్పుడే'' అని అన్నాను. అందుకు ఆయన రేపు సిద్ధిపేట లీడర్స్ అందరినీ పిలుస్తున్నాను అని నన్ను రేపు రమ్మన్నారు. అంటే సిద్ధిపేట లీడర్స్ అందరిముందు, వారి సమక్షంలో నా ప్రమాణ స్వీకారం చేయించుదుననే అర్థం వచ్చే విధంగా అన్నారు. కల చెదిరింది.

ఇలా నేను ఒక అమోఘమైన కలను కన్నాను. నా సంకల్ప సిద్ధికి పునాది వంటి కలను తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించారు.

## 7 ఎకరాల భూమిని సమర్పించుట

తేది 16-04-2022 ఉదయం కలలో నేను విజయం

సాధించానని తెలిపిన వెంటనే, మా తోటబావి వద్ద 7 ఎకరాల స్థలమును మరియు హైదరాబాద్ లో నాకున్న కొన్ని ఆస్తులు అమ్మి స్వామివారి ఆలయమైన హరినామ క్షేత్రాన్ని నిర్మించాలని వెంటనే నిర్ణయం తీసుకున్నాను. చిన్నగుండవెల్లిలో మా పిత్రార్జితమైన భూమి నుండి 7 ఎకరములు హరినామ క్షేత్రం గురించి స్వామివారికి సమర్పించాను. మరియు హైదరాబాద్ లోని నా సొంత సంపాదన నుండి కొంత వెచ్చించి ఈ హరినామ క్షేత్రం నిర్మించాలని నిర్ణయించుకున్నాను. ఈ నిర్ణయం తేది 16-04-2022 కల కని లేచిన వెంటనే క్షణం ఆలస్యం చేయకుండా తీసుకున్నాను. స్వామివారు నా నిర్ణయాన్ని తప్పక స్వీకరించగలరని విశ్వసించాను.

మరో విషయం. స్వామివారు మా తోటబావి వద్ద తన హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమని చెప్పినప్పుడు, నేను ఇంతవరకు పొందిన అన్ని అనుభూతుల దిశ మారినట్టు అనిపించింది. స్వామివారు చూపిన ప్రతి లీల చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్దకే దారి తీసినట్లు అనిపించింది. ఊరిలోని మా ఇల్లును, తోటబావిని ఉపయోగించి ఎన్నో అనుభూతులను ప్రసాదించారు. నా మొదటి అనుభూతిలో శ్రీ ఆంజనేయుల వారు 'జై శ్రీరాం' అంటూ మా తోటబావి వద్ద ఉన్న పశువుల కొట్టం ముందు కనబడ్డాడు. పశువుల కొట్టం అడుగు భాగంలోనే హరినామ క్షేత్రం నిర్మించాలని స్వామివారి ఆదేశంగా భావించాను. ఒక పర్యాయం మా తోటబావిని ఉపయోగించి "పూర్వం అల్పాయుష్కుడైన మార్కండేయుని ఏవిధంగా పూర్ణాయుష్కునిగా చేశాడో నాకు జన్మ జన్మల స్వామివారి సేవాభాగ్యం కలుగునట్లు" చేస్తానన్నాడు. దీనర్థం నేను మా తోటబావి వద్ద హరినామ క్షేత్రం ఏర్పాటు చేస్తే తరతరాలుగా నా కారణంగా స్వామివారు స్మరించబడుదురు, మరియు భక్తులకు స్వామివారి అనుగ్రహము లభిస్తూ ఉంటుంది. ఇదే దీని నిజమైన అర్థమని భావించుకున్నాను. హరినామ క్షేత్రము పైన ఇతరుల పెత్తనం ఉండకూడదని నేను భావించినట్లే స్వామివారు ప్రసాదించారని మురిసిపోయాను. మరియు ఈ క్షేత్ర సాధనలో నా ఒక్కరి ప్రయత్నమే కాకుండా నా తల్లితండ్రులది, వంశం, ఊరు, ప్రాంతం, శ్రీవేంకటేశ్వరుని సమస్త భక్తుల సహకారం సమయానుసారం తీసుకుంటారనే భావమేర్పడింది. స్వామివారి లీల ఏదో తెలియదు కాని, మా తండ్రి చనిపోవుటకు 15 సంవత్సరాల ముందే నేను మైనర్ గా ఉన్నప్పుడు మా తోటబావి మొత్తం గుడ్డమును నా పేరుపై ఇష్టపూర్వకంగా మార్పు చేశాడు. ఇది తన స్వార్జితము కాబట్టి ఈ గుడ్డములో నా చెల్లికి గాని, పుత్రులకు కాని ఎలాంటి అధికారం లేకుండా జరిగింది. మరో విషయం. నా చిన్నతనంలో మా తల్లితండ్రులు ఇక్కడ దేవుడున్నాడని భావించి నా ఆరోగ్యం కోసం ప్రతి సంవత్సరం ఒక పండుగ చేసేవారు.

ఇవన్నీ ఆలోచిస్తే ఒక్కసారి నా మనస్సు మారిపోయింది. స్వామివారు ఒక పథకం ప్రకారం మమ్ములను నడిపించారనే భావమేర్పడ్డది. నా పుట్టుక రూపురేఖలు, విద్యాభ్యాసము, అభిరుచులుఅన్నీ ఈసంకల్పానికిఎంతోఅవసరమనిపించింది.

మొత్తం మీద స్వామివారు మా తోటబావిని స్వీకరించుటతో నేనెంతో పరవశించిపోయాను. మొదట నమ్మశక్యం కాలేదు. అసలు నేను చూచింది, విన్నది నిజమేనా? అనే అనుమానంతో మరోసారి చెప్పమని ప్రార్థించాను. మా తోటబావి వద్ద మీ హరినామ క్షేత్రం ఏర్పాటుకు అవకాశం ఇవ్వమని, దానిని స్వీకరించమని వేడుకున్నాను. ఈ విషయాన్ని నాకు స్పష్టంగా అర్థం అయ్యేవిధంగా మరోసారి తెలిపేవరకు మీ పాదాలను పట్టుకుంటానని, నా ప్రశ్నకు జవాబు తెలిశాకే వదులుదునని చెప్పి ఆయన రెండు పాదాలను గట్టిగా పట్టుకున్నాను. ఆయన ఎక్కడికి వెళితే నేను కూడా ఆ పాదలను పట్టుకుని వ్రేలాడుతూ వెళ్ళుదునని తెలిపాను. రాత్రింబవళ్ళు ప్రతిక్షణం మీ పాదాలను వదలనని విన్నవించాను.

కాని స్వామివారు ఒక్క విషయమును కేవలం ఒక్కసారి మాత్రమే చెప్పుదురు. దానిని గుర్తుపెట్టుకుని ఆచరించుట నా వంతు. ఇలా కొన్ని రోజులు ప్రార్థించినప్పటికీ స్వామివారు మళ్ళీ చెప్పనందున విరమించాను.

ఒక సందర్భంలో కళ్యాణాల కార్యక్రమమునకు అనుమతించుమని నేను అమ్మవారిని ప్రార్థించిన సందర్భంలో ఆమె తనకు చిన్నగుండవెల్లిలో ఇల్లు ఉన్నదని, నన్ను ఆ ఇంటికి రమ్మని ఆహ్వానించింది. కాబట్టి అమ్మవారికి చిన్నగుండవెల్లిలోని మా సొంత ఇల్లును సమర్పించుదామని భావించినప్పటికీ, చివరికి మా తోట వద్ద, హరినామ క్షేత్రం ప్రక్కన పెద్దలను సంప్రదించి అనువైన స్థలములో నిర్మించుట ఉత్తమమనే భావనకు వచ్చాను. నాకు అమ్మవారు అనగానే కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి మాత్రమే గుర్తుకు వస్తుంది. కాబట్టి

ఇక్కడ స్వామివారికి తిరుమల ఆలయం లాగా, అమ్మవారికి కనీసం గర్భగుడి వరకైనా కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి ఆలయ నమూనాతో నిర్మించాలనిపించింది. కాని ఈ విషయంలో పెద్దలను సంప్రదించి తగు నిర్ణయం తీసుకుంటాననుకున్నాను.

## తగిన సౌకర్యాలు ఏర్పరచుటకు నిర్ణయం

తేది 25-04-2022 నుండి తేది 29-04-2022 వరకు ఈ క్రింది విధంగా ఆలోచనలు వచ్చాయి.

స్వామివారు 2002 సంవత్సరంలో నాకు సేవను ప్రసాదించినప్పుడు, ఆయనకు బొట్టుపెట్టే సంకల్పమును తీసుకొమ్మని సూచించారు. దానికి నేను 111 కోట్ల జపమును సమర్పించి బొట్టు పెట్టుదుననే సంకల్పమును తీసుకున్నాను. ఆ తరువాత బొట్టు పెట్టి మిమ్ములను వదలను ప్రభూ! మా ఇంటికి ఆహ్వానిస్తానని నిర్ణయించుకున్నాను. అంటే... బొట్టు పెట్టమంటేనే ఇంటికి ఆహ్వానించిన నేను, రేపు ఆయన సంకల్పం ప్రకారం నా వద్దకు వచ్చిన స్వామివారిని తిరిగి పొమ్మనగలనా? పొమ్మనుటకు నాకు నోరు వచ్చునా? ఆయన తిరిగి వెళ్ళుటను సహించగలనా? కనీసం స్వామివారి ఒక్క అంశను ఇక్కడ స్థిరీకరించమని ప్రార్థిస్తే... ఆయన ఎక్కడ ఉండాలి? ఈ ఆలోచన వచ్చింది. ఆయన ఉండుటకు తగిన ఇల్లు హరినామ క్షేత్రం అనుకున్నాను. నేను ఆయన సేవకుడను కాబట్టి నా ఒక్కని కొరకు కాకుండా లోకం కోసం, తన భక్తుల కోసం ఆయన తప్పక వచ్చును. కాబట్టి ఈ భాగ్యం భక్తులందరికీ పంచాలనే భావమేర్పడింది. ఈ హరినామ క్షేత్రానికి స్వామివారు తిరుమల నుండి రావాలి, నాకు మరియు ఆయన భక్తులకు ఈ భాగ్యం లభించాలి. ఆయన అంశ ఒకటి ఈ క్షేత్రములో స్థిరనివాసముండాలి అనే కోరిక బలంగా ఏర్పడ్డది. తిరుమలలో స్వామివారికి ఉన్న సౌకర్యాలను, చేతనైనంత వరకు సమకూర్చాలనిపించింది.

## సురేఖకు జ్ఞానబోధ

మా రెండవ కొడుకు చి|| అరవింద్ రెడ్డి పెండ్లి జరిగిన వెంటనే కోవిడ్ వచ్చింది. కాబట్టి అప్పటినుండి (2020) పిల్లలు అమెరికాలో, మేము ఇండియాలో ఉన్నాము. దాదాపు రెండున్నర సంవత్సరాల తరువాత కొడుకులు కోడళ్ళతో ఉండుట సురేఖకు ఎంతో ఆనందాన్నిచ్చింది. నాకు మాత్రం అమెరికాలో ఎక్కువ రోజులు ఉండకూడదని ఉన్నది, కాని సురేఖకు మాత్రం మరిన్ని రోజులు ఉండాలనే కోరిక కలిగింది. దీనిని గ్రహించిన శ్రీవేంకటేశ్వరుడు సురేఖకు ఈ క్రింది కలను చూపించి, వెంటనే హైదరాబాద్ వచ్చేలా చేశాడు.

తేది 15-05-2022 కల : ఈ కల సురేఖకు వచ్చింది. హైదరాబాద్ లో మా ఇంటిలో ఉన్న పనిమనిషి, అమెరికాలో ఉన్న ఇంటిలో కూడా పని చేస్తోందట. ఆమె ఎవరూ చూడటం లేదని మంచి కూరగాయల పైన విరక్తితో ఉప్పునీరు పోసి, వాడిపోవునట్లు చేసి వాటిని బయట పడేస్తోందట. కాని దీనిని సురేఖ జాగ్రత్తగా గమనించిందట. ఇంతే కల.

దీని భావాన్ని నేను సురేఖకు ఈ విధంగా చెప్పాను. నీవు మరిన్ని రోజులు ఇక్కడ ఉందామనుకుంటున్నావు, కాని ఒక్కరోజు పొడిగించినా మన పిల్లలకు నీపై విరక్తిభావం కలుగునని స్వామివారు చెప్పారని అన్నాను. పిల్లలు బయటకు చెప్పలేక లోన విరక్తి భావంతో ఉందురని అన్నాను. దీనితో సురేఖ తన మనస్సు మార్చుకుంది.

## తిరుమల ఆలయం మాదిరిగానే కట్టమనుట

మా తోటబావి వద్ద హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమనే ఆదేశమును పొందిన తరువాత ఇక ఈ ఆలయ నమూనా గురించి రకరకాల ఆలోచనలు వచ్చాయి. (2009 సంవత్సరంలో మొదటిసారి హరినామ క్షేత్ర భావన వచ్చినప్పుడు తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించాలనే భావనను మరచాను.) నాకు తెలిసిన ఎన్నో ఆలయ నమూనాలను చూచుకున్నాను. చిక్కడపల్లి, జూబిలీహిల్స్ లో ఉన్న శ్రీవేంకటేశ్వరుని ఆలయాల మాదిరి, లేదా ఈ రెండింటి మధ్యన మరో ప్లాన్ ఆలోచించాను. ఒకరోజు తిరునామం ఆకారంలో, మరోనాడు శంకు ఆకారంలో నిర్మించాలనిపించింది. ఈ విధమైన ఆలోచనలతో ఒక నెల రోజులు కుస్తీ పట్టాను. చివరికి తేది 21-05-2022 శ్రవణా నక్షత్రం రోజు డల్లాస్ లోని ప్రిన్స్ కాలనీ శ్రీవేంకటేశ్వర ఆలయానికి దర్శనార్థం వెళ్ళాము. స్వామివారిని చూడగానే నా ఆత్మీయుణ్ణి చూచినంత ఆనందం కలిగింది. చాలాసేపు ఆయనను చూస్తూ ఉండిపోయాను. పదే పదే అణువణువు ఆపాదమస్తకం దర్శించాను. నా ఆనందానికి హద్దులు లేవు. ఒక సందర్భంలో ఆనందం పరాకాష్ఠకు చేరింది. ఆ తరువాత ఆయనకు కొన్ని ప్రదక్షిణలు చేసి మళ్ళీ ప్రార్థించాను. ప్రభూ! నా మనస్సును మీ పాదపద్మాల యందు మాత్రమే స్థిరముగా

ఉండునట్లు అనుగ్రహించమని, మా ఊరిలో హరినామ క్షేత్రమును నిర్మించి, అఖండ హరినామ స్మరణ ఏర్పాటు చేసే విధంగా అనుగ్రహించుమని, నా మనస్సు దానియందే నిమగ్నమయ్యే విధంగా చూడమని వేడాను. కళ్యాణాల కార్యక్రమమును ఏ ఆటంకం లేకుండా జరిపించమని ప్రార్థించి, కొంతదూరం వెళ్ళి స్వామివారికి ఎదురుగా కూర్చున్నాను. స్వామివారిని అలాగే చూడాలనిపించింది, కావున భక్తులకు ఇబ్బంది లేకుండా ఆ ఆలయంలో వెనుకకు వెళ్ళి ఆయనకు ఎదురుగా కొంత దూరంలో కూర్చుండి స్వామివారిని చూస్తున్నాను. మా వాళ్ళు అంటే నా భార్య, కొడుకు, కోడలు నాకంటే ఇంకా వెనకకు వెళ్ళి కుర్చీలపై కూర్చున్నారు. అప్పుడు స్వామివారు నేను మాత్రమే దర్శించే ఈ క్రింది లీలను చూపారు.

తేది 21-05-2022 లీల : తిరుమలలోని ఆలయం, దానిలోని ప్రథమ ప్రాకారం వరకు గల వివిధ భాగములు, ఆ తరువాత రెండవ ప్రాకారం వరకు గల వివిధ భాగములు, ఆ తరువాత 3వ ప్రాకారం వరకు గల భాగాలు స్పష్టంగా నా కళ్ళలో మెదిలాయి. ముఖ్యంగా ప్రథమ ప్రాకారం వరకు అంటే స్వామివారు, శయన మండపం, రాములవారి మేడ, ఇలా పూర్తిగా గరుడాళ్వార్ వరకు, ఆ తరువాత వెండివాకిలి వరకు గల వివిధ భాగములు అత్యంత ప్రకాశవంతంగా కనబడ్డాయి. చివరికి స్వామివారి హరినామక్షేత్రం తిరుమల ఆలయ ప్రతిరూపం లాగ మాత్రమే ఉండవలెననే అభిప్రాయం ఏర్పడ్డది. వెండివాకిలి వరకు కడితే సరిపోతుందని, అక్కడ ఆలయం మరియు హరినామస్మరణ కేంద్రం విడివిడిగా ఏర్పాటు చేసుకోవచ్చనిపించింది. దీనిని మొదలుపెట్టినప్పుడే చక్కని పూర్తి ప్లాన్ వేసి నాకు చేతనైనంతవరకు తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మిస్తూ మిగిలిన దానిని భవిష్యత్ తరాల భక్తులకు వదిలివేయాలనిపించింది.

ఇది నేను స్వామివారి ఎదురుగా ఉన్నప్పుడు కలిగిన భావన. కనుక నిన్నటి రకరకాల నమూనాల స్థానంలో దీనిని పెట్టమని స్వామివారు ఆజ్ఞ ఇచ్చారనుకున్నాను. నిజానికి హరినామక్షేత్ర ఆలోచన కలిగినప్పుడు తిరుమల ఆలయానికి ప్రతిరూప ఆలయమును నిర్మించాలని అనుకున్నాను. అదే అసలైన సంకల్పం. కాని ఇది సాధ్యపడదని భావించి ఇతర నమూనాలను వెతికి, ఆర్థిక ఇబ్బందులు అంతగాలేని మోడళ్ళను ఎంచుకున్నాను. కాని స్వామివారు అలా చేయవద్దని, తిరుమల ఆలయ ప్రతిరూపమునే చేయమని ఆజ్ఞ ఇచ్చారు.

నిజానికి ధ్రువమూర్తి నుండి గరుడాళ్వార్ వరకు గల ఆలయం ముఖ్యం. దీనిని యథావిధిగా నిర్మించాలి. కాని ఈ మొత్తాన్ని శాస్త్రోక్తంగా చేయుటకు వెండివాకిలి వరకు నిర్మించవలసి ఉన్నది. దీనిలో మనకు కావలసిన కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవచ్చును. మరో రకమైన భావన ఈ క్రింది విధంగా కలిగింది.

## వ్యతిరేక భావాలను లెక్క చేయరాదు

హరినామ క్షేత్రమును చిన్నగుండవెల్లిలో మొదలుపెట్టినప్పుడు చాలా బలమైన వ్యతిరేక భావాలు, నీవు చేయలేవని, ఇక్కడ ఉండలేవని, ఈ ప్రాంతం తగదని, ఇలాంటి రకరకాల భావనలు నాయందు కలుగును. వీటిని లెక్కచేయకుండా ముందుకు వెళ్ళి సంకల్పాన్ని సాధించాలి. ఇదే శ్రీవేంకటేశ్వరునికి ఇష్టమైన పని, దీనినే స్వామివారు మెచ్చుకుందురు, మరియు నా కర్తవ్యం కూడా ఇదే అని ముందుకెళ్ళాలనిపించింది. ఈ విషయాన్ని జాగ్రత్తగా గుర్తుంచుకొని పాటించాలి అని నిర్ణయించుకున్నాను.

తేది 23-05-2022 : గత రాత్రి దాదాపు 2.15 గంటలకు మెలకువ వచ్చి నిద్ర పట్టలేదు. శ్రీవేంకటేశ్వరునికి భక్తులపై నున్న ప్రేమ గురించి, ఆయన లీలల గురించి, ఆయన నాచే చేయించు పనుల గురించి ఆలోచనలు వచ్చాయి. స్వామివారు మా జీవితంలోకి ఎలా ప్రవేశించారు? నేను మొదట స్వామివారి లీలల లోనికి ఎలా లాగబడ్డాను? ఏవిధమైన లీలలను మొదట ప్రయోగించాడని ఆలోచిస్తూ ఆశ్చర్యపోయాను. నేను ఇప్పటి వరకు 22 సంవత్సరాల క్రితం నుండి ఆయన లీలలను చూస్తున్నాను. కొన్ని వేల లీలలను అనుభవించాను. ఆయన సేవను గత 20 సంవత్సరాల నుండి చేస్తున్నాను. కాని ఇంతవరకు ఆయన నాచే చేయించు లీలల లక్ష్యం గురించి పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. గత సంవత్సరం నుండి 'నా' అన్నదానిని కొంతవరకు వదిలిన తరువాతనే ఆయన లక్ష్యాల గురించిన విషయాలు అర్థం కాసాగాయి. అంతకుముందు నాకే లీలలను చూపాడు, నా చేతనే ఆయన సేవ జరుగుచున్నప్పటికీ, ఆయన అసలు రహస్యాన్ని అర్థం చేసుకోలేదు. చివరికి ఆయన ఆదేశం మేర, ఆయనకు సంపూర్ణ శరణాగతుడనై ''సంకల్ప సిద్ధే

నా లక్ష్యం'' అని భీష్మించుకున్న అనంతరం మాత్రమే నేను ఆయన లీలల గురించిన విషయాలను కొంతవరకు తెలుసుకోగలిగాను అని భావించాను.

## తోటబావి వద్ద - మార్గం వెడల్పు చేయమనుట

స్వామివారు చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద తన హరినామ క్షేత్రమును స్థాపించమన్నారు. ఇది వినగానే నా ఆనందానికి హద్దులు లేవు. నేను విన్నది నిజమేనా? మరోసారి చెప్పమని స్వామివారిని ప్రార్థించాను. కాని స్వామివారు మళ్ళీ చెప్పలేదు. కాని ఈ రోజు ఒక ద్వంద్వార్థాన్ని ఉపయోగించి ఇది నిజమే అని తెలిపారు. నేను ఎంతో ఆనందించాను. ఆ లీల ఈ క్రింది విధంగా ఉన్నది.

**తేది 09-06-2022 కల:** మా తోటబావి ముందు ఉన్న రోడ్డుకు (పానాదికి) ఒకవైపు మేముంటే, మరోవైపు గొల్ల ఎల్లయ్య అనే వారుంటారు. ఈ కలలో మా తోటబావి వద్ద కల రోడ్డును (పానాదిని) తగ్గించి గెట్టుసాలుకు గల చెట్లు తనవైపు వచ్చేలా ఆక్రమించి మా ప్రక్కనున్న గొల్ల ఎల్లయ్య కొడుకులు కాంపౌండ్ వాల్ ను కట్టుచున్నారు. దానిని చూచి నేను సహించక తీసివేశాను. ఇది మా తోటబావి వద్ద జరిగింది, వీరు రెండు రోజుల క్రితం ఈ రోడ్డు స్థలమును ఆక్రమించి గోడ కట్టారు. అది ఇంకా పచ్చిగా ఉన్నది. కావున నేను దానిని సహించక నా రెండు చేతులతో ఆ గోడను క్రింద పడే విధంగా లాగాను. ఇంతే కల.

అంటే ఆ మార్గంలో ఎవ్వరినీ ఆక్రమించనీయక, వెడల్పు చేయమని స్వామి ఆజ్ఞ. మరోవిధంగా స్వామివారు మా తోటబావిని స్వీకరించారని పూర్తి నమ్మకం ఏర్పడ్డది. ఎంతో ఆనందించాను.

## కలిసి జీవించే భాగ్యం ప్రసాదించమనుట

**తేది 11-06-2022 :** ఈ రోజు స్వామివారిని ఒక అద్భుతమైన కోరికను కోరాను. నేను స్వామివారితో కలిసి జీవించే భాగ్యాన్ని ప్రసాదించమని ప్రార్థించాను. అంటే స్వామివారిని ఆహ్వానించి నాతోపాటు నివసించమని మొదటిసారి అనుకోకుండా ప్రార్థించాను. ఈ భావం నా హృదయాంతరంగం నుండి వచ్చింది కావున ప్రార్థన చేయు సమయాన శరీరం పులకించింది. ఆనంద బాష్పాలు రాలుతుండగా అత్యంత దీనంగా ప్రార్థించాను. ఈ కోరిక మొదటిసారి నా నోటివెంట వచ్చింది.


**మరో విషయం :** స్వామివారు ఈసారి నేను సంకల్పాన్ని నెరవేర్చే విధంగా చాలా గట్టిగా దిశా నిర్దేశం చేశారు. నా మనస్సును కేవలం స్వామి నామస్మరణ, సేవ మీద మరియు సంకల్పాన్ని ఎలా నెరవేర్చాలి, కళ్యాణాలను ఎవరు చేసుకుందురు? వారిని ఏవిధంగా సంప్రదించాలి? ఎప్పుడు ఎలా ఎవరిని అనే విషయాలు మాత్రమే ఆలోచించాలి. కాని ఇతరములైన విషయాల పట్ల నా మనస్సు వెళ్ళకూడదు అని చెప్పారు. నేను కూడా ఇతరములైన విషయాల పట్ల శ్రద్ధను పూర్తిగా తగ్గించుకున్నాను. కాని ఎప్పుడైనా నా మనస్సు ఇతరములైన, లౌకిక విషయాల పట్ల మళ్ళినా, సినిమాలు చూసినా, కొంత తడవు దానికై ఆలోచించినా ఆ రాత్రి నాకు నిద్ర పట్టదు. నిద్రకై చాలా బాధపడవలసి వచ్చేది. అమెరికాలో ఉన్నప్పుడు మరియు హైదరాబాద్ వచ్చాక కూడా ఇదేవిధంగా జరుగుచున్నది. నేను నా అనుభవపూర్వకంగా తెలుసుకుని, తిరిగి తప్పైంది ప్రభూ! క్షమించు అన్న తరువాతనే తిరిగి నిద్ర పట్టుచున్నది. ఈ నిబంధనకు నా ప్రభువుకు శతకోటి ప్రణామాలర్పించాను.

అమెరికా నుండి హైదరాబాద్ వచ్చిన తరువాత తేది 24-06-2022 నాడు తిరుపతి ఆగమ పండితులైన శ్రీమాన్ పండిత వేదాంతం విష్ణు భట్టాచార్యులతో స్వామివారి సంకల్పంచి గురించి, వారు మా ఊరిలో మొదటి ప్రాకారం వరకు ఆలయాన్ని నిర్మించి హరినామ క్షేత్రమును స్థాపించమన్నారని చెప్పాను. ఆలయాన్ని ఆగమోక్తంగా నిర్మించుటలో సలహాలను కోరాను. దీనికి వారు ఎంతో సంతోషించి ఒప్పుకున్నారు. మా తోటబావిని చూచుటకు వస్తానన్నారు.

## జీవచ్ఛవము లాగా ఉండకుమనుట

**తేది 07-07-2022 :** ఈ రాత్రి ఒక కల వచ్చింది. దీనిని చూచాక దీని అర్థం ఏమిటి, ఇలా ఎందుకు వచ్చింది అని అనుకున్నాను. కాని ఒకరోజు గడిచాక ఆలోచిస్తుండగా స్వామివారు దయ తలచి దీని అర్థమును తెలిపారు.

నేను విజయం సాధించానని తేది 16-04-2022 నాడు స్వామివారు తెలిపారు. ఆ తరువాత కూడా ఈ విషయం పట్ల జాగరూకుడవై ఉండమని అన్నారు. ఈ విషయం గురించి నాకు భవిష్యత్తులో ప్రోత్సాహం లేకపోవుట కాని,




జీవచ్ఛవము లాగ ఉండకుమనుట (లీల 07-07-2022)

అక్కడ లేకున్నా అక్కడే ఉన్నట్లు కనబడ్డది. కల చెదిరింది.

దీనర్థం - నేను నా సంకల్పాన్ని ఏనాడూ జీవచ్ఛవము లాగా చేయకుమని స్వామివారి ఆదేశంగా భావించాను.

## 62 వ పుట్టిన రోజు కోరిక

**తేది 10-07-2022 :** ఈరోజు తొలి ఏకాదశి. ఇది నా 62వ పుట్టిన రోజు. ఒక కోరికను కోరాను. నేను నా స్వామివారి సంకల్పమును నెరవేర్చాలి. స్వామివారు మా చిన్నగుండవెల్లిలో స్థిరనివాసము ఏర్పరచుకుని ఆ ప్రాంతపు ప్రజలను అనుగ్రహించాలి. ఇదే నా 62వ పుట్టిన రోజు కోరిక అని ప్రార్థించాను. ఈరోజు కాకతీయనగర్ శ్రీ రామాలయంలో భజగోవిందం మరియు 20వ శ్రీనివాస కళ్యాణము జరిగింది.

ఎందుకు ఇంత శ్రమ, ధనం ఖర్చు మరియు చిన్నగుండవెల్లి గ్రామంలో నేను ఉండలేననే భావం రావచ్చును. కావున అవేవీ పట్టించుకోకూడదని వ్రాసుకున్నాను. ఇదే విషయాన్ని శ్రీవేంకటేశ్వరుడు ఈ కల రూపంలో మళ్ళీ చూపాడు.

**07-07-2022 కల :** ఒక ఇద్దరు వ్యక్తులను, హడావిడిగా, ఏదో అత్యవసర సమస్య ఉందని భావించి, వారికి సంబంధించిన వ్యక్తులు ఈ ఇద్దరినీ ఒక హాస్పిటల్ లోని ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. అందులో ఒక వ్యక్తి నల్లగా 6 అడుగుల ఎత్తుతో దాదాపు 40 సంవత్సరాల వయస్సు వరకు ఉంటాడు. ఈయనను హాస్పిటల్ సిబ్బంది ఒక పడకమీద పడుకోబెట్టి, ఊపిరి ఆడటం లేదని భావించి, హార్ట్ ఎటాక్ వచ్చినవారి ఛాతీపైన ఊపిరి తీసుకొనుటకై రెండు ఇస్త్రీపెట్టె లాంటి పరికరాలను పెట్టి కరెంట్ షాక్ ఇచ్చెదరో ఆ విధంగా ఇస్తున్నారు. కాని ఆయనలో ఎలాంటి చలనము కనబడలేదు. ఇలా ఒక మూడు నాలుగు సార్లు ప్రయత్నించారు. కాని ఎలాంటి చలనము కనబడలేదు. చివరికి వారు ఆశ చాలించుకున్నారు. అప్పుడు నా చూపు ఆయన ముఖము పైకి వెళ్ళింది, ఆయన కళ్ళు మామూలుగానే ఉన్నాయి. శ్వాస తీసుకుంటున్నట్లుగానే కనపడ్డారు. అసలు ఆయనకు ఏమీ కాలేదనిపించింది. కాని కదలక మెదలక చూచేవారికి జీవచ్ఛవము లాగా ఉన్నాడు. నిజానికి నేను

## మా తండ్రిని నా వద్దకు పంపుట, స్వామివారిని శాశ్వత నివాసమేర్పరచుకొమ్మనే ప్రార్థన

చిన్నగుండవెల్లిలో 21 వ కళ్యాణమును తేది 30-07-2022 శనివారం నాడు చేయ నిశ్చయించాము, తగిన ఏర్పాట్లు జరుగుచున్నవి. ఒకరోజు ఉదయం నేను ప్రాణాయామం చేయు సమయాన ''చిన్నగుండవెల్లి కళ్యాణ సమయాన తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆహ్వానించి మా ఊరిలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోండని'' ఊరందరిచే ప్రార్థింప చేయాలనే విధంగా భావన కలిగింది. ఇది స్వామివారు వారి ఆజ్ఞగా నాకు కలగజేసిన సంకల్పం అని భావించాను. మరియు నేను చిన్నగుండవెల్లిలో 21వ కళ్యాణము చేస్తున్నానని, నాకు తోడుగా మా తండ్రి గారిని పంపమని స్వామివారిని దీనంగా వేడుకున్నాను. స్వామివారు మా తల్లి తండ్రులను నా వద్దకు పంపుచున్నానంటూ ఈ క్రింది లీల చూపాడు.

**తేది 21-07-2022 కల :** ఈ రోజు అనగా తేది 21-07-2022 ఉదయం దాదాపు 5 గంటల ప్రాంతమున ఒక కల వచ్చింది. అందులో నేను ఒక నూతన ప్రదేశానికి బహుశా కళ్యాణానికి పోయానట. అక్కడ ఉండుట కొరకై లాడ్జింగులలో గదులకై వెతుకుచున్నాను. రోడ్డుకు ఇరుప్రక్కలా

షాపులు, లాడ్జింగులని రకరకాల బోర్డులు కనబడ్డవి. నాకు ఎవరో ఒకరు ఒక లాడ్జిలో లేదా బస చేసే సత్రము లాంటి దానిలో ఒక గదిని ఏర్పాటు చేశారు. నేను దాని లోనికి వెళ్ళి చూచాను. బాగానే ఉన్నది. నాతో పాటు స్వర్గీయ మా అమ్మ కూడా ఉన్నదట. నాతో ఆమె ఉన్నదన్న భావన కలిగింది. కాని నేను ఆమెను చూడలేదు. ఎందుకో ఆ లాడ్జి నుండి బయటకు వచ్చి వేరే గదిని చూచాను. అది ఇంకా బాగుంది. ఈ రెండవది ఉండుటకు బాగుందని ఒక రోజే కావున దీనినే ఉంచుకుందామనే ఆలోచన వచ్చింది. చివరికి ఎందుకో నేనొక్కడినే బయటకు వెళ్ళి ఆ రోడ్డుపై నిలుచున్నాను. ఇంతలో కొందరు దుండగులు కొంతమందిని నిర్బంధించి, డబుల్ డెక్కర్ బస్సులో తీసుకెళుచున్నారు. ఈ బస్సులో జనాలు క్రిక్కిరిసి ఉన్నారు. ఫుట్ బోర్డు వరకు వచ్చి వ్రేలాడుతున్నారు. నేను ఈ దారిలో కొంత ముందుకు వెళ్ళేసరికి మరో అడ్డదారి వచ్చింది. ఆ దారిలో ఈ బస్సు వచ్చి నా ముందు నిలిచింది. ఇంతలో ఆ బస్సు నుండి స్వర్గీయ మా తండ్రిగారు కీ.శే పుల్లగూర్ల వేంకటరెడ్డి గారు దిగారు. దిగి నా వైపు నడుచుకుంటూ వస్తున్నారు. ఆయన, చివరి రోజులలోని రూపంగా కాకుండా మంచి యవ్వనంలో ఉన్న రూపములో ఉన్నారు. తెల్లని ధోవతి, నేర్షర్ట్, తెల్లని కండువాను మెడపై కప్పుకుని ఉన్నారు. ఈయన అంత రద్దీ ఉన్న బస్సునుండి దిగారు కాని ఈయన బట్టలు ఏమాత్రం నలిగిపోలేదు, మాసిపోలేదు. అత్యంత తెల్లగా ఉన్నవి. నేను ఆయనను చూడగానే చాలా ఆనందించాను. ఆయన కూడా నన్ను చూచి నా వైపుకు నడుచుకుంటూ వస్తున్నారు.

చిన్నప్పుడు అంటే నా పెండ్లి కాని రోజులలో, ఊరిలో నివసించే రోజులలో మా కుటుంబం అనే దృఢమైన భావన ఎలా ఉండెనో అలాంటి గట్టి భావననే ఇప్పుడు ఉన్నది. మా అమ్మ నాతో ఉన్నదనే భావన ఉన్నది. మా తండ్రి బస్సు దిగి ఇప్పుడే వచ్చారు. ఇక మా చెల్లెలు 'లలిత' మాత్రం ఆ బస్సులోనే ఉన్నదట. ఆమెను ఆ దుండగులు వదలలేదు. దీనిని చూచి నేను అయ్యో మా చెల్లెలు ఒక్కతే ఈ బస్సులో ఉన్నది, ఎలా బయట పడుతుందోనని భావించి, 'లలితా...' అని అరుస్తూ బస్సు దగ్గరికి పోయాను. కాని మా చెల్లెలు బస్సు మధ్యలో ఉన్నది, బస్సు నిండా జనం ఉండుట వలన రాలేకపోయిందని గ్రహించాను. నిజానికి నేను ఆమెను చూడలేదు కాని ఈ బస్సులోనే ఉన్నదన్న భావన కలిగింది. ఇంతలో నేను ఆ బస్సు వద్దకు మరింత దగ్గరకు పోవు సమయాన ఆ బస్సు వెళ్ళిపోయింది. ఇంతే కల.

ఇందులో మా తండ్రిని మాత్రం స్పష్టంగా, మంచి రూపముతో చూచాను. మా చెల్లెలిని విడిపించలేదనే దుఃఖం మా తండ్రి గారిలో కనిపించలేదు. నాలో కనబడ్డది. బహుశా అది మాయాలోకం, ఇంతవరకు మా చెల్లెలు ఈ మాయ నుండి బయట పడలేదని అర్థం. ఇక మా నాన్న మాత్రం ఊరినుండి వచ్చినట్లు వచ్చారు, మరియు చాలా ఆనందంగా, ప్రశాంతంగా ఉన్నారు. బహుశా ఆయన కోరిక ప్రకారం చిన్నగుండవెల్లిలో స్వామివారి స్థాపనకు ఒక అడుగు పడుతుందని సంతోషిస్తున్నారనుకున్నాను. మరియు నాకు ఈ కార్యక్రమమునకు సహాయకులుగా నా వద్దకు నా తల్లితండ్రులు ఇద్దరు వచ్చారనిపించింది. మరియు ఈ సమయం వరకు నాలో అంతరంగాన కొంత గొప్పల కోసం ప్రాకులాడు స్థితి ఉన్నదని కూడా చెప్పాడు.

**ఈ కాలంలో జరిగిన కళ్యాణాలు :** 19వ మరియు 20వ కళ్యాణం జరిగాయి.

**నా దశ :** మనిషి ఏకాకి అని, భగవంతుణ్ణి విడిచి ఉండరాదని చెప్పారు. హరినామ క్షేత్రానికై మా తోటబావిని ఎన్నుకున్నారు. హరినామక్షేత్రానికై 7 ఎకరాలు సమర్పించాను. తిరుమల ఆలయం లాగా నిర్మించి, సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. స్వామివారితో కలిసి జీవించుటకు ప్రార్థించాను.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1.హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-2717505**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్టల్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**




**గత సంచిక తరువాయి**

# అత్రి మహర్షి

బ్రహ్మదేవుడు సృష్టి చేస్తున్న కాలంలో, అంటే చతుర్దశ భువనాలు – వీటన్నిటికంటే ముందు జీవకోటికి ముందుగానే ఎప్పుడో, ఈ సృష్టి చేయటంలో తనకు సహాయం చెయ్యగలవాడనే ఉద్దేశ్యంతో – తన తపస్సులోంచి అత్రి మహర్షిని సృష్టించాడు. అత్రి మహర్షి బ్రహ్మలో ఒక భాగం అన్నమాట. అలా ఉంటారు మహర్షులు. వాళ్ళలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అని ఉండదు. వాళ్ళందరూ కూడా సాక్షాత్తూ ఈశ్వర స్వరూపులే.

అత్రి మహర్షి పుట్టగానే, ''నన్నెందుకు పుట్టించావు? నాకేమిటి పని?'' అని బ్రహ్మను అడిగాడు. అప్పుడు ఆయనతో బ్రహ్మ, ''నాయనా! సృష్టి విషయంలో నాకు నీ సహాయం కావాలి. తపస్సు చేసి నీ తపోబలం చేత జీవకోటిని సృష్టించు'' అని ఆజ్ఞాపించాడు.

అత్రి చిరకాలము తపస్సు చేసి, ఆత్మానుభూతి పొంది ఆత్మజ్ఞానియై, బ్రహ్మజ్ఞానియై, ఆత్మజ్ఞాన తత్వజ్ఞుడు అయిన తరువాత కూడా తీక్షణంగా తపస్సు చేస్తూ ఉండిపోయాడు. ఆయనకు ఆత్మజ్ఞానం కలిగింది. తన పని తాను తెలుసుకున్నాడు. విశ్వాత్మభావన కలిగింది. ఆయనకు ఇంకా తీరవలసిన కోరికలు ఏమీ లేవు. అయినా అఖండమైన తపస్సు చేస్తున్నాడు. ఆయన రెండు నేత్రముల నుంచి బ్రహ్మాండమైన తేజస్సు ఒకటి వెలుగుతూ బయటకు వచ్చింది. ఆ తేజస్సు అనిరీక్ష్యంగా, కళ్ళు తెరిచి చూడ్డానికి వీలు లేకుండా ఉన్నది. భయంకరంగా కూడా ఉన్నది. దశదిశలా దానిని పంచుదామని చెప్పి పది దిక్కులకూ ఇవ్వబోయినాడు. ఆ పదిదిశలూ ఆ తేజస్సుని స్వీకరించి, భరించలేక మళ్ళీ వెనక్కి వదిలేశాయి. అది ఒక పెద్ద తేజో పుంజంగా ఒక గోళంగా ఏర్పడింది. అప్పుడు దానిని అనంతంగా ఉండే సముద్రంలో వదిలేశాడాయన. ఆ తేజస్సును సముద్రం కూడా భరించలేక కుతకుత ఉడుకుతూ ఉంటే,



బ్రహ్మదేవుడు భూలోకానికి వచ్చి ఆ తేజస్సుకు ఒక పురుష రూపాన్ని ఇచ్చాడు. ఆ తేజస్సుకు పురుషరూపాన్ని ఇవ్వగానే దాని ఔద్ధత్యం తగ్గిపోయి చల్లబడింది. ఆకాశంలో పురుష స్వరూపంలో అది కనబడింది. దేవతలు ఒక పెద్ద ఆపద తప్పిందని సంతోషపడి బ్రహ్మను సోమ మంత్రములతో స్తుతించారు.

అప్పుడు బ్రహ్మదేవుడు, ''ఈ అత్రి మహర్షి తపస్సు చేస్తూ ఉన్నాడు. ఆయన చేసేటటువంటి తపస్సులోంచి వచ్చిన ఈ భయంకరమైన తేజస్సును ఈ ప్రకారంగా చల్లబరిచాము. ఆయన భవిష్యత్తులో అనసూయాదేవిని వివాహం చేసుకుంటాడు. ఈ దివ్యపురుషుడు ఆయన తపస్సులోంచి వచ్చినవాడు కాబట్టి, అనసూయా గర్భమందు ఇతడు మళ్ళీ ప్రవేశించినప్పుడు అత్రికి కుమారోదయం

అవుతుంది'' అని చెప్పాడని తాత్పర్యం. అలా దానిని అర్థం చేసుకోవాలి.

కశ్యప ప్రజాపతికి ఎనిమిదిమంది ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు పుట్టారు. అందులో అనసూయ ఒకరు. అత్రిమహర్షి ఈ అనసూయకు తగిన వరుడని నిర్ణయించి, కశ్యపుడు వారిద్దరికీ వివాహం చేశాడు. ఆ విధంగా కశ్యప ప్రజాపతి కుమార్తె అయిన అనసూయ అత్రి మహర్షిని వివాహం చేసుకుంది.

ఆయన సన్నిధిలో అనసూయాదేవికి ఏ కర్తవ్యమూ ఉండేది కాదు. ఆయనకు ఏమీ అవసరము ఉండేది కాదు. నిత్యము తపస్సులో ఉండేవాడు. చేసేపని ఏమీ లేకుండా ఉండడం చేత ఆమె కూడా ఆయన ఎదురుగా కూర్చుని తపోనిష్ఠలో ప్రవేశించింది. మహాతేజస్వినిగా, లోకపూజ్యురాలిగా ఆమె తపస్సు చేసింది.

తరువాత కొంతకాలానికి అత్రి మహర్షి ఆశ్రమానికి త్రిమూర్తులు వచ్చారు. త్రిమూర్తులు అనసూయాదేవి పాతివ్రత్య మహాత్మ్యాన్ని పరీక్షించదలచుకొని వచ్చారు. ఈ కథంతా అందరికీ తెలిసిందే. వాళ్ళు ముగ్గురూ ఆమెను భోజనం వడ్డించమన్నారు. ఆమె అర్ఘ్య పాద్యాలిచ్చి భోజనం పెడదామనుకుంటే, వాళ్ళు ''మాకు నీవు నగ్నంగా ఉండి వడ్డిస్తేనే తింటాము'' అన్నారు.

ఆవిడ అలాగే అని ఒప్పుకొని, తన తపస్సునంతా మంత్రజలంగా మార్చి ఆ త్రిమూర్తుల మీద చల్లింది. వాళ్ళు ముగ్గురూ చంటిపిల్లలయినారు. ఆ చంటిపిల్లలు ముగ్గురినీ ఊయలలో పడుకోబెట్టి వారు కోరిన విధంగానే అన్నం పెట్టింది వాళ్ళకు. ఆ తరువాత అత్రి మహర్షి ఆ ముగ్గురు పిల్లలనూ దగ్గరకు తీసుకొని ఒకచోట చేరిస్తే వాళ్ళు ముగ్గురూ ఒకే శరీరము, మూడు ముఖాలు కలిగిన దత్తాత్రేయమూర్తి అయినాడు.

అత్రిమహర్షి అనసూయలకు పుట్టినటువంటి త్రిమూర్త్యాత్మకుడు దత్తాత్రేయుడు. అందుకనే గురువుగా ఆయనకు నమస్కరిస్తారు. 'గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' – ముగ్గురూ కలిసిన మూర్తి కదా! వాస్తవంగా ఇది వారి ధ్యాన శ్లోకం. మనం ఊరికే స్తోత్ర శ్లోకంగా వాడుతాము. ఆయనే ధ్యాన స్వరూపమైన దత్తాత్రేయుడు – దత్తాత్రేయమూర్తి. అనసూయాదేవి మహత్తు వల్ల త్రిమూర్తులకు శైశవం ఏర్పడి శిశువులుగా పుట్టడం అనేది జరిగింది. ఆ రూపమే ఇది అని



సమన్వయం చేసుకోవాలి. వాళ్ళు ముగ్గురినీ సమన్వయం చేసి ఒకే మూర్తిగా రూపకల్పన చేసినవాడు అత్రిమహర్షి.

అత్రి మహర్షి యొక్క తపస్సుకు, పూర్వం బ్రహ్మ ఇచ్చిన పురుషరూపం, ఆ తరువాత త్రిమూర్తుల పరీక్ష, అదంతా అత్రి దంపతులు మరచిపోయారు. తమ గర్భవాసములో ఒక కొడుకు పుట్టలేదనే కోరిక అలాగే వాళ్ళకు మిగిలిపోయింది. దత్తాత్రేయుడు పుట్టిన తరువాత కూడా సంతానం కలగకపోయెనే అనే వెలితితో, కోరికతో వాళ్ళు దక్ష పర్వతం దగ్గరకు వెళ్ళి తపస్సులు చేశారు. మళ్ళీ బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు ముగ్గురూ వచ్చి ప్రత్యక్షమైతే, ''మాకు ఒక కుమారుడు కావాలి, మేము ఆ పరమశివ తత్త్వాన్ని గురించి తపస్సు చేస్తే, మీరు ముగ్గురూ ఎందుకు వచ్చారు? మాకేమి ఇస్తారు? మీలో అధికులెవరు?'' అని అడిగారట ఆ త్రిమూర్తులను.

''మాలో ఎక్కువ తక్కువలు లేవు. మేమంతా సమానమే. మాకు భేదం లేదు. మా అంశలతో మీకు సత్పుత్రోదయం అవుతుంది'' అని చెప్పారు. వాళ్ళ వరప్రసాదంతో అత్రిమహర్షి నేత్రములలోంచి చంద్రుడు పుట్టాడు. ఆయననే సోముడు అంటారు. అనసూయ గర్భంలో దత్తాత్రేయుడు ఇదివరకే పుట్టాడు కదా! ఇప్పుడు దూర్వాసుడు పుట్టాడు.

ఒకనాడు అనసూయతో అత్రిమహర్షి, ''నీ కోరిక నెరవేరింది. నా కోరికా నెరవేరింది. ఇక ఈ సంసారం చాలు. నేను ఎక్కడికైనా వెళ్ళి తపస్సు చేసుకుంటాను. నీవు కూడా వస్తావా? లేకపోతే ఈ పిల్లలను చూసుకుంటూ ఉండిపోతావా?'' అని సామాన్యుల వలె అడిగాడు.

అందుకు ఆమె ''పిల్లలు ఇంకా పెరిగి పెద్దవాళ్ళు కాలేదు కదా! వీళ్ళను పెంచాలంటే ధనం కావాలి. అందుకని పృథు చక్రవర్తి దగ్గరకు వెళ్ళి ధనం తీసుకురండి. చిన్నపిల్లలను వదిలివెళ్ళడం సరి అయిన పద్ధతి కాదు కదా!'' అని అన్నది.

ఆవిడ చెప్పిన దాంట్లో ఒక ధర్మం, ఔచిత్యం గ్రహించాడు ఆయన. అందుకని పృథుచక్రవర్తి దగ్గరకు వెళ్ళి ధనాన్ని అడిగాడు అత్రి.

''మహర్షీ! నీకు ధనం ఇవ్వటానికి అభ్యంతరం లేదు నాకు. కాని నాకు సహాయం చేయి. నేను అశ్వమేధయాగం చేస్తున్నాను. ఆ యాగాశ్వాన్ని వదిలిపెడతాను. దాన్ని రక్షించటానికి సాయంగా నా కొడుకును దాని వెంట పంపిస్తున్నాను. నువ్వు నా కొడుకుకి సాయం చెయ్యి'' అని అడిగాడు పృథు చక్రవర్తి. పృథు చక్రవర్తి యాగం మహావైభవంగా జరుగుతున్నది. ఇంద్రుడు అసూయ చేత మారువేషంలో వచ్చి అశ్వాన్ని ఎత్తుకుపోయాడు. భూమిమీద ఎక్కడ వెతికినా దొరక్కుండా పాషండుడి వేషంలో ఇంద్రుడు, ఆ అశ్వాన్ని ఆకాశమార్గంలో ఎత్తుకుపోతున్నాడు. పృథు చక్రవర్తి కొడుకు ''వాడు ఎవరో తెలియటం లేదే! వాడిని బాణం వేసి చంపనా?'' అని అంటే, ''అతడు దేవేంద్రుడే! మారు వేషంలో వచ్చాడు. యాగానికి హాని తలపెట్టినవాడు ఎవరైనాసరే వధార్హుడే! వాడిమీద నీ బాణం వెయ్యి!'' అన్నాడు అత్రిమహర్షి. ఆయన అలా ధర్మ సూక్ష్మాన్ని నిర్ణయించాడు. పృథు చక్రవర్తి కొడుకు బాణం వేశాడు. ఆ దెబ్బకు ఇంద్రుడు తీవ్రమైన వేదనకు గురి అయి అశ్వాన్ని వదిలిపెట్టి పారిపోయాడట.

వాళ్ళు తిరిగివస్తుంటే, ఈసారి దేవేంద్రుడు వెనకనుంచి అదృశ్యరూపంలో వచ్చి ఆ అశ్వాన్ని రెండవమారు అపహరించాడు. అత్రిమహర్షి తన తపోబలంతో ఇంద్రుడి అదృశ్య శక్తినంతా హరించి, పృథు కుమారుడికి అతడు కనబడేటట్లు చేశాడు. ఆయన బాణం వేశాడు. ఇంద్రుడిని జయించి, బాగా శిక్షించి, చంపకుండా వదిలిపెట్టి యాగాశ్వాన్ని తిరిగి పృథు చక్రవర్తికి చేర్చి యజ్ఞాన్ని నిర్విఘ్నంగా జరిపించాడు అత్రి. అత్రి మహర్షి దయతోటే యజ్ఞం ఇంత బాగా జరిగింది.

పృథు చక్రవర్తి యాగానికి వచ్చిన బ్రాహ్మణులకు, ఇతరులకు దక్షిణ తాంబూలాలు ఇచ్చి స్తోత్రాలు చేసి నమస్కరించాడు. అత్రి దగ్గరకు వచ్చి, నీవు ఇంద్రుడివి, చంద్రుడివి, బ్రహ్మదేవుడంతటివాడివి అని వర్ణించాడు పృథువు. అక్కడే ఉన్న గౌతమ మహర్షికి ఈ పొగడ్తలు వినేటప్పటికి కోపం వచ్చింది. ''మేము ఇంతమందిమి ఉండగా, ఆయననే పొగుడుతున్నావు. బ్రహ్మదేవుడని అంటున్నావు. మేము మాత్రం కామా? ఎందుకు అలా వర్ణిస్తున్నావు?'' అన్నాడు.

అత్రిమహర్షి తనను పృథువు చేసిన స్తోత్రానికి ప్రసన్నుడయి, తనకు నమస్కరించిన పృథుచక్రవర్తినే తిరిగి, నువ్వు ఇంద్రుడంతటి వాడివి చంద్రుడంతటివాడివి అని స్తోత్రం చేశాడు.

గౌతముడికి మళ్ళీ కోపం వచ్చింది. ఆయన అత్రిమహర్షితో ''ఒక చక్రవర్తిని నీవు ఇంద్రుడు, చంద్రుడు అని మాట్లాడుతున్నావు. నీకు ఇది ధర్మం కాదు'' అని అంటే; అప్పుడు వాళ్ళిద్దరికీ (అత్రికి, గౌతముడికి) వాగ్వివాదం జరిగింది. ''నేను ఆయనను స్తోత్రం చేస్తే ఏమీ తప్పు లేదు. ఆయన ఇంత గొప్ప యాగం చేశాడు. ఆయన సేవలకు నేను ప్రసన్నుడనయ్యాను. అందుకే నేను స్తోత్రం చేస్తున్నాను. ఇందులో ఏది ధర్మం అవుతుందో మీరే నిర్ణయించండి'' అని సదస్సుకు చెప్పాడు అత్రి మహాముని.

''మేము ఈ విషయంలో ఏ నిర్ణయమూ చేయలేము'' అన్నారు సభాసదులందరూ. అయితే ఈ ధర్మనిర్ణయం తేల్చటానికి బ్రహ్మ మానస పుత్రుడయినటువంటి సనత్కుమారుడనే ఋషి ఉన్నాడు. ఆయన ధర్మసూక్ష్మం బాగా తెలిసినవాడు అని ఆయన దగ్గరికి వెళ్ళారు నిర్ణయం కోసం.

ఆయన దగ్గరికి వెళ్ళిన తరువాత అత్రిమహర్షి ఆయనతో, ''రాజు నాకు నమస్కరించి స్తోత్రం చేశాడు. దానికి బదులుగా నేను తిరిగి రాజును శ్లాఘించాను. ఈయన తప్పు అంటున్నాడు. ఈ విషయంలో ఏమిటి తప్పు? మీ నిర్ణయమేమిటి తెలపండి'' అని అడిగాడు.

అప్పుడు సనత్కుమారుడు, ''అత్రివాక్యములే సత్యము. అలా స్తోత్రము చేయడంలో తప్పేమీ లేదు'' అని నిర్ణయం చేశాడట. గౌతముడు ఆ నిర్ణయాన్ని శిరసా వహించాడు. రాజును ఇంద్రుడు చంద్రుడు అని స్తోత్రం చేస్తే ఎందుకు తప్పులేదు అంటే, అందులో ఉన్న ధర్మసూక్ష్మం ఏమిటంటే, ''న విష్ణుః పృథ్వీపతిః'' – విష్ణువు యొక్క అంశ లేకపోతే పృథ్వీపతి కాలేడు అన్నది. ఆ విష్ణువు అంశను ఎంత స్తోత్రం చేసినా పరవాలేదు. అతడిలో ఉండే ఇతర లక్షణములు, మానవమాత్రుడిగా ఉండే ఇతర లక్షణములు, తప్పొప్పులు ఉంటాయే – వాటిని పరిహరించి విష్ణువు అంశ అతడిలో ఉండబట్టే చక్రవర్తి అయినాడు కాబట్టి, అతడి కులగోత్రాలతో నిమిత్తం లేదు. విష్ణువు అంశ ఉండబట్టే చక్రవర్తి అవుతాడు

కాబట్టి ఆ అంశను ఎంత శ్లాఘించినా తప్పులేదు అని తాత్పర్యం.

దేవతలకు, రాక్షసులకు ఒకమారు యుద్ధం జరుగుతున్న కాలంలో, రాహువు చేతిలో సూర్యచంద్రులిద్దరూ కూడా తీవ్రంగా దెబ్బతిని వాళ్ళ తేజస్సులు పోగొట్టుకున్నారు. వాళ్ళు అత్రిమహర్షి దగ్గరికి వచ్చి ఆయన శరణు కోరుకున్నారు. అప్పుడు ఆ సూర్యచంద్రులకు ఆయన, తేజోవంతమైన శరీరాలను ఇస్తూ భవిష్యత్తులో ఎప్పుడూ వాళ్ళ శరీరాలు రాక్షసబాధ నుంచి రక్షించబడతాయి. రాక్షసులు వాళ్ళకు ఏ హానీ చెయ్యలేరు అని వరమిచ్చాడు. ఆ రాక్షసులందరూ ఆయన దగ్గరికి వస్తే, వాళ్ళందరినీ ఒక తీక్షణమైన దృష్టితోనే చంపేశాడట. ఈ కార్యాన్ని ఆయన నోరెత్తకుండా, చెయ్యెత్తకుండా, దర్భను మంత్రించకుండా కేవలం తీక్షణమైన తన దృష్టితోటే చేశాడట.

ఒకసారి అత్రిమహర్షి ఆశ్రమానికి సీతారామలక్ష్మణులు వచ్చారు. వాళ్ళకు ఆయన ఆతిథ్యం ఇచ్చాడు. అనసూయ దగ్గర పతివ్రతా ధర్మాలు నేర్చుకోవమ్మా అని సీతకు చెప్పాడు. అనసూయాదేవి సీతకు పాతివ్రత్య ధర్మ రహస్యములన్నీ చెప్పింది.

అనేకమంది ఋషులు, బ్రాహ్మణులు ఒకప్పుడు అత్రిమహర్షిని దర్శించి, ''నీవు విశ్వవిదుడివి, ఋషి శ్రేష్ఠుడివి. లోకానికి హితకరమైనటువంటి ధర్మ సూక్ష్మములను మాకు చెప్పవలసింది'' అని అడిగారు. ఆ విషయాలన్నీ (అత్రిసంహిత అనే గ్రంథంలో) చెప్పాడని ఉంది.

''విష్ణువును లోకమంతా వ్యాపించినటువంటి రక్షకుడిగా భావన చేసి ఆరాధించటమే ముక్తిదాయకం. అదే శ్రేయస్కరము. సమస్త ప్రజలు విష్ణువును ఆరాధించి తీరాలి'' అని చెప్పాడు ఆయన. అమూర్తార్చనము, సమూర్తార్చనము అని ఆయనను పూజించే విధానాలుంటాయని చెప్పాడు. అగ్నిలో వేసే ఆహుతి అమూర్తార్చనం అని, ప్రతిమాద్యర్చనము సమూర్తార్చనమని – ఆ రెండింటిని గురించిన వైఖానస మతాన్ని మొట్టమొదట ఆయనే ప్రబోధం చేశాడట.

సాయం ప్రాతఃకాలములందు ఇంట్లో కాని, దేవాలయంలో కాని ప్రతి బ్రాహ్మణుడూ – భక్తిభావంతో పరమేశ్వరుని ప్రతిమను పెట్టుకుని, ఆ సాన్నిధ్యం కల్పించుకుని, దాని ఎదురుగుండా అగ్నిహోత్రాది హోమములు చేయడం అత్యుత్తమ మార్గమని చెప్పాడు. ఇదే 'అత్రి సంహిత' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. విగ్రహారాధనమేముంది, నేను నిత్యము అగ్నిహోత్రము చేస్తాను అని నిత్యాగ్నిహోత్రి



కూడా అనుకోనక్ఖరలేదు. విగ్రహారాధన చేసి, విగ్రహాన్ని మూర్తిమంతంగా పూజచేసి, దాని సన్నిధిలో అగ్నిహోత్రాన్ని చేసుకోమని అత్రిమహర్షి వాక్యం చెబుతోంది. చాలా విలువైన అంశం ఇది. ఆ రెండు సమన్వయం చేసి ఆయన అతి ముఖ్యంగా చెప్పాడు.

(పశ్చిమగోదావరి జిల్లాలో 'అత్తిలి' అని ఒక గ్రామం ఉంది. అది అత్రి మహర్షి క్షేత్రం ఆ ఊరికి ఆ పేరు అత్రిమహర్షి పేరు మీదుగానే వచ్చింది. అక్కడ ఒక ఆలయం ఉంది).

ఆయన ఇంకా కొన్ని విషయాలు చెప్పాడు. ''భృగుమహర్షి, కాశ్యపుడు, మరీచి, నేను – మా నలుగురి యొక్క మతమూ ఈ సమూర్త్యార్చనమే'' అని చెప్పారట ఆయన. అత్రిమహర్షి చెప్పటమే మహావాక్యం. అదీగాక భృగుమహర్షి, కాశ్యపుడు, మరీచి తమ యొక్క మతము ఇదే అని చెప్పటం ఒక గొప్ప విషయం.

'అత్రిసంహిత'ను – కర్మ, ప్రతిష్ఠ, పూజన, స్నపనోత్సవ, ప్రాయశ్చిత్తములనే విభాగముల కింద 5 భాగములుగా వ్రాశారాయన. మొదటిభాగంలో దేవాలయ ఆగమ శాస్త్రం అంతా ఉంది. ఇందులో దేవాలయ స్థల పరిశీలన, స్థలాన్ని ఎలా పరీక్ష చేయాలి? ఎలాగ ఎన్నిక చేయాలి – ఇవన్నీ ఉన్నాయి. అందులోనే దేవాలయాయతన రూపము నిరూపణము చేయుట, భగవంతుడి ప్రతిమలు ఎలా ఉంటాయో వాటి విషయాలు అన్నీ చెప్పారు. రెండవ భాగంలో పరివార

దేవతల యొక్క ప్రతిష్ఠాకలాపం అంతా చెప్పారు. మూడో భాగంలో పూజావిధానం, నాల్గవ భాగంలో మహాభిషేకము, అయిదవ భాగంలో ఉత్సవ విశేషాలు చెప్పారు. 'నిత్యోత్సవ నిబంధం' అనేటటువంటి ఒక గ్రంథం ఉంది. అందులో దేవాలయ ప్రతిష్ఠ, దేవాలయంలో సంవత్సరం పొడవునా ఏమి చెయ్యాలి, రోజూ నిత్యదీపోత్సవం ఎవరు చెయ్యాలి, ఎప్పుడు చెయ్యాలి – అనేది అంతా ఉంది.

ఈ వైభవం వైదిక మార్గంలో కూడా చేస్తారు. కేవలం వైఖానసం కాదది. వైదిక మార్గంలో కూడా చెప్తారు. అందులో శివపూజా విశేషం ఉంది. శివాలయ ప్రతిష్ఠను అయిదు భాగాలుగా చెప్పాడు అత్రి మహర్షి. ఆరో భాగంలో, పూర్వోక్త విధానంలో దోషం కనుక ఏమన్నా వస్తే, దానికి ప్రాయశ్చిత్తం చెప్పాడు. పరమేశ్వరోపాసనలో ఎక్కువ కులం, తక్కువ కులం అనేటటువంటి విచక్షణ లేకుండా సర్వులకూ అది మోక్షప్రదాయకమని చెప్పాడాయన. ఈ విధానం అందరూ కూడా చెయ్యవలసిందే అని ఆయన ధృవీకరించి చెప్పాడు.

మహర్షులది ఎంతో విశాల దృక్పథం. అది మనం గుర్తుపెట్టుకోవాలి. ఈ విశాల దృక్పథం అనేది మహర్షులదే తప్ప మానవమాత్రులలో ఉండదు. మానవమాత్రులు, అది కావాలని అరిచేవాళ్ళే తప్ప అది ఉన్నవాళ్ళు కారు. లోపల వాస్తవంగా అది లేకపోబట్టే అలా అరుస్తారు. ఉన్నవాడు అరవడు. అలా జీవిస్తాడు. అది యథార్థంగా ఉన్నవాళ్ళు మహర్షులు.

'అత్రిసంహిత'తో పాటు 'అత్రిస్మృతి' కూడా ఉంది. 'ఆత్రేయ ధర్మ శాస్త్రము' అని మరొకటి కూడా ఉన్నది. ఆ గ్రంథంలో ఆయన, ''బ్రాహ్మణుడు శూద్రస్త్రీని వివాహం చేసుకుంటే అతడు పతితుడే'' అని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని మను స్మృతిలో పేర్కొన్నారు. అనులోమ, విలోమ వివాహాలన్నీ కూడా ఆయన ఒప్పుకోలేదు. కులాచారాలను పాటించమని చెప్పాడు.

ఆత్రేయ ధర్మశాస్త్రంలో 9 అధ్యాయాలున్నాయి. సర్వమత ధర్మాలకంటే కూడా, మోక్షమార్గంలో ఏయే అనుష్ఠానాలు ఉన్నాయో వాటిని గురించి ఎక్కువగా చెప్పాడు. దానధర్మాలను గురించి అధికంగా చెప్పాడు. రహస్య ప్రాయశ్చిత్త ఖండంలో, ప్రతివాడూ కూడా తను ఆచరించే నిత్య కర్మానుష్ఠానంలో వచ్చేటటువంటి దోషాలకు, చేసిన పాపాలకు ఎలాంటి ప్రాయశ్చిత్తం చేసుకోవాలో చెప్పారు. ఎందుకంటే, 'శంఖలిఖిత స్మృతి'లో, ప్రాయశ్చిత్తం వెళ్ళి అడిగి చేయించుకోమన్నారు. రాజు దగ్గరికి వెళ్ళి, లేక గురువు దగ్గరికి వెళ్ళి, ''అయ్యా! నేను ఈ తప్పు చేశాను. నాకేమి ప్రాయశ్చిత్తం?'' అని అడిగితే ఆయన చెప్తారు. రాజయితే శిక్షిస్తాడు. ''అలా అయితే నీకు ఆ పాపం పోతుంది. ఇక్కడే ఆ పాపాన్ని కడుక్కో'' అని చెప్పాడు అత్రి మహర్షి.

యోగశాస్త్రమును గురించి, యోగాంగములను గురించి చెప్పాడాయన అత్రి సంహితలో. అత్రి స్మృతులని చెప్పి చిన్న చిన్న గ్రంథాలు చాలా చెల్లాచెదురుగా ఉన్నాయి. అవన్నీ ఒకచోట చేర్చి సంకలనం చేసినవాళ్ళు ఎవరూ లేరు.

అత్రిసంహిత, అత్రిస్మృతులలో ప్రాయశ్చిత్తం, దానం, పితృమేధం, ఆచారాలు, గురుప్రశంస, వర్ణధర్మం, జపమాల యొక్క పవిత్రత మొదలైన విషయాలను గురించి తెలియచేశారాయన. బ్రాహ్మణుడి యొక్క శౌచవిధి చెప్పారు. మాత్సర్యము, అసూయ మొదలైనవి ఉంటే వదులుకోవాలి. అవి ఉండకూడదు అని చెప్పారు. అహంకారము, మాత్సర్యము, అసూయ, ధనాశ ఈ నాలుగూ ఉన్నవాడు బ్రాహ్మణుడే కాదు. అతడి ఆచారము, జప హోమానుష్ఠానములు ఇవన్నీ ఎందుకూ పనికిరావు అని శాసనం చేశాడాయన. కర్మ, ప్రతిష్ఠ, పూజనం అంటే ఏమిటో, ఆ కర్మలన్నీ ఎలా చేయాలో అవన్నీ కూడా చెప్పాడు. యమ నియమాలు, పుత్ర దర్శనము, దత్తపుత్రులు, అశౌచము, ప్రాయశ్చిత్త విధానాలు, చాంద్రాయణ కృచ్ఛ్రములు మొదలైన అన్ని విషయములూ అందులో పేర్కొన్నాడు.

సమాజంలో ఉన్న అస్పృశ్యులను (తక్కువ కులం వారిని) అస్పృశ్యులుగా ఆయన అంగీకరించలేదు. వాళ్ళు అస్పృశ్యులు కారు అన్నాడు. అంటే రజకులు, పాదరక్షలు చేసేవాళ్ళు, నటకులు, కైవర్తకులు, వల్లెవాళ్ళు (మేదరులు), కుమ్మరులు, భిల్లులు – వీరందరికీ యాత్రలలో, వివాహాలలో, యజ్ఞ యాగాదులలో వాళ్ళు అస్పృశ్యులు అనే నియమం ఉండదు. తాకదగిన వాళ్ళు, తాకరానివాళ్ళు అనే భేదం ఉండదు అని చెప్పాడు. ఎంత సంస్కరణ ఉంది అందులో. (అయితే కులాంతర వివాహాన్ని అత్రి ఒప్పుకోలేదు. కాని అస్పృశ్యతను వ్యతిరేకించాడు. వర్ణవ్యవస్థను కాపాడాలని చెప్పాడు).

**దేవయాత్రా వివాహేషు యజ్ఞప్రకరణేషు చ ।**
**ఉత్సవేషు చ సర్వేషు స్పృశ్యాస్పృశ్యర్నవిద్యతే ।।**

అంటే వ్యక్తి తను అనుష్ఠానం చేసుకుంటూ తన ఇంట్లో ఒక్కడూ ఉన్నప్పుడు అస్పృశ్యత అనేది పాటించవచ్చు. ఇంట్లో మనం మడి కట్టుకుని పూజ చేసుకుంటుంటే, కొడుకే లోపలికి వచ్చినా, ''రాకూడదు బయటే ఉండు, ఎవరినీ ముట్టుకోకు. బయటికి పో'' అంటాము. మళ్ళీ తరువాత వాడిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటాం కదా. అంటే అస్పృశ్యత సహజంగా, శాశ్వతంగా ఒకడియందు లేదు. ఈ విషయం బాగా ప్రచారం చేయబడాలి. మహర్షులలో ఈ విశాల దృక్పథం, వివేకం ప్రస్ఫుటంగా కనబడతాయి. ఇదికాక, 'లఘు అత్రిస్మృతి', 'వృద్ధ ఆత్రేయస్మృతి' అని రెండు స్మృతులు కూడా ఉన్నాయి. అత్రి మహర్షి చెప్పిన బోధలు సంస్కృత భారతంలో, ఆనుశాసనిక పర్వంలో ఉన్నాయి. ఇలా అత్రి చరిత్రలో చాలా విషయాలు ఉన్నాయి. మహర్షుల చరిత్రలు చదువుతూంటే ఎన్నో విషయాలు తెలుస్తాయి.

**(ఇంకా ఉంది)**

**- శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. మౌనం గురించి, దాని వల్ల కలిగే లాభాల గురించి కొంచెం వివరిస్తారా? - పాలప్రసాద్, ఖైరతాబాద్, హైదరాబాద్.**

జవాబు – మౌనం. మౌనం మనల్ని మనకే చక్కగా పరిచయం చేస్తుంది. ఇది ఎంతో శక్తివంతమైంది. మన మనసు అనే సముద్రంలో నిరంతరం ఆలోచనలనే అలలు వస్తూ పోతూనే ఉంటాయి. మాటల ద్వారా మన నుంచి మనం బయటకు వస్తూ ఉంటాం. ఇది మన ఆలోచనల తీరుపై ఎరుక కల్గించి, మనపై మనం అదుపు సాధించడానికి సహకరిస్తుంది. ఇక్కడో విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. మౌనం అంటే కేవలం నోరు మూసుకుని మనసులో ఏవేవో ఆలోచిస్తూ మననం చేస్తూ ఉండడం. కబీరు అనే ప్రాచీన సంఘ సంస్కర్త, జ్ఞాని ఇలా అంటాడు.

**"మాలాతో కర్ మేఁ ఫిరై జీబ్ ఫిరై ముహ్ మాహి –**
**మనువాఁ తో దస్ దిసి ఫిరై యహ్ తో సుమరన్ నాహి ॥**

భావం – (చేతిలో మాల తిరుగుతూనే ఉంది. నోట్లో నాలుక కూడా దేవుని పేరు స్మరిస్తూనే ఉంది. కాని మనసు మాత్రం వేరే వేరే ఆలోచనల్లో మునిగి తేలుతోంది. ఎక్కడెక్కడికో పోతోంది. ఇది కాదు మౌనం లేదా 'స్మరణ' అన్నా.) నిజమైన మౌనం అంటే మనసులో కూడా 'మౌనం'గా ఉండాలి. ఆలోచనల్ని అదుపు చేసి, లక్ష్యం పైనే పెట్టాలి. దీనికి గాను ధ్యాన సాధన బాగా ఉపయోగపడుతుంది. ప్రతి 5-10 నిముషాలకు పరుగు తీసే ఆలోచనలకు కళ్ళెం వేసి, వెనక్కి వచ్చేట్టు, పరమాత్మ వైపు వెళ్ళేట్టు చేసుకోవడమే మౌన ధారణం. అవతార్ మెహర్ బాబా, భగవాన్ రమణ మహర్షి మౌన యోగులు. మౌనంగానే భక్తుల సందేహాలు తీర్చేవారని చెప్తారు.

**2. శ్రీ శంకర భగవత్పాదుల వారి 'సౌందర్యలహరి' గురించి క్లుప్తంగా వివరిస్తారా? – రాజేంద్రప్రసాద్, బొటానికా, గచ్చిబౌలి.**

జవాబు – శివానందలహరి, సౌందర్యలహరి ఈ రెండూ శ్రీ ఆదిశంకరాచార్యుల వారి అద్భుత స్తోత్ర రత్నాలే. శివానందలహరి శివస్తోత్రం అయితే సౌందర్యలహరి అమ్మవారిపై రచించిన దివ్యమైన స్తోత్రం.

ఇది పైకి గొప్ప కవితామృత ధారగా కన్పించినా లోపల మంత్ర తంత్ర యంత్రాత్మికమైనది. దీనిలో ఏ ఒక్క స్తోత్ర శ్లోకాన్ని మంత్రంగా రోజుకి 18 సార్లు జపిస్తే భక్తుల కోర్కెలు తీరుతాయని చాలామంది విశ్వసిస్తారు. భావం, భాష రెండూ ఈ గ్రంథంలో (120 శ్లోకాలు) అద్భుతంగా ఉన్నాయి. వీటి ప్రభావం మాటల కందనిది.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**




గత సంచిక తరువాయి

## శరణాగత రక్షణత్వం

వందల మంది వంద రకాలుగా చెబుతారు. అవన్నీ పట్టించుకోరు కొందరు. వింటే – ఆచరించాలంటే ఎవరి మాట పట్టించుకోవాలని సందిగ్ధంలో పడతారు. ప్రశాంతత కోల్పోతారు. అంతరాత్మ చెప్పినట్లు చేస్తారు. అదే చేశాడు రాముడు. ఒకరు మనల్ని అవమానించారని, చులకనగా చూశారని, చెడు చేశారని అనుకుంటాం. ప్రతీకారం చేయాల్సిన పని లేదు. వాళ్ళకై వాళ్ళే చెడిపోతారు. ఒక చెరువులో నీళ్ళు నిశ్చలంగా, నిర్మలంగా ఉంటాయి. ఒకడొక రాయి వేస్తాడు. నీళ్ళన్నీ నిశ్చలతని, నిర్మలత్వాన్ని కోల్పోతాయి. కాని అది తాత్కాలికమే. కాసేపటికి ఆ నీరు నిర్మలంగా ఉంటుంది. రాయి మాత్రం ఎక్కడో అడుగు భాగాన్ని చేరుతుంది.

అందరి అభిప్రాయాలు విన్నాడు రాముడు. హనుమంతుని సూచనకి సంతుష్టుడైనాడు. విభీషణుని గూర్చి నాకు తోచింది చెబుతాను అని తన మనసులో ఉండేది చెప్పసాగాడు రాముడు. వానరులారా! మీరందరూ నా మేలు కోరారు.

**మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన ।**
**దోషో యద్యపి తస్య స్యాత్ సతామ్ ఏతద గర్హితమ్ ॥**

విభీషణుని దోషాలు నేను పట్టించుకోను. మిత్రభావంతో నా దగ్గరకి వచ్చాడు. వాణ్ణి నేను విడిచిపెట్టను. దోషలకి



ఆశ్రయాన్ని ఇవ్వటాన్ని సత్పురుషులు మెచ్చుకుంటారు. నిందించరు. అతడు శరణార్థి కాదు, మిత్రుడంటాను.

రక్షించాలనుకున్నపుడు దోషాలు చూడడు భగవంతుడు. శిక్షించాలనుకున్నప్పుడు ఒక్క సద్గుణమైనా ఉందా అని నిశితంగా పరీక్షిస్తాడు.

ఈ శ్లోకం రాముని శరణాగత రక్షణత్వానికి నిదర్శనం. రాముడు శరణాగత వత్సలుడు. రాముణ్ణి శరణు పొందు. నిన్ను రక్షిస్తాడని అంది సీతమ్మ రావణునితో. సత్య జేయం – ఏమైనా సరే విడిచిపెట్టడు.

వచ్చినవాడు శరణార్థి ముసుగు వేసుకున్నాడా, మిత్రునిగా నటిస్తున్నా సరే వాడిని రక్షిస్తాను. జీవుడు భగవంతునికి అభిముఖుడైతే చాలు – మనసుతో కాదు మాటతో శరణు అన్నా చాలు – మహదానంద పడతాడు పరమాత్మ. వాడికి అభయమిస్తాడు. అది పరమాత్మ తత్వం. స్వభావం. ఔదార్యం.

విన్నాడు సుగ్రీవుడు. ఆలోచించాడు. రామా! అన్న దురాత్ముడు కావచ్చు. ఆపత్కాలంలో విడిచి రావచ్చునా? రేపు మనల్ని వీడేం చేస్తాడో? అన్నాడు.

సత్య పరాక్రముడు రాముడు విన్నాడు. చిరునవ్వు చిందించాడు. లక్ష్మణుని వైపు చూశాడు. తన అన్న వాలి విషయంలో సుగ్రీవుడు ఏం చేశాడు? అన్నట్లున్నాయి రాముని చూపులు. అంటున్నాడు లక్ష్మణునితో. ధర్మసూక్ష్మంతో చూస్తే – రాజుకి కష్టకాలం వస్తే జ్ఞాతులు దెబ్బ తీస్తారు. అందుకే జ్ఞాతుల్ని (దాయాదుల్ని) శత్రువులుగా చూస్తారు రాజులు. విభీషణుడు జ్ఞాతి. రావణుడు దెబ్బ తీస్తాడని భయంతో వచ్చాడు. అయితే తమకు మేలు చేసే జ్ఞాతులు ఉంటారు. వాళ్ళని గౌరవిస్తారు రాజులు. ఏమైనా జ్ఞాతుల్ని నమ్మరాదు. ఇతణ్ణి రావణుడు శంకించి ఉంటాడు. దాంతో వైరం ఏర్పడి ఉంటుంది. అందుకే వీడు ఇక్కడికి వచ్చాడు.

మనలో మాట – రాజ్యం కోసం తండ్రిని చంపిన వారున్నారు. అన్నని చంపినవారున్నారు. చరిత్ర పుటలు తిరగేస్తే ఎన్నో నగ్నసత్యాలు బయట పడతాయి. కైక భరతుణ్ణి రాజు చేయాలనుకుంది. దానికి ఇంత కోపం – ఇన్ని వేషాలా? – అలాగే ఇచ్చేద్దాం అన్నాడు దశరథుడు. రాముణ్ణి అడవులకి పంపాలంది కైకేయి. వనవాసం మహోదయం అంటూ వెళ్ళాడు రాముడు. చిత్రకూటం వెళ్ళాడు భరతుడు. రాముణ్ణి రాజుని చేయాలి అది భరతుని సంకల్పం. ఆ మహాసేనని చెట్టెక్కి చూశాడు లక్ష్మణుడు. మనల్ని చంపాలని వస్తున్నాడు భరతుడు – అన్నాడు. తమ్ముడు రానీ – వచ్చాక రాజ్యాన్ని సౌమిత్రికి ఇచ్చెయ్ అంటాను అన్నాడు రాముడు. దాంతో సిగ్గుపడ్డాడు లక్ష్మణుడు. తల వంచుకున్నాడు.

రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు నలుగురు. ఒక తల్లి పిల్లలు కాకపోయినా – ఆ అన్నదమ్ములు ఐక్యతకి అన్యోన్యతకి ప్రతిరూపాలుగా నిలిచారు. రావణ కుంభకర్ణ విభీషణులు ఒక తల్లి పిల్లలు ముగ్గురూ. అన్న నుంచి విడిపోయాడు విభీషణుడు. వాలి సుగ్రీవులు ఇద్దరు. అన్నని చంపించాడు తమ్ముడు. ఆ అన్నదమ్ములు అనైక్యతకి నిదర్శనం.

రామునిలా బతకాలి. రావణునిలా కాదంటుంది శ్రీ రామాయణం. రామ భరత లక్ష్మణ శత్రుఘ్నుల్లా – ఉండాలంటుంది శ్రీ రామాయణం. అన్నదమ్ముల్లో పొరపొచ్చాలుండరాదు. ఐకమత్యంతో ఉండాలని శ్రీ రామాయణం పాఠం నేర్పుతోంది మనకు.

మళ్ళీ అంటున్నాడు రాముడు. సుగ్రీవా! రాజనీతితో ఆలోచిద్దాం. నీవు వానరుడవు, మేం మనుషులం. రావణాదులు రాక్షసులు. మనం రాక్షసులకి దాయాదులం కాదు. వాళ్ళ రాజ్యంతో మనకు పని లేదు. రాక్షసుల్లో విద్వాంసులుంటారు. పండితులుంటారు. విభీషణుడు అలాంటివాడే. మనల్ని ద్వేషించడం లేదు. వాణ్ణి మనం చేర్చుకోవచ్చు.

**న సర్వే భ్రాత రస్తాత్ భవంతి భరతోపమా**

ఈ లోకంలో భరతుని లాంటి సోదరులుండరు. తండ్రికి నాలాంటి పుత్రులుండరు. నీలాంటి మిత్రులుండరు.

అడక్కపోయినా భరతునికి రాజ్యం వచ్చింది. అయినా రాజ్యం నాది కాదు రామునిది అన్నాడు. త్యాగ పురుషుడు భరతుడు. రాముని ఎడబాటు సహించలేక ప్రాణాలు వదిలాడు దశరథుడు. తండ్రిని సత్యసంధుణ్ణి చేశాడు రాముడు. అందుకే పుత్రుల్లో గొప్ప రాముడు. సీతాన్వేషణకు ఆలస్యం చేశాడు సుగ్రీవుడు. సౌమిత్రి కోపానికి గురి అయ్యాడు. రాముని వల్ల కఠినోక్తులు వినాల్సి వచ్చింది. అయినా రామలక్ష్మణులపై ప్రేమ తగ్గలేదు వానర రాజుకి. వారికెంతో సాయపడ్డాడు. కనుక మిత్రుల్లో సుగ్రీవుడు గొప్పవాడు. అలా రాముడు చెప్పిన దానికి అన్వయం.

సుగ్రీవా! రావణునికి జ్ఞాతి విభీషణుడు. రాజ్యకాంక్షతో వచ్చాడు. అందరూ మనలాగా ఉంటారని అనుకోవద్దు.

విన్నాడు సుగ్రీవుడు. లేచాడు. నమస్కారం చేశాడు. రామా! ఇతణ్ణి రావణుడే పంపి ఉంటాడు. కుటిల బుద్ధితో

వచ్చాడు. ఆశ్రయం ఇస్తే - అదను చూస్తాడు. మనల్ని చంపేస్తాడు. వీడు మాయావి. వీణ్ణి వధించాలి. వాడి అనుచరుల్ని కూడా చంపేయాలి. విన్నాడు రాముడు. ఆలోచించాడు. ఈ విభీషణుడు క్రూరుడైతే నాకేమి? వీడు నాకు ఏ హాని చేయలేదు.

**పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్ ।**
**అంగుళ్యగ్రేణ తాన్ హన్యామ్ ఇచ్ఛన్ హరి గణేశ్వర ॥**

ఈ లోకంలో పిశాచులను దానవులను యక్షులను రాక్షసులను నేను సంకల్పిస్తే నా కొనగోటితో హతమారుస్తాను. ఇక వీడెంత? నన్నేం చేస్తాడు? (ఇది నరునిలోని నారాయణత్వాన్ని చాటుతోంది).

సుగ్రీవా! శరణాగతుడైన వ్యాధుణ్ణి ఒక పావురం రక్షించింది. వాడెవరో తెలుసా? తన భార్యని చంపిన బోయవాడు. తన మాంసంతో వాడి ఆకలి తీర్చింది. ఒక పక్షి ఆ శరణాగతుణ్ణి ఆదుకుంది. మరి మనిషిని నేను. వాడికి ఆశ్రయమివ్వాలి. ఆదుకోవాలి. కండు మహర్షి కణ్వముని కుమారుడు. అతను సత్యవాది. పరమర్షి. అతడొక కథ చెప్పాడు. చెబుతా విను. శత్రువైనా అంజలి ఘటిస్తాడు. దీనుడై శరణు వేడుతాడు. అనుగ్రహించాలని ప్రార్థిస్తే వాడికి హాని చేయరాదు. శత్రువు ఆర్తుడైనా, అహంకారి యైనా, శత్రుపక్షం వాడైనా శరణాగతుడైతే – తన ప్రాణమిచ్చి అయినా వాడిని కాపాడాలి. భయపడి కాని, శక్తి వుండి స్వార్థంతో కాని వస్తే – ఆపద్ధర్మం తెలియక కాపాడకపోతే – ఆ శరణాగతుని పాపాలు రక్షించలేనివాడికి చుట్టుకుంటాయి. వీడి పుణ్యాన్ని వాడు తీసుకుంటాడు. పుణ్యలోకాలకి పోతాడు. కనుక శరణాగతుణ్ణి రక్షించకపోతే అపకీర్తి వస్తుంది. నరకబాధలు తప్పవు. పుణ్య లోకాలు నాశనమవుతాయి. బలం పరాక్రమం నష్టపోవడం జరుగుతుంది. సుగ్రీవా నేను ఆ మహర్షి చెప్పినట్లు చేస్తాను. అదే నా నిశ్చయం. నా ధర్మం. నాకు కీర్తి వస్తుంది. సద్గతులు లభిస్తాయి.

**సకృదేవ ప్రపన్నాయ తవా స్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేత్ వ్రతం మమ ॥**

నేను నీవాణ్ణి అని ఎవడు అంటాడో, ప్రపత్తి చేస్తాడో – సర్వ ప్రాణికోటి నుంచి వాణ్ణి రక్షిస్తాను. అభయమిస్తాను. ఇది నా వ్రతం.

**విభీషణో వా యది వా రావణో స్వయం**

ఆ వచ్చినవాడు విభీషణుడు కాని స్వయంగా రావణుడే కాని తీసుకురా! అభయమిస్తాను.

సర్వధర్మాలు (అన్ని ఉపాయాలు) పరిత్యజించాలి. నన్నే ఉపాయంగా భావించాలి. అలా ఎవడు నమ్ముతాడో వాణ్ణి సర్వ పాపాల్నుంచి కాపాడుతాను. మోక్షమిస్తాను అన్నాడు కృష్ణభగవానుడు గీతలో.

(18 అధ్యాయం – 66 వ శ్లోకం) దీనిని చరమ శ్లోకం అన్నారు వైష్ణవులు. శరణాగతునికి కర్మ భక్తి జ్ఞాన యోగాలతో పని లేదు. నేను నీ వాణ్ణి అని ఒక్కసారి మనసారా అంటే చాలు వాడికి అభయమిస్తాను. రక్షిస్తాను అన్నాడు రాముడు. ఈ శ్లోకం రామాయణంలో ఒక రత్నం.

జాతి మత కుల స్త్రీ పురుష – దేవ మనుష్య పశు పక్షి క్రిమి కీటకాదులకి శరణాగతి చేసే యోగ్యత ఉంది. ఇదే మన సనాతన భారతీయ సంస్కృతి అని చాటి చెప్పాడు వాల్మీకి మహర్షి.

విభీషణుణ్ణి చంపాలనుకున్నాడు సుగ్రీవుడు. రాముని శరణాగత రక్షణత్వానికి ఆశ్చర్యపోయాడు. అతని దృఢసంకల్పం ధర్మనిరతి అద్భుతమని తలచాడు. దానితో సుగ్రీవునిలో కుటిల ప్రవృత్తి నశించింది. మనసు నిర్మలమైంది. అంటున్నాడు – రామా! నీవు ధర్మజ్ఞుడవు. లోక నాథుడవు. సువ్రతుడవు. సత్పథగామివి. నీవు ఇలా మాట్లాడటంలో ఆశ్చర్యం లేదు. ఆ విభీషణుడు పరిశుద్ధుడని నా అంతరాత్మ చెబుతోంది. అతడు రక్షింపతగినవాడే. రాఘవా! విభీషణుణ్ణి ఇప్పుడే తీసుకువస్తాను. ఆ మహాప్రాజ్ఞుడు మనలో ఒకడు అవుతాడు. మిత్రుడవుతాడు.

## విభీషణుని పట్టాభిషేకం

అభయమిచ్చాడు రాఘవుడు. సంతోషించాడు విభీషణుడు. వినయశీలుడు స్వామిభక్తి పరాయణుడు విభీషణుడు. తన అనుచరులతో దిగాడు. రాముని పాదాలపై పడ్డాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. అనుచరులు అనుసరించారు. అంటున్నాడు విభీషణుడు .

ప్రభూ! రావణుని తమ్ముణ్ణి నేను. నన్ను అవమానించాడు. సర్వభూత శరణ్యుడవు నీవు. నీకు శరణాగతి చేస్తున్నాను.

**పరిత్యక్తా మయాలంకా మిత్రాణి చ ధనాని వై ।**
**భవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖానిచ ॥**

నా లంకను, నా మిత్రుల్ని, నా ధనాన్ని విడిచిపెట్టాను. నీ శరణు జొచ్చాను. నా రాజ్యం, నా జీవితం, నా సుఖం



సర్వమూ నీ అధీనం.

మనలో మాట – విభీషణుడు సర్వమూ త్యజించాడు. వచ్చాడు. శరణాగతి చేశాడు. అంతవరకు బావుంది. నా జీవితం, నా సౌఖ్యాలు అన్నీ నీ అధీనం అంతవరకూ బావుంది. నా రాజ్యం అన్నాడు. అది కూడా రాముని అధీనమే అన్నాడు. రాజ్యం తనది కాదు. అది రావణునిది. తనది కాని దాన్ని తనదిగా భావిస్తున్నాడు. అంటే రావణుని చంపు. రాజ్యం నాకు ఇప్పించు. రాజ్య కాంక్ష ఉందని సుస్పష్టం.

అడక్కపోయినా రాజ్యం వచ్చింది భరతునికి. తిరస్కరించాడు. రాజ్యం రామునిదే అన్నాడు. అయోధ్యకు రమ్మని పిలిచాడు. సున్నితంగా తిరస్కరించాడు రాముడు. పాదుకలడిగాడు. ఇచ్చాడు. నందిగ్రామంలో పాదుకలకి పట్టాభిషేకం చేశాడు భరతుడు. తనది కాని రాజ్యాన్ని రాముని కోసం రాముని ఆజ్ఞగా రాముని కోసం పధ్నాలుగేళ్ళు పాలించాడు. ప్రతిఫలాన్ని రామునికే సమర్పించాడు. దశరథుని పుత్రులు నలుగురూ నాలుగు రత్నాలు. సుగ్రీవుడు అన్నని చంపించాడు. రాజ్యమేలుతున్నాడు. అది తెల్సింది విభీషణునికి. రావణుని చంపి – నన్ను రాజుని చెయ్ అన్నట్లు మాట్లాడాడు. సర్వధర్మాలు త్యజించాడు. శరణాగతి చేశాడు – అది మరో అన్వయం.

శరణాగతికి ఆరు లక్షణాలుండాలి.

1. నేను భగవంతునికి అనుకూలుణ్ణి.
2. ప్రతికూలుణ్ణి కాదు.
3. ఆ స్వామి నన్ను రక్షిస్తాడనే నమ్మకం.
4. ఆ దేవదేవుడే నా రక్షకుడు. అన్యులు కాదు.
5. నేను నాది నాకోసం అనేవి అన్నీ నీకే సమర్పిస్తున్నాను.
6. నేను అకించనుణ్ణి. ఏమీ లేనివాణ్ణి. నీ దాసుణ్ణి.

శరణమంటే ఉపాయం (పొందించేది). శరణ్యమంటే పొందతగింది. ఉపాయ ఉపేయులు రెండూ భగవానుడని నమ్మిన వాళ్ళలో ముఖ్యులు నందవ్రజ గోపికలు. ఇంకా ఎందరో మహానుభావులున్నారు.

విభీషణుడు చెప్పింది విన్నాడు రాముడు. ఊరడించాడు. అతనిలో రాజనీతి తొంగి చూసింది. రావణుని బలాబలాలు అడిగితే – ఆ రహస్యాల్ని చెప్పగల్గితే నమ్మవచ్చు. మిత్రునిగా పరిగణించవచ్చు. ఇది నరునిగా రాజకీయంగా రాముని ఆలోచన. రాక్షసుల బలాబలాలు యథాతథంగా చెప్పు – అన్నాడు.

చెబుతున్నాడు విభీషణుడు. ప్రభూ! బ్రహ్మదేవుని మెప్పించాడు రావణుడు. వరాలు పొందాడు. గంధర్వులు, అసురులు, రాక్షసులు, సమస్త భూతాల నుంచి చావు లేకుండా వరం పొందాడు. అందుకే వాడెవడి చేతిలోనూ చావడు. వాడి తమ్ముడు కుంభకర్ణుడు నాకు అన్న. వాడు మహా పరాక్రమవంతుడు. తేజోవంతుడు. మహాయోధుడు. రావణ సేనాపతి ప్రహస్తుడు. రావణుని కొడుకు ఇంద్రజిత్తు. చేతి వేళ్ళకి తొడుగులుంటాయి. వాడి కవచం అభేద్యం. హోమం చేస్తాడు. అగ్నిహోత్రుణ్ణి సంతృప్తి పరుస్తాడు. యుద్ధరంగంలో కంటికి కనపడడు. మాయావి. ధనుర్ధారియై హతమారుస్తాడు. మహోదరుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు ఈ ముగ్గురూ సేనా నాయకులు. మహాశక్తిమంతులు. కామరూపులు. భయంకరులు. రక్తం తాగుతారు. నరమాంసం తింటారు. పదివేల కోట్ల సేనాబలం ఉంది రావణునికి.

**(సశేషం)**

శ్రీవేంకటేశం

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 413. భక్త వశ్యాయ నమః

భక్తులకు వశవర్తి అయినవాడు కృష్ణుడు.

కృష్ణుడు ఉత్తర గర్భమున ప్రవేశించి అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును తన మాయా శక్తి చేత కప్పివేసి, నిర్వీర్యము చేసి ఆమె గర్భమున ఉన్న శిశువును (పరీక్షిత్తును) రక్షించినాడు.

భక్తుడైన కుచేలుడు తనను కోరకయే అతనికి అష్ట ఐశ్వర్యములను ప్రసాదించినాడు.

ఇట్లు కృష్ణుడు భక్తులకు వశవర్తియై వారి కోరికలను తీర్చినాడు. వారి ఆపదల నుండి రక్షించినాడు.

భక్తవశ్యుడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 414. భీమ పూజ్యాయ నమః

పాండవులలో ధర్మరాజు తమ్ముడైన (రెండవవాడు) భీముని చేత పూజింపబడినవాడు కృష్ణుడు.

భీముని చేత పూజింపబడిన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 415. దయానిధయే నమః

అపారమైన కరుణకు – దయకు – నిధియైనవాడు కృష్ణుడు.

నృగుడను రాజు బ్రాహ్మణ శాపము వలన తొండగా మారి ద్వారకా నగర సమీపమున ఒక బావిలో వుండగా దయానిధి యైన కృష్ణుడు తొండను బావిలో నుండి లేవనెత్తి శాపమును తొలగించినాడు. నృగరాజు తొండరూపము పోగా పూర్వ రాజ రూపముతో స్వస్థానమునకు వెళ్ళినాడు.

కృష్ణుడు జరాసంధ వధ తరువాత అతనిచే కారాగారములో బంధింపబడి యున్న రాజులను దయతో వారినందరినీ బంధ విముక్తులను చేసినాడు.

దయానిధియైన కృష్ణుడు నరకాసుర వధ అనంతరం నరకునిచే కారాగారములు బంధింపబడియున్న 16 వేల మంది రాజకుమార్తెలను బంధవిముక్తులను చేసి, వారిని ద్వారకకు తీసుకొని వచ్చి, వారిని ఆనాటి రాకుమారులు వివాహమాడుటకు ఇష్టపడ నందున వారినందరినీ – 16 వేల రాజకుమార్తెలను దయానిధియైన కృష్ణుడు వివాహమాడి వారందరికీ సుఖజీవితమును, సంఘములో గౌరవ స్థానమును కల్పించినట్టి సంఘ సంస్కర్త, దయార్ద్ర హృదయుడు.

దయానిధి యైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 416. దంతవక్త్ర శిరశ్ఛేత్రే నమః

దంతవక్త్రుని తలను ఖండించినవాడు కృష్ణుడు.

దంతవక్త్రుడు, శిశుపాలుడు సనక సనందుల శాపముచే రాక్షసులుగా (అసుర కృత్యములు కలవారుగా) పుట్టిన జయ విజయులు. వృద్ధ శర్మునికి శ్రుతదేవికి (వసుదేవుని చెల్లెలు) పుట్టిన కుమారుడు దంత వక్త్రుడు. శిశుపాలుని తమ్ముడు. కరూష దేశాధిపతి. దంతవక్త్రుడు శిశుపాలుని స్నేహితులైన సాళ్వ, పౌండ్రక, కాశీరాజులను కృష్ణ వధించినందులకు అతనిపై పగ బూనినాడు. దంతవక్త్రుడు తన వారికి పారలౌకిక క్రియలు చేసి వస్తుండగా, కృష్ణుడు కన్పించినాడు. అప్పుడు దంతవక్త్రుడు కృష్ణుని ఎదుర్కొని చంపబోగా కృష్ణుడే దంతవక్త్రుని వధించాడు. అప్పుడు దంతవక్త్రుని శరీరము నుండి తేజస్సు వెడలి కృష్ణునలో ప్రవేశించింది.

దంతవక్త్రుని శిరస్సును ఖండించిన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 417. కృష్ణ సఖాయ నమః

కృష్ణ అను పేరుగల వారికి మిత్రుడైన కృష్ణునికి నమస్కారము. ద్రౌపది పేరు కృష్ణ. ద్రుపదుని కుమార్తె ద్రౌపది అని పిలువబడి ప్రసిద్ధమయింది.

కృష్ణకు (ద్రౌపదికి) మిత్రుడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 418. స్వరాజే నమః

స్వః అనగా వైకుంఠము. వైకుంఠమునకు అధిపతి యగు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

రైవతమనువు కాలములో విష్ణువు శుభ్రుని పత్ని అయిన వికుంఠకు పుత్రునిగా జన్మించాడు. వికుంఠ యొక్క పుత్రుడు వైకుంఠుడు. అతడు వైకుంఠ లోకాన్ని నిర్మించినాడు.

స్వరాట్ అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

నేటి మనము, పూర్వకాలములో పుత్రుల పేర్లు తల్లిపేరుతో కలిసి, తల్లి పేరు నుండి ఏర్పడి యుండుటను గమనించాలి. మాతృదేవోభవ అన్న సూక్తికి ఫలమిది.

ఉదా : వికుంఠ పుత్రుడు వైకుంఠుడు. వినత పుత్రుడు వైనతేయుడు. కుంతి యొక్క పుత్రులు కౌంతేయులు. గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠీ పుత్ర పులమావి మొదలగువారు.

## 419. వైజయంతీ ప్రమోదినే నమః

వైజయంతీ మాలను ధరించి, దాని సుగంధమునకు ఆనందించువాడు విష్ణువు.


వైజయంతీ ప్రమోద – వైజయంతీ పూలమాలను ధరించి, దాని సువాసనకు ఆనందించువాడగు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

వైజయంతీ మాల విష్ణుదేవుని అసాధారణ, ప్రత్యేకమైన ఆభరణము (పూలమాల.

వక్షోనటత్ఫుల్ల వైజయంతీ దామ భూషణుండు నిశాట భీషణుండు అని

బొడ్డు చెర్ల తిమ్మయ ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధములో విష్ణుదేవుని వర్ణించినాడు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

## అష్టపది – 2

ప్రథమ సర్గము – సామోద దామోదరః ॥ప్రబంధః - 2॥

(హరి విజయ మంగళాచారం) – (ఘూర్జరీ రాగం – నిస్సార తాళం)

హరి విజయ మంగళాచారం-ఘూర్జరీ రాగ నిస్సార తాళాభ్యాం గీయతే-భైరవి రాగం-త్రిపుట తాళం

శ్రిత కమలా కుచమండల! ధృతకుండల! ఏ।
కలిత లలిత వనమాల! జయ జయ దేవ! హరే! ॥1॥
(ధ్రువమ్)
దినమణీమండల మండన! భవ ఖండన! ఏ।
మునిజనమానస హంస! జయ జయ దేవ! హరే! ॥2॥
కాళియ విషధర గంజన! జన రంజన! ఏ।
యదుకుల నళిన దినేశ! జయ జయ దేవ! హరే! ॥3॥
మధు ముర నరక వినాశన! గరుడాసన! ఏ।
సురకుల కేళి నిదాన! జయ జయ దేవ! హరే! ॥4॥
అమల కమల దళ లోచన! భవమోచన! ఏ।
త్రిభువన భవన నిధాన! జయ జయ దేవ! హరే! ॥5॥
జనకసుతా కుచ భూషణ! జిత దూషణ! ఏ।
సమర శమిత దశ కంఠ! జయ జయ దేవ! హరే! ॥6॥
అభినవ జలధర సుందర! ధృత మందర! ఏ।
శ్రీముఖ చంద్ర చకోర! జయ జయ దేవ! హరే! ॥7॥
తవ చరణే ప్రణతా! వయమితి భావయ! ఏ।
కురు కుశలం ప్రణతేషు! జయ జయ దేవ! హరే! ॥8॥
శ్రీ జయదేవ కవేరిదం! కురుతే ముదమ్! ఏ।
మంగలముజ్జ్వల గీతం! జయ జయ దేవ! హరే! ॥9॥
పద్మా పయోధర తటీ పరిరంభ లగ్న
కాశ్మీర ముద్రితమురో మధుసూదనస్య ।
వ్యక్తానురాగమివ ఖేలదనంగ ఖేద
స్వేదాంబుపూర మనుపూరయతు ప్రియం వః ॥6॥
వసంతే వాసంతీకుసుమ సుకుమారై రవయవై
ర్భ్రమంతీం కాంతారే బహు విహిత కృష్ణానుసరణామ్ ।
అమందం కందర్ప జ్వర జనిత చింతాకులతయా
వలద్బాధాం రాధాం సరసమిదముచే సహచరీ ॥7॥

రెండవ అష్టపదిలో, శ్రీకృష్ణుడి గుణ రూప వర్ణన. ‘పాదాల వరకు తులసి మాల ధరించినవాడు, కుండల ధారి, ముని మానస సంచారి, యదుకులోద్ధారి, కాళీయ సంహారి, సూర్యమండలాన్ని వెలిగించేవాడు, రాక్షస సంహారి, భక్తజనోద్ధారి, నవ నీల మేఘ సుందరుడు, మంధర ధారి, మునుపు రామావతారి, అగు శ్రీకృష్ణుడి పాద పద్మాలకు మంగళం.’ అంటూ మంగళ గీతం సమర్పిస్తారు.

లోకాన్ని కాటేసే విషసర్పాలెన్నో వున్నాయి. కాళీయుడు వాటికి ప్రతినిధి దానినెత్తిన చిందులువేసి విషం కక్కించిన వేల్పుడవు. కృష్ణా... కాళీయ విషధరగంజనా... జనరంజకతని ఒక విధిగా భావించిన దేవా! యదుకుల నళిన దినేశా! శ్రీకృష్ణా! నీకు మంగళం! శుభ మంగళం!

మంగళాశాసనం కావించి శ్రీకృష్ణుడి దివ్యమంగళ విగ్రహ స్వరూపగుణ విభూతుల్ని నిరూపిస్తున్నాడు కవి జయదేవుడు!

శ్రిత కమలా కుచమండల! ధృతకుండల! ఏ।
కలిత లలిత వనమాల! జయ జయ దేవ! హరే! ॥1॥
(ధ్రువమ్)

**ప్రతిపదార్థం:** శ్రిత=ఆశ్రయించబడిన; కమలా= లక్ష్మీదేవి; కుచమండల = హృదయ ప్రదేశం కలవాడా

(లక్ష్మీదేవి ఆశ్రయించిన హృదయం కలవాడా); ధృత = ధరించిన; కుండల = ప్రకాశించే చెవి పోగులు కలవాడా; కలిత = అలంకరించబడిన/కలిగియున్న; లలిత = మనోహరమైన; వనమాల = వైజయంతి మాలను (వనమాలను) ధరించిన దేవా; జయ జయ = విజయం కలుగుగాక; దేవ = ఓ దైవమా; హరే = పాపాలను హరించే ఓ శ్రీహరి.

**విశేషాలు:** మంగళాచరణం: ఈ శ్లోకం భగవంతుని మంగళకరమైన రూపంతో ప్రారంభమవుతుంది, ఇది భక్తులకు శుభప్రదం.

**అవతార పురుషుడు:** శ్రీమహాలక్ష్మికి నిలయమైన వక్షస్థలం కలవాడని చెప్పడం ద్వారా ఆయన సర్వ సంపదలకు అధిపతి అని సూచించబడింది.

**జయఘోష:** "జయ జయ" అని రెండుసార్లు అనడం ద్వారా భక్తుడి గాఢమైన భక్తి మరియు దేవుని అత్యున్నత విజయాన్ని కొనియాడటం జరుగుతోంది.

**శబ్ద సౌందర్యం:**

**అనుప్రాసాలంకారము:** 'శ్రిత', 'ధృత', 'కలిత', 'లలిత' వంటి పదాల ఉపయోగిం వల్ల ఈ శ్లోకానికి చక్కని లయ మరియు వినసొంపైన శబ్ద సౌందర్యం చేకూరింది.

**లలిత పద ప్రయోగం:** జయదేవుడు తన రచనలలో "కోమల కాంత పదాల"ను ఉపయోగిస్తాడు, ఈ శ్లోకం కూడా ఎంతో సుకుమారంగా, గాన యోగ్యంగా ఉంటుంది.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! నీవు నీ ప్రకాశవంతమైన కుండలాలతో (చెవిపోగులతో) శ్రీ (రాధ) ఒడిలో శయనించి, నీ మనోహరమైన వనమాల మాలతో ఆడుకుంటున్నావు! ఓ హరీ, నీవు విజయం సాధించు!

శ్రీకృష్ణుడు లక్ష్మీ సంపన్నుడు. శ్రితకమలాకుచ మండలుడు... శ్రీలక్ష్మి గాఢ ఆలింగనాన ఆమె కుచమండలాలు తన హృదయాన ధరించిన వాడు. సాక్షాత్తూ ఆ లక్ష్మిని తన వక్షస్థలానే అధివశింపచేసిన వాడు. లలిత తులసీ మాలని మెడనుంచీ పాదపర్యంతం ధరించిన వాడు. ఆ దివ్య విగ్రహాన్ని చూడడానికి రెండు కళ్ళు చాలవేమో.

అమందానందకరమైన ఆ రూపసౌందర్యం కల్పించే పరవశం దృష్టిదోషాన్ని ఎక్కడ కల్గిస్తుందో! దుర్మార్గుల దిష్టి తగిలి భగవంతుని సౌందర్యం ఎక్కడ భంగం అవుతుందో!



ప్రభూ! నీకు మంగళం! నీ వక్షస్థలాన స్థిర నివాసిగా ఉన్న లక్ష్మీదేవికి మంగళం! నీ చెవులకు వ్రేలాడే కర్ణాభరణాలకు మంగళం! నీ మెడలో ధరించిన వనమాలకు మంగళం! సుందరరూపా నీకు జయమంగళం!

**భావార్థం:** లక్ష్మీదేవిచే ఆశ్రయింపబడిన హృదయం కలవాడా! ధగధగ మెరుస్తున్న కుండలాలు ధరించిన వాడా! మనోహరమైన వనమాలను ధరించిన దేవా! హరీ! గోవిందా! గోపాలా! నీకు ఎల్లప్పుడు జయమగు గాక!

**దినమణీమండల మండన! భవ ఖండన! ఏ।**
**మునిజనమానస హంస! జయ జయ దేవ! హరే! ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** దినమణీమండల = సూర్యమండలానికి; మండన = ఆభరణం వంటివాడా (సూర్యుని వలె ప్రకాశించే రత్నాలంకారాలతో అలంకరించబడినవాడా); భవ ఖండన = సంసార బంధాలను (పుట్టుక, చావుల వలయాన్ని) తెంచివేసేవాడా; మునిజన = మునుల యొక్క; మానస హంస = హృదయాలనే 'మానస సరోవరం'లో విహరించే 'హంస' వంటివాడా; జయ జయ దేవ! హరే = ఓ దేవా! ఓ శ్రీహరీ! నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** ముక్తి ప్రదాత: భగవంతుడు కేవలం అలంకార ప్రియుడు మాత్రమే కాదు, జీవులను సంసార

సాగరం నుండి దరిజేర్చే 'భవ ఖండన' అని ఇక్కడ నొక్కి చెప్పబడింది.

మునిజన హృదయ నివాసి: నిర్మలమైన మనస్సు కలిగిన మునుల హృదయాలలోనే భగవంతుడు కొలువై ఉంటాడని 'మానస హంస' అనే రూపకం ద్వారా వివరించబడింది.

**శబ్ద సౌందర్యం:** అంత్యానుప్రాస మరియు లయ - 'మండన', 'ఖండన' వంటి పదాల ఉపయోగం శ్లోకానికి చక్కని నాదాన్ని ఇచ్చింది.

**రూపక అలంకారం:** మునుల హృదయాన్ని సరస్సుతో, భగవంతుని హంసతో పోల్చడం వల్ల ఈ శ్లోకానికి గొప్ప సాహిత్య విలువ చేకూరింది.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! నీవు వేయి సూర్యుల వలె ప్రకాశించే ఆభరణం. నీవు భౌతిక అస్తిత్వ బంధాన్ని తెంచుతావు. నీవు ఋషుల హృదయాలనే మానస సరస్సులో విహరించే హంసవు. నీవు విజయం సాధించు! నీవు విజయం సాధించు!

ఏ వస్తువైనా అంతకుమించి ప్రకాశవంతంగా వున్నప్పుడు మాత్రమే మెరుస్తుంది. సూర్యుని కన్నా ప్రకాశవంతంగా, సూర్యమండలానికే భూషణంగా ప్రకాశించే కృష్ణా! భవఖండనం చెయ్యి- ఈ సంసార భారాన్ని తొలగించు. పుణ్యమూర్తుల మానస సరస్సులో హంసలా విహరించే కృష్ణా! నీ భక్తుల సంసార బాధని తొలగించు. రక్షించు. అదే నీకు మంగళం! జయ మంగళం!

నీ సామర్థ్యం, నీ సఖిత్వం, నీ సత్యరూపం... మమ్మల్ని ఎప్పుడూ కాపాడుతూనే వుంటాయి. అందుకే కృష్ణా! నువ్వు దినమణిమండల మండనుడివి! సూర్యకాంతి విరాజితుడివి! కీర్తిమంతుడివి!

**భావార్థం:** సూర్యునివలె ప్రకాశిస్తున్న రత్నాలంకారాలతో అలంకరించబడినవాడా! భవబంధాన్ని పోగొట్టేవాడా! మునుల హృదయాలనే మానస సరస్సులో సంచరించే హంస అగువాడా జయము!

**కాళియ విషధర గంజన! జన రంజన! ఏ।**
**యదుకుల నళిన దినేశ! జయ జయ దేవ! హరే! ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** కాళియ = కాళియుడనే సర్పం యొక్క; విషధర = విషాన్ని ధరించిన పాము గర్వాన్ని; గంజన = అణచివేసినవాడా (మర్దించినవాడా); జన రంజన = ప్రజలకు అమితమైన సంతోషాన్ని కలిగించేవాడా; యదుకుల = యదువంశము అనే; నళిన = పద్మానికి; దినేశ = సూర్యుని వంటి వాడా (సూర్యుడు పద్మాన్ని వికసింపజేసినట్లు, యదువంశాన్ని ప్రకాశింపజేసేవాడా); జయ జయ దేవ! హరే = ఓ శ్రీహరీ! నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** దుష్టశిక్షణ - శిష్టరక్షణ: కాళియుడిని అణచడం ద్వారా లోకానికి పట్టిన పీడను వదిలించి, ప్రజలకు (జన రంజన) ఆనందాన్ని పంచిన కృష్ణుడి లీలా విశేషం ఇక్కడ వర్ణించబడింది.

**వంశోద్ధారకుడు:** సూర్యుడు ఉదయిస్తేనే పద్మం వికసిస్తుంది; అలాగే కృష్ణుడు జన్మించడం వల్లే యదువంశానికి అంతటి కీర్తి, వికాసం లభించాయని చెప్పడం కవి చమత్కారం.

**శబ్ద సౌందర్యం: అంత్యానుప్రాస:** 'గంజన', 'రంజన' అనే పదాల కలయిక వల్ల శ్లోకానికి చక్కని లయ, సంగీత సౌరభం లభించాయి.

**రూపక అలంకారం:** యదువంశాన్ని 'నళినం' (పద్మం) తోనూ, కృష్ణుడిని 'దినేశ' (సూర్యుడు) తోనూ పోల్చడం ఎంతో మనోహరంగా ఉంది.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! విష సర్పమైన కాళియుని అహంకారాన్ని నీవు అణిచివేస్తావు. నీ ప్రియమైన వారి హృదయాలను అంతులేని ఆనందంతో నింపుతావు. యాదవ వంశ పద్మాన్ని వికసింప జేసే సూర్యునివి నీవే. నీవు విజయం సాధించు! నీవు విజయం సాధించు!

లోకాన్ని కాటేసే విషసర్పాలెన్నో వున్నాయి. కాళీయుడు వాటికి ప్రతినిధి! దానినెత్తిన చిందులు వేసి విషం కక్కించిన వేల్పుడవు. కృష్ణా! కాళీయ విషధరగంజనా! జనరంజకతని ఒక విధిగా భావించిన దేవా! యదుకులనళినదినేశా! శ్రీకృష్ణా! నీకు మంగళం! శుభమంగళం!

**భావార్థం:** విషనాగుల్లో పేరుపొందిన కాళియుని అణచిన వాడవు. జనులకు మిక్కిలి సంతోషం కలిగించేవాడవు. యదుకులం అనే తామరకు వికాసం కలిగించే సూర్యుడవు. నీకు జయము.

**మధు ముర నరక వినాశన! గరుడాసన! ఏ।**
**సురకుల కేళి నిదాన! జయ జయ దేవ! హరే! ॥ 4 ॥**

**ప్రతిపదార్థం:** మధు, ముర, నరక = మధువు, మురుడు, నరకుడు అనే రాక్షసులను; వినాశన = సంహరించినవాడా

/ నాశనం చేసినవాడా; గరుడాసన = గరుత్మంతుడిని తన వాహనంగా చేసుకున్నవాడా; సురకుల = దేవతల యొక్క; కేళి = క్రీడలకు / లీలలకు; నిదాన = మూల కారణమైనవాడా; జయ జయ దేవ! హరే = ఓ శ్రీహరీ! నీకు విజయము కలుగుగాక.

**విశేషాలు:** అసుర సంహారం: భగవంతుడు ధర్మాన్ని రక్షించడానికి మధు, ముర, నరకాసురుల వంటి భయంకరమైన రాక్షసులను అంతం చేశాడని ఈ శ్లోకం కీర్తిస్తోంది.

**దేవతల క్రీడ:** దేవతలు సైతం గోపికలుగా, గోపకులుగా జన్మించి శ్రీకృష్ణునితో క్రీడిస్తూ గొప్ప ఆనందాన్ని పొందడం ఈ శ్లోకంలోని 'సురకుల కేళి' అనే పదబంధం ద్వారా సూచించబడింది.

**శబ్ద సౌందర్యం:** అంత్యానుప్రాస: 'వినాశన', 'గరుడాసన', 'నిదాన' వంటి పదాల కలయిక వల్ల శ్లోకానికి చక్కని లయ, నాద సౌందర్యం ఏర్పడ్డాయి.

**ప్రౌఢ పద ప్రయోగం:** భగవంతుని శక్తిని (రాక్షస సంహారం), వైభవాన్ని (గరుడ వాహనం) మరియు మాధుర్యాన్ని (లీలలు) ఒకే శ్లోకంలో పొందుపరచడం కవి ప్రతిభకు నిదర్శనం.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! ఓ మధు, మూర, నరక అనే రాక్షస సంహారకుడా! ఓ నీ దివ్య గరుడ వాహనంపై సవారీ చేసేవాడా! మిగిలిన దేవతల ఆనందమయ క్రీడకు నీవే స్ఫూర్తి. నీకు జయము కలుగుగాక! నీకు జయము కలుగుగాక!

మధు అనే రాక్షసుడు, మురాసురుడు, నరకాసురుడు ఒకరేమిటి ఎందరో రాక్షసులను సంహరించి లోకంలో రాక్షసపీడను నశింపచేశావు. గరుడాసనా! సురకేళినిదాన! గరుడ వాహనంపై పయనిస్తూ లోకాలన్నీ పాలిస్తూ దేవతల దైవకార్యాలకు ఆటపట్టుగా నిలిచిన శ్రీకృష్ణా! హరి! నీకు జయము జయము.

**భావార్థం:** మధు, ముర, నరకాది రాక్షసుల్ని నాశం చేశావు. గరుడుణ్ణి వాహనంగా జేసుకున్నావు. దేవతల క్రీడలకు ఆది కారణమైనావు. దేవతలు గోపీ, గోపకులుగా జన్మించి శ్రీకృష్ణునితో క్రీడిస్తూ గొప్ప సంతోషం పొందడం ఇందులో సూచింపబడింది.

**అమల కమల దళ లోచన! భవమోచన! ఏ।**
**త్రిభువన భవన నిధాన! జయ జయ దేవ! హరే! ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** అమల = నిర్మలమైన; కమల దళ = తామర పువ్వు రేకుల వంటి; లోచన = కన్నులు కలవాడా; భవమోచన = జనన మరణ రూపమైన సంసార బంధాల నుండి విడిపించేవాడా; త్రిభువన భవన = మూడు లోకాలనే భవనానికి (సృష్టికి); నిధాన = మూల కారణమైనవాడా; జయ జయ దేవ! హరే = ఓ దేవదేవా! నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** ముక్తి ప్రదాత: భగవంతుడు కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, జీవులను జనన మరణ చక్రం నుండి విముక్తి చేసే 'భవమోచనుడు' అని ఇక్కడ పేర్కొనబడింది.

**పరమాత్మ స్వరూపం:** సమస్త విశ్వానికి (మూడు లోకాలకు) ఆయనే ఆధారమని 'త్రిభువన భవన నిధాన' అనే పదం ద్వారా స్పష్టమవుతోంది.

**శబ్ద సౌందర్యం:** ఉపమాలంకారం: దేవుని కళ్లను 'అమల కమల దళములతో' (నిర్మలమైన తామర రేకులతో) పోల్చడం ఎంతో సుందరంగా ఉంది.

అంత్యానుప్రాస: 'లోచన', 'మోచన', 'నిధాన' వంటి పదాల ప్రయోగం వల్ల ఈ శ్లోకం పాడుకోవడానికి ఎంతో వీలుగా, లయబద్ధంగా ఉంది.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! మీ తేజోవంతమైన నేత్రాలు స్వచ్ఛమైన పద్మపుష్ప రేకుల వలె ఉన్నాయి. మీరు భౌతిక అస్తిత్వపు దుఃఖం నుండి విముక్తిని ప్రసాదిస్తారు. మీరే మూడు లోకాలకు ఆధారం. మీకు విజయం కలుగుగాక! మీకు విజయం కలుగుగాక!

ఈ సృష్టి ఎవరి ప్రేరణవలన కలుగుతోందీ, ఈ ముల్లోకాలూ ఎవరి కారణంగా మనుగడ సాగిస్తున్నాయి. అత్యంత నిర్మలమైన కలువ పూలరేకులవంటి కన్నులగల అమలకమలదళ లోచనా! త్రిభువనభవననిదానా! మూడు లోకాల ఉత్పత్తికీ కారణమైన నిధివంటి ఓ దేవా! భవమోచనాన్ని కల్గించవయ్యా! ఈ సంసార బంధాల నుంచి మోక్షానందం కల్గించవయ్యా.

**భావార్థం:** నిర్మలమైన తామర రేకులవంటి నేత్రాలు కలవాడివి. ఆశ్రితులను జనన మరణ రూపమైన సంసార బంధం నుంచి విడిపించ గలవాడివి. మూడు లోకాల ఉత్పత్తికి కారణం నీవే, అలాంటి దేవ దేవుడవైన నీకు జయం.



**జనకసుతా కుచ భూషణ! జిత దూషణ! ఏ।**

**సమర శమిత దశ కంఠ! జయ జయ దేవ! హరే! ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** జనకసుతా = జనక మహారాజు పుత్రిక అయిన సీతాదేవికి; కుచ భూషణ = హృదయ ప్రదేశంలో ఆభరణంలా నిరంతరం కొలువై ఉండేవాడా; జిత దూషణ = దూషణుడు అనే రాక్షసుడిని జయించినవాడా (ఖరదూషణాది రాక్షసులను సంహరించినవాడా); సమర = యుద్ధమునందు; శమిత = అంతమొందించిన/సంహరించిన; దశ కంఠ = పది తలలు కలిగిన రావణాసురుడిని; జయ జయ దేవ! హరే = ఓ దేవా, నీకు విజయము కలుగుగాక.

**విశేషాలు: రామాయణ వృత్తాంతం:** ఈ శ్లోకం శ్రీరాముని పరాక్రమాన్ని కీర్తిస్తుంది. ఖరదూషణాదులను సంహరించి అలసిపోయిన రాముడిని సీతాదేవి తన కౌగిలితో సేదదీర్చిన ప్రసిద్ధ గాథను ఇది గుర్తుచేస్తుంది.

**దుష్ట శిక్షణ:** ముల్లోకాలను పీడించిన రావణాసురుడిని అంతం చేయడం ద్వారా ధర్మాన్ని నిలబెట్టిన తీరు ఇక్కడ కొనియాడబడింది.

**శబ్ద సౌందర్యం: అంత్యానుప్రాస:** 'భూషణ', 'దూషణ' వంటి పదాల ఉపయోగం శ్లోకానికి చక్కని లయను, వినసొంపైన నాదాన్ని చేకూర్చింది.

**పదప్రయోగం:** 'దశ కంఠ' (పది కంఠములు గలవాడు) అని రావణుడిని సంబోధించడం ద్వారా అతని భీకర రూపాన్ని, 'శమిత' (అణచివేయుట) అనే పదం ద్వారా భగవంతుని శాంత గంభీర పరాక్రమాన్ని కవి అద్భుతంగా చిత్రించాడు.

**తాత్పర్యం:** ఓ దేవా! ఓ హరీ! నీవు శ్రీరామునిగా అవతరించి సీతాదేవిని అలంకరించు. నీవు దూషణుడిని ఓడించి, యుద్ధంలో పది తలల రావణుడిని సంహరించి ప్రపంచానికి శాంతిని చేకూర్చు. నీవు విజయం సాధించు! నీవు విజయం సాధించు!

రామావతారంలో జనకుని కూతురు సీతాదేవిని పరిణయమాడి కుచభూషణుడిగా ఆ తల్లి కుచాలకు అలంకారంగా నిలిచావు, అంతేనా? ఒకవైపు సీతామాత స్తనశయ్యను అలంకరించావు. ఇంకొకవైపు దూషణుడు, రావణుడు వంటి రాక్షసకోటిని జయించావు.

రాముడంటే, సకలకళాకౌశలుడు! జనకసుతాకృత భూషణుడు - సమరంలో దశకంఠుడి పీడని శమింప చేసినవాడు. సమరశమితదశకంఠ! కారుణ్యం, తారుణ్యం, అభిమానం, క్షమాగుణం కలిగిన దేవా! హరీ! నీకు జయము!

**భావార్థం:** సీతాదేవి కుచాలకు ఆభరణంలా, ఆ దేవి హృదయంలో ఎల్లప్పుడూ విహరిస్తున్నావు. ఖరదూషణ రాక్షసుల్ని జయించావు. ఖరదూషణాదుల్ని సంహరించి విక్రమంచూపి అలసిన శ్రీరాముణ్ణి సీతాదేవి ఆలింగనంతో సంభావించి శ్రమదీర్చిన వృత్తాంతం శ్రీ రామాయణ ప్రసిద్ధం. త్రిలోక భయంకరుడైన రావణాసురుణ్ణి యుద్ధంలో సంహరించావు. అలాంటి దేవుడవు, నీకు జయం.

**అభినవ జలధర సుందర! ధృత మందర! ఏ।**
**శ్రీముఖ చంద్ర చకోర! జయ జయ దేవ! హరే! ॥ 7 ॥**

**ప్రతిపదార్థం**

అభినవ = కొత్తదైన; జలధర = మేఘం వలె; సుందర = అందమైనవాడా (నీలమేఘ శ్యాముడా);

ధృత మందర = మందర పర్వతాన్ని ధరించినవాడా (క్షీరసాగర మథన సమయంలో కూర్మావతారంలో పర్వతాన్ని వీపుపై మోసినవాడా); శ్రీముఖ = లక్ష్మీదేవి యొక్క ముఖమనే; చంద్ర = చంద్రునికి; చకోర = చకోర పక్షి వంటివాడా; జయ జయ దేవ! హరే = ఓ శ్రీహరీ, నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** కూర్మావతార ప్రస్తావన: క్షీరసాగర మథనం సమయంలో పర్వతం మునిగిపోకుండా అండగా నిలిచిన భగవంతుని రక్షకత్వాన్ని 'ధృత మందర' అనే పదం సూచిస్తుంది.

**దివ్య ప్రేమ:** లక్ష్మీదేవి మరియు శ్రీహరి మధ్య గల అవినాభావ సంబంధాన్ని చకోర పక్షి - చంద్రుని ఉదాహరణతో జయదేవుడు ఎంతో రమణీయంగా వర్ణించాడు.

**శబ్ద సౌందర్యం:** ఉపమాలంకారం: భగవంతుని దేహ ఛాయను 'అభినవ జలధర' (కొత్త మేఘం) తో పోల్చడం వల్ల శ్లోకానికి ఒక దృశ్యరూపకమైన అందం వచ్చింది.

రూపక అలంకారం: లక్ష్మీదేవి ముఖాన్ని చంద్రబింబంగా, భగవంతుని చూపులను చకోర పక్షిగా చిత్రించడం కవి ప్రతిభకు నిదర్శనం.

**తాత్పర్యం:** ఓ శ్యామసుందరా, నీ దేహ తేజస్సు తాజా వాన మేఘంలా ప్రకాశిస్తోంది. ఓ మందర పర్వతాధిపతి! చకోర పక్షి చంద్రుని కోసం ఎలా తపిస్తుందో, అలా నీవు లక్ష్మీదేవి అయిన శ్రీ యొక్క చంద్రుని వంటి ముఖానికి నిరంతరం అంటిపెట్టుకుని ఉన్నావు. ఓ హరీ! ఓ దేవా! నీవు విజయం సాధించు! నీవు విజయం సాధించు!

కొత్తమేఘం మరీ నల్లగా వుంటుందట. అభినవజలధరం లాగా సుందరమైన హరీ! మందర పర్వతాన్ని అవలీలగా ఎత్తిన ఘన చరితా! చంద్రుడి లోని అమృతాన్ని పానం చేసి ఆనందించే చకోరపక్షిలా, చందమామ వంటి లక్ష్మీదేవి ముఖబింబాన్ని చూస్తూ ఆమె అధరపానం చేస్తూ ఆనందరసమగ్నుడవైన హరీ! ఆశ్రితులకు ఆశ్రయదాతా! కృష్ణా! నీకు నమస్సులు.

**భావార్థం:** క్రొత్త కారుమేఘంలా సౌందర్యం కలవాడివి. క్షీరసాగరాన్ని దేవతలు రాక్షసులు కలిసి చిలికినప్పుడు మందర పర్వతాన్ని వీపున ధరించావు. ఆ మథన సందర్భంలో పాలకడలిలో తోచిన లక్ష్మీదేవి ముఖమనే చంద్రమండలానికి చంద్రకిరణాలను పానంచేసి జీవించే చకోర పక్షిలా ఆమె ముఖసౌందర్య వీక్షణంవల్ల అమితానందం పొందినవాడవై ప్రకాశిస్తున్నావు. అలాంటి దేవుడవైన శ్రీహరివి, నీకు జయం.

**తవ చరణే ప్రణతా! వయమితి భావయ! ఏ।**
**కురు కుశలం ప్రణతేషు! జయ జయ దేవ! హరే! ॥ 8 ॥**

**ప్రతిపదార్థం:** తవ = నీ యొక్క; చరణే = పాద పద్మములకు; ప్రణతా = నమస్కరించుచున్నాము; వయమితి = మేమందరము అని; భావయ = భావించుము (తలచుము); కురు = చేయుము; కుశలం = మేలును/ శుభమును; ప్రణతేషు = నమస్కరించిన వారియందు (భక్తులయందు); జయ జయ దేవ! హరే = ఓ శ్రీహరీ, నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** శరణాగతి: ఈ శ్లోకం సంపూర్ణ శరణాగతిని సూచిస్తుంది. భక్తులు తమను తాము భగవంతుని పాదాల చెంత సమర్పించుకుంటూ, ఆయన రక్షణను కోరుతున్నారు.

ఫలశ్రుతి వంటి ప్రార్థన: అష్టపది ముగింపులో భక్తులందరి తరపున "కుశలం" (క్షేమం) కోరడం ద్వారా ఈ స్తోత్రం లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తోంది.

**శబ్ద సౌందర్యం:** భక్తి రసం: ఈ శ్లోకంలో సరళమైన పదాలతో కూడిన భక్తి భావం ఉట్టిపడుతుంది. 'ప్రణతా',

'ప్రణతేషు' వంటి పదాల పునరావృతం వినమ్రతను చాటుతోంది.

**అంత్యానుప్రాస:** 'భావయ', 'దేవ' వంటి పదాల లయబద్ధమైన అమరిక వల్ల ఈ శ్లోకం పాడుకోవడానికి ఎంతో మధురంగా ఉంటుంది.

**తాత్పర్యం:** ఓ భగవాన్, మేము మీ పద్మపాదాలను శరణు వేడుకుంటున్నాము. భక్తి అనే వరాన్ని ప్రసాదించి మాకు శుభాన్ని కలిగించండి. ఓ దేవా! ఓ హరీ! మీరు విజయం సాధించండి! మీరు విజయం సాధించండి!

నీ పాదాలనంటి నమస్కరించిన భక్తులం. మంగళదాతవైన ప్రభూ! మాకు శుభాలు కల్గించు, కుశలం ప్రసాదించు. దేవా! హరీ! జయము!

**భావార్థం:** ఓ శ్రీహరీ! మేమందరము నీ పాదపద్మాలకు ప్రణామం చేస్తున్నామని భావించు. నీకు నమస్కరించిన మమ్ములను ఎల్లప్పుడూ కరుణించి మాకు శుభములను చేకూర్చు. ఓ దేవదేవా, నీకు జయము కలుగుగాక.

**శ్రీ జయదేవ కవేరిదం! కురుతే ముదమ్! ఏ।**
**మంగలముజ్జ్వల గీతం! జయ జయ దేవ! హరే! ॥ 9 ॥**

**ప్రతిపదార్థం:** శ్రీ జయదేవ కవేః = శ్రీ జయదేవ కవి యొక్క; ఇదం = ఈ (రచన/పాట); కురుతే ముదమ్ = సంతోషాన్ని కలిగిస్తుంది; మంగలం = శుభప్రదమైనది; ఉజ్జ్వల గీతం = మిక్కిలి ప్రకాశించే ఈ దివ్య గీతం; జయ జయ దేవ! హరే = ఓ దేవా, నీకు జయము కలుగుగాక.

**విశేషాలు:** ఫలశ్రుతి: ఈ శ్లోకం ఈ అష్టపది యొక్క ముగింపును మరియు దానిని వినడం వల్ల కలిగే ప్రయోజనాన్ని (సంతోషం మరియు మంగళం) తెలియజేస్తుంది.

కవి వినమ్రత: జయదేవుడు తన పేరును ఈ శ్లోకంలో జోడించడం ద్వారా, ఈ స్తుతిని భగవంతుడికి అంకితం ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు.

**శబ్ద సౌందర్యం:** నాద గుణం: 'ముదమ్', 'గీతం' వంటి పదాల ప్రయోగం వల్ల శ్లోకానికి చక్కని లయబద్ధమైన ముగింపు లభించింది.

తాత్పర్యం: ఓ దేవా, శ్రీ జయదేవుడు రచించిన ఈ మనోహరమైన, తేజోవంతమైన, మధురమైన శుభ స్నానమైన (మంగళశాసనం) మీ ఆనందాన్ని వృద్ధి చేయుగాక. మీ మహిమాన్విత గుణాలను విని, పఠించే మీ భక్తులకు ఇది ఆనందాన్ని ప్రసాదించుగాక. మీరు విజయం సాధించుగాక! మీరు విజయం సాధించుగాక!

శ్రీకృష్ణా! ఉజ్వల గీతాలు కల్గిన ఈ జయదేవకవి పలికే మంగళాశాసనాలు నీకు సంతోషాన్ని కల్గిస్తాయి. జయదేవకవి గానించిన ఈ మధుర గీతాలు పఠించేవారికి కూడా కుశలాలు కల్గిస్తాయి.

**భావార్థం:** మిక్కిలి ప్రకాశిస్తూ శ్రోతలకు సంతోషాన్ని కలిగిస్తూ మంగళకరమై శ్రీజయదేవుని ఈ మంగళగీతం ఒప్పుతున్నది. దేవా నీకు జయం కలుగునుగాక.

మంగళాంతం: "మంగళం" అనే పదంతో ముగించడం భారతీయ సాహిత్య సంప్రదాయంలో ఒక శుభసూచకం.

**(ఇంకా ఉంది)**




## భక్తులకు విజ్ఞప్తి

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం వారి జప పుస్తకములలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకు జపము వ్రాసే భక్తులు, వారి వారి జప పుస్తకములను పూర్తి చేసి తేది 10-08-2026 వరకు మా పీఠం అడ్రస్‌కు పంపగలరని మనవి.

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ
హైదరాబాద్ – 500 007. 040-27175050

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

**గత సంచిక తరువాయి**

ఇటువంటి దేవదేవుని చూసి బ్రహ్మాది దేవమునులు అందరూ ఆశ్చర్యంతో నేత్రాలు విప్పారు. ఆ కేశవునికి సంతోషంతో సాష్టాంగపడి తమ శిరస్సులతో నమస్కరించారు. శుభలోచనములు గల వారంతా విశ్వ సృష్టికారణుడైన ఆ పరాత్పరుని చక్కగా స్తోత్రం చేసి, ప్రజ్వలిస్తూ సుదర్శన చక్రాన్ని ధరించిన శ్రీమహావిష్ణువు విమానం నుండి బయలువెడలి ఆ కేశవునకు భూమిపై సాష్టాంగ నమస్కారాలు చేసి, ఆ దివ్యవిమానానికి ప్రదక్షిణం చేసి, ఆ మహాపర్వతాన్ని కీర్తిస్తూ వచ్చిన త్రోవనే వెళ్ళారు.

పితామహుడైన బ్రహ్మదేవుడు ఆకాశంలో సంచరించే దేవతలందరితో కూడి వారిచే కీర్తించబడుతూ సత్యలోకానికి వెళ్ళాడు. పినాకపాణి, త్రిపురాంతకుడు అయిన శంకరుడు త్రిలోకవిఖ్యాతి చెందినది, దివ్యమైనది, వెండికొండ, నానావిధ రత్నములచే విరాజిల్లుతున్నది. పారిజాత వృక్షములచే అలంకరింపబడినది, అనేకమంది తపశ్శాలురు తపస్సు చేస్తున్నది, అనేకమంది సిద్ధులు, ఋషులు సేవిస్తున్న కైలాసానికి ఋషులందరితో పాటు వెళ్ళాడని వామదేవమహర్షి జనకునికి చెప్పాడు.

## వేంకటాచలం నుండి శంకరుడు కైలాసానికి వెళ్ళుట

అంతట జనక మహారాజు వామదేవమహర్షిని 'ఓ మునివరా! చంద్రశేఖరుడైన పరమశివుడు శంకరుడు, శంభు భగవానుడు ఈ దివ్యపర్వతం నుండి తన నివాసమైన, దివ్యమైన కైలాసానికి ఎలా వెళ్ళాడు? ఇదంతా యథార్థంగా వినగోరుచున్నాను. మహాశ్చర్యకరమైనది, వినేవారికి ఆనందాన్ని పెంపొందింప చేసేది అయిన సచ్చరిత్రను నాకు వివరంగా తెలియజేయండి' అని ప్రార్థించగా వామదేవమహర్షి ఇలా చెప్పనారంభించాడు -

మహారాజా! భగవంతుడైన శంకరుడు తన నివాసమైన కైలాసానికి ఎలా వెళ్ళాడో ఆ మహాశ్చర్యకరమైన వృత్తాంతాన్ని చెబుతాను వినండి.

ఆ పరమశివుని మహాపరాక్రమవంతమైన వృషభం మేరుమందర పర్వతాల వలె ఉన్నది. చిత్ర విచిత్రాలైన అనేక మణులచే అలంకరించ బడినది. ఆ మణులన్నీ చక్కటి ధ్వని చేస్తున్నాయి. మహాబలం గల ఆ వృషభం చక్కగా అలంకరించబడి ఉంది. అది పెద్ద శరీరం గలది, మేఘ గంభీరమైన ధ్వని కలది, మేఘమువంటి కాంతి గలది, శత్రువులకు దుఃఖాన్ని పెంపొందించేది.

ఆ వృషభం ముల్లోకాలలో ప్రసిద్ధి చెందినది. సకల రత్నములచే విభూషితమైనది. దివ్యమైన పెద్ద నూపురము కలది. వేగంలో వాయువుతో సమానమైనది. దివ్యమైన మంగళకరమైన మెరుస్తున్న మణులతో కూడిన బంగారు తాళ్ళతో కట్టబడినది. అది ఆకాశంలో సంచరిస్తున్నది. దాని కొమ్ములు చాలా పెద్దవిగా ఉన్నాయి. అవి బంగారు మాలలతో అలంకరింప బడి ఉన్నాయి.

ఆ వృషభరాజం తేజస్సుతో ప్రకాశిస్తూ శుభప్రదమై చూడటానికి ఇంపుగా ఉంది. దాని శరీరమంతా వందలు, వేలు బంగారు చిరుగంటల దండలతో అలంకరించబడింది. దాని చెవులకు మంచి కాంతితో ప్రకాశిస్తున్న ముత్యాల సరాలను అలంకరించింది.

అటువంటి మహాకాయము గల గొప్పవృషభరాజాన్ని అధిరోహించి సర్వపాపములను హరించే హరుడైన శంకర భగవానుడు బలవంతులైన ప్రమథ గణాలతోను, మహాబలవంతులైన భూతప్రేత గణాలతోను పరివేష్టితుడై అనేక బాహువులు కలవాడై ఆకాశంలో సంచరించే దేవతా గణముల చేత స్తుతించబడుతూ ఆ పరమేశ్వరుడు తన దివ్యతేజస్సుతో ఈ చరాచర జగత్తునంతటిని ప్రకాశింపజేస్తూ నారాయణగిరి గురించిన కథలు చెబుతుండగా వింటూ నెమ్మదిగా ఆ పరమశివుడు తన నిలయమైన కైలాసానికి చేరాడు.

ఆ పరమశివునితోపాటు ఆయన ఆజ్ఞాపరిపాలకులు, నానావిధ రూపములు ధరించినవారు, మహాభయంకరులు, ఆయనను పరివేష్టించిన వేలకొలది భూతసంఘాలు కూడా కైలాసానికి వెళ్ళినాయి. వాటిలో కొన్ని నల్లని కొండవలె ఉన్నాయి. మరికొన్ని తామరతూడువలె పచ్చగా ఉన్నాయి. ఇంకొన్ని సంధ్యాకాలంలోని మేఘంవలె ఎర్రగా ఉన్నాయి. కొన్ని సూర్యకాంతితో ప్రకాశిస్తున్నాయి, కొన్ని దట్టమైన కారుచీకటివలె నల్లగా ఉన్నాయి. మరికొన్ని అగ్నిశిఖలవలె ఉన్నాయి.

మహారాజా! వారిలో కొందరు పదిభుజాలు కలవారు, ఇంకొందరు ఒకే భుజం కలవారున్నారు. కొందరికి మోకాళ్ళయందు, ఇంకొందరికి తొడలయందు శిరస్సులున్నాయి. ఓ మిథిలేశ్వరా! కొంతమందికి అరచేతిలో శిరస్సులున్నాయి. ఇక వాళ్ళ రూపాలు, రంగులను, పేర్లను చెప్పటానికి సాధ్యం కాదు.

వారిలో కొందరు ఏనుగుముఖం కలవారు, ఇంకొందరు అశ్వముఖము కలవారు, గాడిద ముఖం కలవారు, పులి ముఖం కలవారు కొందరున్నారు. ఆ భూతముల రూపాలు వివిధ ఆకృతులు చెప్పటానికి దేవతలకు కూడా చాలా కాలానికైనా సాధ్యం కాదు. ఈ విధంగా అనేక విధములైన భూత సంఘములతో పరివేష్టితుడై త్రిపురాంతకుడు, దేవదేవుడు అయిన శంకరుడు వెండికొండయైన కైలాసానికి వెళ్ళాడు.

జనక మహారాజా! అప్పుడు ఆ పరమశివుని దివ్యస్వరూపం దోషరహితమైనది, సకల దోషములను పోగొట్టునది, వెండి కొండవలె తెల్లని కాంతిగలదై విరాజిల్లింది. సకల జగత్ప్రభువైన ఆ నీలకంఠుని దివ్యరూపం త్రివిక్రమావతారంలో నారాయణుని స్వరూపంవలె విరాజిల్లింది.

**హరస్య తద్రూపమపాస్త దోషం**
**సితాచలాబం శితికంఠకాయమ్,**
**వ్యరాజతాశేష గతత్ప్రభో స్తత్**
**నారాయణస్యేవ వపుస్త్రివిక్రమే ॥**

– వామనపురాణం, అ.38, శ్లో.22.

జనక మహారాజా! పరమ శాంతస్వరూపుడు, దోషరహితుడు, నిర్మలుడు, సర్వసద్గుణోపేతుడు, దేవదేవుడు, త్రిపురారి అయిన పరమేశ్వరుని సందర్శించిన సకల ప్రాణులు, సర్వభూతాలు ఆయనను సమీపించి భక్తితో శిరస్సులు వంచి ఆయనను శరణుజొచ్చి ప్రణమిల్లినాయి.

భయంకరమైన కృత్యములు చేసేవాడు, ఉమాపతి అయిన భగవంతుడైన పరమశివుని తన వీపుపై వహించి ఆ వృషభరాజం ఆకాశంలో విలాసంగా వెళ్ళింది. ఆ వృషభేంద్రముఆకాశంలో సంచరిస్తూ ఉండగా అత్యద్భుతములైన కొమ్ములు కలిగి హంస, చంద్రుడు, బంగారం, స్ఫటికములవలె తెల్లని కాంతితో వెలుగొందుతూ ఆకాశంలో మహామేఘంవలె విరాజిల్లింది. ఆ విధంగా వెళుతున్నటువంటి ఆ వృషభరాజం వెంట దేవతలు, బ్రహ్మర్షులు, అంజలిబద్ధులై త్రిపురాంతకుడు, దేవదేవుడైన శంకరుని స్తుతిస్తూ వెళ్ళారు.

అంతట జనక మహారాజు వామదేవునితో 'మునీంద్రా! త్రిశూలపాణి యైన పరమశివుడు కైలాసానికి వెడుతుండగా దేవతలు, బ్రహ్మర్షులు ఆ దేవదేవుని ఎలా స్తుతించారు? అని ప్రశ్నించాడు. జనక మహారాజు ఈ విధంగా అడుగగా మహా తపశ్శాలియైన వామదేవ మహర్షి జనకునితో మహారాజా! మీరడిగిన విషయాన్ని చెబుతాను వినండి' అని ఇలా



చెప్పసాగాడు.

గరుత్మంతునిపై అధిరోహించిన శ్రీమహావిష్ణువువలె ఆ వృషభరాజాన్ని అధిష్ఠించిన పార్వతీపతి, పినాకపాణి (పినాకమనే ధనుస్సును ధరించినవాడు) అయిన దేవదేవునికి నమస్కరిస్తున్నాము. త్రిపురాసురులను నియంత్రించిన వాడు, త్రినేత్రుడు, త్రిశూలధారి, విష్ణుభక్తుడు, విరూపాక్షుడు, విష్ణువు ప్రియం చేసేవాడు, శుభప్రదుడు అయిన శంకరునికి నమస్కారము.

దుష్టరాక్షసులను సంహరించేవాడు, కైలాసవాసి, సుఖాన్నిచ్చే వాడు, కామరూపి, జగత్ప్రభువు అయిన శంకరునికి నమస్కారము. ఉగ్రరూపుడు, మహాదేవుడు ఎదుర్కొనుటకు అశక్తుడు, పొందటానికి దుర్లభుడు, నీలకంఠుడు, విరూపాక్షుడు, సకల జగత్సంహారమూర్తి, అయిన పరమ శివునికి నమస్కారము.

కపిల వర్ణము గల విశాలమైన నేత్రములు కలవాడు, జడలనే కిరీటముగా ధరించినవాడు (జటామకుటధారి), గజచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు (చర్మాంబరధారి), వృషభధ్వజుడు అయిన పరమేశ్వరుడికి నమస్కరిస్తున్నాను. ఓ సకల లోకనాథా! నిన్ను శరణుజొచ్చిన మమ్ములను రక్షించు. కాపాడు. శంకరా! మా అందరికీ నీవే దిక్కు.

ఈ విధంగా ఆ దేవదేవుడైన శంకరుని స్తుతిస్తూ దేవతలు, బ్రహ్మర్షులు, అపర నారాయణుని వలెనున్న ఆ మహాత్ముని వెంట వెళ్ళారు. ఆ పశుపతి, జగత్పతి, ఉమాపతి, ఈ విధంగా వారందరిచేత స్తుతించబడుతూ మహాపుణ్య ప్రదమైన సర్వోత్కృష్టమైన కైలాస పర్వతాన్ని చేరాడు.

మహారాజా! ఆ దేవాధిదేవుడు కైలాసంలోని దివ్యమైన సర్వభూతములచే సేవించబడుచున్న దేవతలు, ఋషులు, మానవులు, గంధర్వులు సేవిస్తున్న మిక్కిలి దివ్యపరిమళం వెదజల్లుచున్న తన మందిరంలో ప్రవేశించాడు.

జనక మహారాజా! దేవతాశ్రేష్ఠుడు, మహాపరాక్రమవంతుడు అయిన ఆ గౌరీపతి ఆ మునులందరూ చూస్తుండగా అనుచరులందరితో పాటు అక్కడే అంతర్ధానం చెందాడు. అది మహాద్భుతంగా ఉండింది. మహారాజా! ఇంకా నీవు ఏమేమి వినగోరుచున్నావు? వాసుదేవునికి సంబంధించిన పుణ్యప్రదమైన చరిత్రలను నీకు తెలియజేస్తాను' అని వామదేవ మహర్షి జనక మహారాజుతో అన్నాడు.

అంతట జనక మహారాజు వామదేవ మహర్షితో 'ఓ తపోధనా! అంజనాద్రిలో నున్న ఆ మహర్షులందరికీ కనబడకుండా ఆ దివ్యవిమానం ఎలా అదృశ్యమైంది? అది చాలా ఆశ్చర్యకరంగా ఉంది. మహాపుణ్య ప్రదమైనది, అద్భుతమైనది, ఆశ్చర్యకరమైన ఆ వృత్తాంతాన్ని సొంతం వినాలని ఉంది. కాబట్టి దయతో తెలియజేయండి' అని అడిగాడు.

అప్పుడు వామదేవుడిలా చెప్పసాగాడు - మునులు సేవించే ఆ దివ్య విమానాన్ని దేవదేవుడు, శ్రీమహావిష్ణువు, సర్వజగత్కారకుడు అయిన వామదేవుడు తన దివ్యమైన మాయతో లీలగా అదృశ్యం చేశాడు. అలా చేస్తే మహాత్ములైన మునీంద్రులందరు ఆ పర్వత శిఖరంపై చాలకాలం ఆ దివ్యవిమాన దర్శనం కోసం సంచరిస్తారని భగవంతుడు దానిని మాయం చేశాడు. మరల ఆ పరాత్పరుడే తన దివ్యమాయ నుపసంహరించి (పోగొట్టి) ఆ మహర్షులందరికి మరల ఆ దివ్య విమానాన్ని దర్శింపజేశాడు.

అందువల్ల పూర్వం మహర్షులు ఆ దివ్యమైన, పరమోత్కృష్టమైన విమానాన్ని దర్శించ లేకపోయారు. పాపాలన్నింటిని పోగొట్టేది, సకల లోక విఖ్యాతి గాంచినది, అప్రాకృతమైనది, అసాధారణమైనది, ఆద్యంతములు లేనిది, వైకుంఠమునుండి వచ్చినది, లక్ష్మీసహితుడైన శ్రీమన్నారాయణుడు, విహరించే ఆ దివ్యవిమానాన్ని జగత్ప్రభువైన నారాయణుని దివ్యానుగ్రహం వల్ల దర్శించగలిగారు. అది చాలా అద్భుతంగా ఉండింది. నీవడిగినదంతా వివరంగా చెప్పాను. రాజా! నీవింకా ఏమి వినగోరుచున్నావో అడుగు చెబుతాను' అని వామదేవ మహర్షి అన్నాడు.

అప్పుడు జనక మహారాజు 'మునిసత్తమా! తరువాత అగస్త్యాది మహర్షులందరు అక్కడ ఏమి చేశారు? ఓ సువ్రతా!

అదంతా నాకు వివరించండి' అని అడిగాడు. అంతట వామదేవ మహర్షి జనకునితో మహారాజా! అచ్యుతుడు, నిర్మలుడు, జగత్తును ధరించినవాడు, సర్వవ్యాపి, పరబ్రహ్మ అయిన కేశవుడు అంతర్హితుడు కాగానే అగస్త్య ప్రముఖులైన మహర్షులు అక్కడ ఏమి చేశారో నీకు సవిస్తరంగా తెలియజేస్తాను, విను' అని వామదేవ మహర్షి ఈ విధంగా చెప్పనారంభించాడు -

## అగస్త్యాది మహర్షుల తపస్సు

పరమ పవిత్రమైన, పుణ్యప్రదమైన, విశాలమైన స్వామి పుష్కరిణీ తీరంలో నివసిస్తూ ఈ దివ్యాలయంలో పరబ్రహ్మయైన జనార్దనుని చింతిస్తు సకల పాపహరము, నిర్మలము, శుభప్రదమైన ఆ పుష్కరిణీ జలాల్లో ప్రతి రోజు స్నానం చేస్తు మనమంతా తపస్సుతో రాత్రింబవళ్ళు ఆ పరాత్పరుని ధ్యానిస్తూ, ఆరాధిస్తూ ఉందాము అని అనుకొని నిర్మలచిత్తులైన ఆ మహర్షులందరూ ఆ దివ్యవిమానంలో పన్నెండు సంవత్సరాలు గడిపారు.

వారంతా శ్రీమహావిష్ణువును ఆరాధించే ప్రయత్నంలో తీవ్రతపోనిష్ఠులై రాత్రింబవళ్ళు దివ్యమైన స్వామి పుష్కరిణిని సేవిస్తూ మోక్షప్రదము, శ్రేష్ఠతమము విద్వాంసులు, జ్ఞానులు, మోక్షార్థులు అయిన పూర్వీకులు అనుష్ఠించినది, ధనాన్ని అభిలషించేవారు, ఇతర కోరికలు సిద్ధించ కోరేవారు, అయిన ఇతరులందరిచేత జపించబడేది' అష్టాక్షరీ మహామంత్రాన్ని' వారంతా జపించారు.

పూర్వం బ్రహ్మదేవుడు కల్పాది యందు ప్రజలను సృష్టించగోరి ఈ సనాతనమైన మంత్రాన్ని జపించాడు. అలాగే ప్రళయకాలం ఆసన్నమైనపుడు పరమశివుడు ఈ మహామంత్రాన్నే జపించి దుర్లభమైన శక్తిని పొందుతాడు. ముల్లోకాల్లోను దీనితో సమానమైన దీనికంటె అధికమైనది కాని లేదు. సకల మంత్రములలో శుభప్రదమైన వేదమంత్రములన్నింటిలోను మానవులు ఏ మంత్రరాజమును తెలుసుకొని సమస్త పాపములనుండి విముక్తులవు తున్నారో, ఏ మంత్రోచ్చారణ వలన సకలాభీష్టాలు పొందుతున్నారో అటువంటి సర్వపాపహరము, సర్వదుఃఖ నాశకము, పరమోత్కృష్టము అయిన 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మహామంత్రాన్ని ఆ మునులందరూ పన్నెండు సంవత్సరాలపాటు రాత్రింబవళ్ళు నిరంతరం జపించారు.

పన్నెండు సంవత్సరములు పూర్తికాగానే అగస్త్య ప్రముఖులైన మహర్షులందరు జగత్ప్రభువు, శంఖచక్రధారి, చతుర్బాహువు, కిరీటధారి, శ్రీదేవి, భూదేవి సహితుడు. ఉదయిస్తున్న సూర్యునివలె ప్రకాశిస్తున్న వాడు అయిన దేవదేవుని చక్కగా ఆరాధించి ఆ దివ్యవిమానానికి వేలసార్లు ప్రదక్షిణం చేసి ఆ జగదీశ్వరునికి, సకల లోకేశ్వరుడైన శ్రీహరికి నమస్కరించి ఆ వేంకటాచలమనే పర్వతరాజము నుండి తిరిగి వెళ్ళుటకు ఉపక్రమించారు.

ఇంతలో మహాత్ములైన ఆ మునీంద్రులందరు చూస్తుండగానే వారు సేవిస్తున్న ఆ దివ్యవిమానం భగవంతుని దివ్యమాయా ప్రభావంతో అదృశ్యమైంది. అది చాలా ఆశ్చర్యంగా ఉండింది. అది చూసి ఆ మహర్షులందరూ విస్మయం చెందారు. ఆహా! ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. అద్భుతకృత్యాలు చేసే దేవదేవుడు, మహాత్ముడైన శ్రీహరి పుణ్యపురుషులచే సేవించబడే ఈ దివ్యవిమానాన్ని అదృశ్యం చేశాడు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం.

పూర్వం అదృశ్యంగా ఉన్నదాన్ని మనకు దర్శింపజేశాడు. మరల ఇప్పుడు తన మాయచేత దాన్ని అంతర్ధానం చేశాడు. ఆహా! ఏమి ఆశ్చర్యం! ఏమద్భుతం! ఆ విమానానికి అధిపతి అయిన మాధవుని సేవించిన మనకు శుభప్రదమైన ఆ విమానం కూడా దర్శనమిచ్చింది. అని ఇలా అనేక విధాలుగా ఆ దివ్యవిమానాన్ని గురించి మరల మరల చెప్పుకుంటూ ఆశ్చర్య చకిత హృదయులై ఆ మునులంతా అక్కడే ఉండిపోయారు.

**అహో బత! మహాశ్చర్యం అహో బత! మహాద్భుతమ్ ।**
**దృష్టమేతత్తదధ్యక్షే సేవితే మాధవే శుభే ॥**

– వామనపురాణం, అ.39, శ్లో.32.

వామదేవ మహర్షి ఈ విధంగా చెప్పగా జనక మహారాజు మరల ఆయన్ని 'మహాత్మా! ఆ మహాపర్వతానికి వాయువ్య దిక్కులో పూర్వం ఆ మహర్షులు భగవంతుని దర్శించారని మీరు చెప్పారు. ఆ దేవుడెవరో నాకు తెలియజేయండి' అడిగాడు. అప్పుడు వామదేవ మహర్షి జనకునితో 'మహారాజా! ఆ పర్వతానికి నారాయణాద్రి అని పేరు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే స్వయంగా దివ్యము, మహాద్భుతమూ అయిన దివ్యరూపం ధరించి ఉన్నాడు' అని చెప్పగా జనక మహారాజు పరమ ధార్మికుడైన వసువు భగవంతుడు అదృశ్యమైన తరువాత గొప్ప తపస్సు దేనికొరకు చేశాడు' అని అడిగాడు.

అప్పుడు వామదేవ మహర్షి ఇలా చెప్పసాగాడు. జనక



మహారాజా! సనాతనుడైన దేవదేవుడు అంతర్ధానం చెందిన తరువాత ఉపరిచరవసువు చేసిన తపస్సు గురించి వివరిస్తాను విను.

ఉపరిచర వసుమహారాజు ఆ దివ్యవిమానంలోనే హృషీకేశుడు, సనాతనుడు అయిన వాసుదేవుని ఆరాధిస్తూ స్వామి పుష్కరిణిలో స్నాన మాచరిస్తూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరీ మంత్రాన్నొక్క దాన్నే జపిస్తూ పరమ భక్తితో ఆ మహాత్ముడు పన్నెండు సంవత్సరాలు తపస్సు చేశాడు.

మహారాజా! మీకు మరొక వృత్తాంతాన్ని చెబుతాను. వినండి. శ్వేతద్వీప వాసులైన సిద్ధులందరూ ఆ నారాయణగిరిలో గుమికూడి శంఖచక్రాలను ధరించి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని జపిస్తూ చాలా కాలం పరమభక్తితో ఆ గోవిందుని ఆరాధిస్తూ ఆ దివ్య విమానంలో ఉన్నారు. ఆ తరువాత ఆ దేవదేవుని అనుజ్ఞతో వారంతా శ్వేతద్వీపానికి వెళ్ళారు. 'మహరాజా! మీరడిగిన వివరాలన్నీ చెప్పాను. ఇంకేమైనా చెప్పాలంటే అడగండి చెబుతాను' అని వామదేవ మహర్షి అనగా జనక మహారాజు 'ఓ మహర్షీ! భగవంతుడు అంతర్ధానం చెందిన తరువాత అక్కడకు వచ్చిన సనకాది మహాయోగులు ఏం చేశారో తెలియజేయండి' అని అడుగగా వామదేవ మహర్షి ఇలా చెప్పాడు -

సప్తమహర్షులు, దేవతలు, ధీమంతుడైన శుక్రాచార్యుడు, బృహస్పతి, సనకాదియోగులు మొదలగు మహాత్ములందరూ ఆ జనార్దనునికి నమస్కరించి ఆ పర్వతాన్ని స్తుతిస్తు తమతమ నివాసాలకు వెళ్ళారు. ఆ జగత్ప్రభువు యొక్క అనుగ్రహంతోనే శంఖ మహారాజు కూడా అప్సరోగణాలు సేవించే అద్భుతాకారం గల ఆ దివ్యవిమానాన్ని అధిరోహించి వారందరిచే స్తుతించబడుతూ దేవలోకానికి వెళ్ళాడు.

అలాగే విష్వక్సేనుడు మహాతేజశ్శాలురు మహేంద్రునితో సమానమైన పరాక్రమం కలవారు అయిన ఏడుగురు మంత్రులతో కూడి భగవదాదేశాను సారం రాక్షసులను వధించాడు అని వామదేవ మహర్షి తెలుపగా జనకుడు ఆయనతో 'బ్రహ్మర్షీ! మునీంద్రులు సేవించే ఆ విమానం అంతర్ధానం చెందిన తరువాత అగస్త్యమహాముని ఏమి చేశాడు?' అని అడిగాడు.

అంతట వామదేవ మహర్షి మరల ఇలా చెప్పసాగాడు. జనకరాజు! అగస్త్యమహర్షి మునీంద్రులందరిలో ఇలా అన్నాడు - లోకపావనమైనది, దివ్యమైన విమానాన్ని శ్రీమహావిష్ణువు మనకు ఇంతకుముందు దర్శింపజేశాడు. అది ఆ మహాపర్వతం మీద అక్కడే ఎల్లప్పుడు పూజింపబడుతూ ఉంటుంది. అది అదృశ్యమగుట వలన దానిని చూడడానికి ఎవరికీ సాధ్యం కాదు. ప్రతి యుగంలోను ఎవరైతే శ్రీహరిని తపస్సుతో ధ్యానిస్తాడో అతనికి ఆయన కృపవలన ఆ దివ్యవిమానం తప్పక దర్శనమిస్తుంది.

రాబోయే కలియుగంలో కూడా గొప్ప పుణ్యముచేత సర్వపాపహర మైనది, శ్రీమహావిష్ణువు అధిష్ఠించినది, చూచువారలకు ఆనందాన్ని కలిగించేది. దేవతలు, ఋషులు, దైత్యులు, గంధర్వులు, సిద్ధులు, దేవర్షులు సేవించునది, భక్తులైన మానవులచే సలక్షణంగా నిర్మించబడి భవిష్యత్తులో మహైశ్వర్యాన్ని కలిగిస్తూ ఆ దివ్యవిమానం విరాజిల్లుతుంది.

ఓ మునీంద్రులారా! ఇందుకేమాత్రం సందేహం లేదు. అక్షయశక్తి సంపన్నుకడైన విష్ణుభగవానుడు ఆ దివ్యవిమానంలో వేంచేసి ఉంటాడు. ఆయన మనం పూర్వం చూసిన జగత్ప్రభువైన సాక్షాత్తు శ్రీహరియే ఆ భగవానుడు శంఖచక్రాలను ధరించి చతుర్భుజుడై లక్ష్మీదేవితో పాటు ఆ దివ్య విమానంలో వేంచేసి ఉంటాడు.

ఓ మునులారా! ఈ విశ్వంలో పాపాలను పోగొట్టేది, ముల్లోకాలలో కూడా మకుటాయమానమైన ఆ దివ్యవిమానం విశ్వవిఖ్యాతిని పొందుతుంది.

**భవిష్యతి మహైశ్వర్యం మునీంద్రా నాత్ర సంశయం ।**
**తత్రైవ భగవాన్ విష్ణుః స్థాస్యత్యక్షయ శక్తిధృక్ ॥**
**విమానే తు జగన్నాథః పూర్వం దృష్టో హరిః స్వయమ్ ।**
**శంఖచక్రధరః శ్రీమాన్ చతుర్బాహు స్వరూపవాన్ ॥**
**అస్మిన్ జగతి విప్రేంద్రాః విశ్రుతం చ భవిష్యతి ।**

**విమానం తదఘౌఘఘ్నం త్రైలోక్య తికోపమమ్ ॥**

– వామనపురాణం, అ.40, శ్లో.25-27

అగస్త్యమహర్షి ఈ విధంగా మునులందరికీ తెలియచేసి జనార్దనునికి నమస్కరించి అక్కడ నుండి వెళ్ళడానికి సంకల్పించాడు. మహాతేజస్సంపన్నుడైన అగస్త్యమునీంద్రుడు భగవంతుని అనుగ్రహం వలన మిక్కిలి దుర్లభములైన వరములను పొంది మునీంద్రులతో పాటు మహేంద్రగిరికి వెళ్ళాడు. మహారాజా! ఈ విధంగా పూర్వం జరిగిన వృత్తాంతాన్ని నేను నీకు చెప్పాను. ఇది సకల లోకాలలోను విఖ్యాతి చెందింది. ఇంకా ఏమి తెలుసుకోగోరు తున్నావో అడుగు చెబుతాను అని వామదేవ మహర్షి జనక మహారాజుతో అన్నాడు.

## దేవజితుడు మొదలైన రాక్షసుల అకృత్యాలు

జనక మహారాజు వామదేవ మహర్షిని 'ఓ మునిశ్రేష్ఠా! మహా పరాక్రమ శాలియైన విష్వక్సేనుడు బలవంతులైన రాక్షస ప్రముఖులను ఎలా సంహరించాడు? ఆ మహాత్ముడైన విష్వక్సేనుని ఆశ్చర్యకరము, అద్భుతము అయిన చరిత్రను సవిస్తరంగా చెప్పండి' అని అడిగాడు. అంతట వామదేవ మహర్షి 'రాజా! అలాగే చెబుతాను శ్రద్ధతో విను' అని ఇలా చెప్పసాగాడు.

పూర్వం హిరణ్యాక్షుని వంశంలో దేవజిత్తు మృత్యుజిత్, శత్రుజిత్ అనే ముగ్గురు మహాపరాక్రమవంతులు జన్మించారు. ఆ సోదరులు ముగ్గురు మహాబలవంతులు, మహామాయావులు. గొప్ప తేజస్సు కలవారు. వారు సృష్టికర్త, లోకేశ్వరుడు అయిన బ్రహ్మదేవుని ఆరాధించి దేవతలందరిచేత కూడా చంపబడకుందునట్లు వరాన్ని పొందారు. ఆ తరువాత రాక్షసులందరి తోను మహాబలవంతులైన అనేక వందల వేల వీరులతోను కలిసి ప్రజలను హింసిస్తూ చంపుతూ భూమినంతా సంచరించారు.

వారి క్షోభవలన సముద్రాలన్నీ ఎండిపోయినాయి. వారి పరాక్రమానికి పర్వతాలే కదిలి పోయినాయి. మహారాజా! ప్రజలంతా చాలా తొందరగా నశించారు. యజ్ఞంలోని హవిర్భాగాన్ని భుజించే దేవతలకు అవి లభించలేదు. ఆ దుర్మార్గులైన రాక్షసులే యజ్ఞభాగాలను భుజించేవారు. అందువల్ల యజ్ఞాలు ఎవ్వరూ చేయలేదు. మునులు తపస్సులు చేయలేదు.



అప్పుడు సూర్యుడు ప్రకాశించలేదు. అగ్ని జ్వలించలేదు. వారు ఘోరయుద్ధంలో దేవతలను జయించారు. ఆ విధంగా అపజయంపాలైన దేవతలు దివ్యమైన నారాయణాద్రిపై వేంచేసి ఉన్న పురుషోత్తముడైన భగవంతుని శరణువేడారు.

ఈ విధంగా మదోన్మత్తులైన ఆ రాక్షసుల దారుణకృత్యాలు లోకంలో మితిమీరగా జగత్ప్రభువైన శ్రీహరి ఆజ్ఞచే మహాబలవంతుడైన విష్వక్సేనుడు మహాబలశాలురైన ఏడుగురు మంత్రులతో మహాపరాక్రమశాలురైన ఆ రాక్షసనాయకులందరినీ వధించుటకు బయలుదేరాడు. ఆయనతోపాటు అనేక వందల, వేల భూత సంఘాలు బయలుదేరినాయి. వారంతా మహా బలవంతులు, మహావీర్యవంతులు, భూభారాన్ని పోగొట్టటంలో సమర్థులు.

మహాతేజశ్శాలియైన విష్వక్సేనుడు, నిర్మలమైన ఆకాశంలో పయనిస్తూ దేవతలతో కూడిన దేవేంద్రునివలె ప్రకాశించాడు. అప్పుడు ఆకాశంలో చోటు లేకుండా పోయింది. ఈ విష్వక్సేనుని సేనతో కప్పబడి సూర్యుడు కనబడలేదు.

విష్వక్సేనుడు, అతని బలగమూ వస్తున్న విషయాన్ని విన్న మహాపరా క్రమవంతులు, బలవంతులు, కీర్తిమంతులు అయిన రాక్షసులందరూ పాతాళంలోను, సముద్రాలలోను, పర్వతాలపైన, నదులలోను, అడవులలోను నివసించే మహాభయంకరులు, మహావీరులు అయిన దానవేంద్రులందరిని పిలచి, సమావేశపరచారు. అంతకు ముందు యుద్ధం నుండి మరలిన వారిని, యుద్ధంలో ప్రీతికలవారిని కూడగట్టుకొని దేవజిత్తు మొదలైన రాక్షసులు మహాత్ముడైన విష్వక్సేనులతో యుద్ధం చేయడానికి వెళ్ళారు.

## విష్వక్సేనుడు రాక్షసుల మధ్య యుద్ధము

అంతట విష్వక్సేనుని సేనలకు, రాక్షసులసేనలకు మధ్య



మహాభయం కరము, ఘోరమైన యుద్ధం జరిగింది. ఆ ఉభయసేనలు దేవాసురుల వలె తలపడ్డాయి. వారు పరస్పరం మహాభయంకరమైన, తీవ్రమైన ఆయుధాలతో కొట్టుకొన్నారు. విష్వక్సేనుని అనుచరుల, బలవంతులైన రాక్షసేంద్రుల యుద్ధంలో దారుణాలైన అస్త్రశస్త్రాలవల్ల గ్రహాలతో నిండిన ఆకాశం తగుల బడుతున్నట్లు కనబడింది. దాన్ని చూచి ఆకాశవాసులు, గగనసంచారు లందరు ఆకాశమును వీడి భయంతో పది దిక్కులకు పారిపోయారు.

మహారాజా! అప్పుడు మహాతేజశ్శాలియైన దేవజిత్తు వదలిన భయంకరమైన, మాయతో కూడిన ఆయుధములు విష్వక్సేనుని సైనికు లందరిని మోహింపజేసినై. అంతట మహాబలవంతుడు, మహాబుద్ధి మంతుడు, సకల మాయావిద్యలు బాగా తెలిసిన వాడు. 'మేధావి' అనే విష్వక్సేనుని మంత్రి కోపావిష్టుడై అందరినీ మోహింపజేసే ఆ మాయను తన మాయాబలంతో జయించాడు. ఆ తరువాత భగవంతుడు ప్రసాదించిన, దివ్యమైన, నిర్మలమైన శత్రువులకు దుర్భేద్యమైన, అనేక రత్నములు కూర్చిన, బంగారుమయమైన ధనుస్సును తీసుకొని గొప్ప పరాక్రమం గల ఆ రాక్షస వీరులపై వాడి బాణాలను సంధించాడు. దానితో ఆ రాక్షసులు, వందలు వేలకొలది ప్రాణాలు వదలి నేలకొరిగారు.

ఆ చనిపోయిన వారందరినీ చూచి మృత్యుజిత్తనే రాక్షస నాయకుడు క్రోధావేశంతో తన మాయతో దేవసైన్యాన్నంతటిని మోహింపజేశాడు. అప్పుడు శత్రుసంహారకుడైన శత్రుఘ్నుడనే విష్వక్సేనుని సైనికుడు మిక్కిలి కోపంతో స్వచ్ఛమైన సూర్యకాంతితో మెరుస్తున్న శ్రేష్ఠమైన ఖడ్గాన్ని చేతబూని కుండలాలతో శోభిస్తున్న ఆ రాక్షసుని శిరస్సును ఖండించాడు. కాని వెంటనే అతని శిరస్సు కిరీటంతో సహా మరల మొలచింది. బలవంతుడైన శత్రుఘ్నుని భయంకర కృత్యాన్ని చూసిన శత్రుజిత్తు భయంకర రూపం దాల్చి విష్వక్సేనుని, అతని పరివారాన్ని యుద్ధంలో జయించుటకై దుర్మదంతో ఘోరమైన మహామాయను ప్రయోగించాడు. ఆ మాయాప్రభావంతో విష్వక్సేనుని సైనికులంతా నిస్తేజులైనారు.

అదిచూసి విష్వక్సేనుని మంత్రియైన 'కాలాగ్ని' అనే మహావీరుడు, మహాతేజశ్శాలి కోపావిష్టుడై ఆ భయంకరమైన, ఉగ్రమైన రాక్షసమాయను అంతమొందించాడు. అది చాలా ఆశ్చర్యంగా ఉండినది. వెంటనే కాలాగ్ని శత్రుజిత్తును వధించుటకై గొప్ప శక్త్యాయుధాన్ని వదిలాడు. అతడు ప్రయోగించిన నిరంతరం ప్రజ్వరిల్లుతున్న ఆ శక్త్యాయుధం ఆ రాక్షసుని చీల్చి చెండాడింది. అతడు నేలపై కుప్పకూలాడు. ప్రాణం పోయిన వానివలె కొంతసేపు నిశ్చేష్టుడై (చేష్టలుడిగి) మరల లేచాడు.

దేవజిత్తు, మృత్యుజిత్తు, శత్రుజిత్తు - ముగ్గురు మహాకోపోద్రిక్తులై త్రేతాగ్నులవలె వెలుగొందుచు సృష్ట్యాదిలో దేవదేవుడైన బ్రహ్మ ఇచ్చిన దివ్యమైన ధనుస్సులను చేతబట్టి భయంకరమైన పాశుపతాస్త్రాన్ని, వాయవ్యాస్త్రాన్ని, వారుణాస్త్రాన్ని, సూర్యాస్త్రాన్ని, ఆగ్నేయాస్త్రాన్ని, ఇంద్రాస్త్రాన్ని, రౌద్రాస్త్రాన్ని, జయింప వీలుగాని యామ్యాస్త్రాన్ని, మోహాన్ని కలిగించే గాంధర్వాస్త్రాన్ని, ఘోరమైన జృంభకాస్త్రాన్ని, కుబేరాస్త్రాన్ని, వారుణాస్త్రాన్ని, ఈ విధమైన దివ్యమైన మహాస్త్రాలన్నింటినీ వందల కొలది విష్వక్సేనుని సైన్యంపై ప్రయోగించాడు. శత్రుభయంకరములైన బ్రహ్మాస్త్రం మొదలైన అస్త్రజ్వాలాప్రకాశంలో ఆకాశంలో సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు, చంద్రుడు కనబడలేదు. చిలుకలు, గోరువంకలు చెట్లనుండి క్రిందపడ్డాయి. ప్రళయకాల సదృశమైన ఆ ఘోరయుద్ధంలో ప్రకృతి కల్లోలితమైంది.

**(సశేషం)**

# నవవిధ భక్తిమార్గాలు

– డా॥ కూర్మాచలం శంకరస్వామి

## దాస్య భక్తి

నవవిధభక్తి మార్గాలలో దాస్య భక్తి ఒకటి. ఈ భక్తి మార్గానికి ప్రతీక హనుమంతుడని పురాణేతిహాసాలు నిర్ధారించాయి. కోసలేంద్రుని నమ్మినబంటుగా ఆంజనేయుని దాస్యభక్తి మహోన్నతమైనది. అందుకే ఆంజనేయుడు చిరంజీవ తత్త్వాన్ని పొందగలిగాడు.

**"మనోజవం – మారుత తుల్యవేగం**
**జితేంద్రియం – బుద్ధిమతామ్ వరిష్ఠమ్**
**వాతాత్మజం – వానరయూధ ముఖ్యమ్**
**శ్రీరామదూతం – శిరసానమామి"**

సకల శాస్త్ర పారంగతుడై జ్ఞాన మార్గాన్ని అవలంబించి శ్రీరామచంద్రమూర్తి దాసానదాసుడై, భక్తిమార్గాన్ని లోకానికి చాటి చెప్పిన భక్తాగ్రేసరుడు హనుమంతుడు. సీతాన్వేషణమును సుసాధ్యము చేసి కర్మమార్గాన్ని, ధర్మమార్గాన్ని ఏకకాలంలో ఆచరించి చూపిన ఏకాంగవీరుడు ఆంజనేయుడు. శరీరానికి ప్రాణవాయువులా, శరణాగతులకు ప్రాణబంధువులా ఆదుకునే ఆపద్బాంధవుడు అంజనీ సుతుడైన హనుమంతుడే. అంతటి ఆంజనేయుడి రక్ష భయాలకు, బాధలకే కాదు, భవరోగాలకు అభయప్రదానమే. అందుకే స్వామి వివేకానంద ''హనుమంతుణ్ణి స్మరించండి. మరుక్షణం మీలోని దౌర్బల్యం, పిరికితనాలు మటుమాయమవుతాయి. బ్రహ్మచర్య పాలనలో, సంకల్పబలంలో, కార్యదక్షతలో ఆ మహనీయుడే ఆదర్శం'' అనేవారు. అంతటి మహితాత్ముడైన హనుమంతుడి ప్రముఖ ప్రస్థాన ఘట్టాలను పదకవితా పితామహుడైన అన్నమయ్య తన కీర్తనలో ఇలా వర్ణించాడు.

**"అదె చూడరయ్య పెద్ద హనుమంతుని**
**గుదిగొని దేవతలు కొనియాడేరయ్య"**
**ఉదయాస్త శైలములు ఒక జంగగా చాచె**
**అదివో ధ్రువ మండలమందె శిరసు**
**చదివె సూర్యుని వెంట మొగము త్రిప్పుచు**
**ఎదుట ఈతని మహిమలు ఏమని చెప్పేమయ్య ॥**
**దండిగా బ్రహ్మాండము దాకా తోకమీదికెత్తె**
**మెండుగా దిక్కులనిండా మేను పెంచెను**
**గండు గూడ రాకాసులు కొట్టగ చేతులు చాచె**
**అండ ఈతని ప్రతాప మరుదురుదయ్యా ॥**
**దిక్కులు పిక్కటిల్లేలా దేహ రోమములు పెంచె**
**పక్కన లోకములకు ప్రాణమై నిలిచె**
**ఇక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయె**
**మిక్కిలి ఈతని లావు మేలు మేలయ్యా ॥**

మంచి పనులు తలపెట్టినప్పుడు ముందు కాళ్ళకు బంధాలు వేసే విఘ్నాలు ఎన్నో. అందుకే మన సనాతన ధర్మం ''శ్రేయాంసి బహు విఘ్నాని'' అంటుంది. అయితే ఆ ఆటంకాలే విజేతలకు అలంకారాలై భాసిస్తాయనడానికి కేసరి నందనుడి కార్యసాధనే సాక్ష్యం. అందుకే ద్వాపరయుగంలో ఆ స్ఫూర్తితో మారుతి చిత్రాన్ని తన రథ ధ్వజంపై పెట్టుకుని జెండాపై కపిరాజు ఉన్నాడన్న ధైర్యంతో అర్జునుడు మహాభారత యుద్ధానికి సిద్ధమయ్యాడు. అంతటి వానరశ్రేష్ఠుని వైభవాన్ని ఈ వేంకటేశ్వర విశేష భక్తుడైన అన్నమయ్య ఇలా కీర్తించాడు. ''అదె చూడరయ్య పెద్ద హనుమంతుని – గుదిగొని దేవతలు కొనియాడేరయ్య'' అని కీర్తించిన దానిలో గుదిగొని అంటే అతిశయించి అని అర్థం. కేవలం భువిలోని భక్తులే కాదు, దివిలోని దేవతలు కూడా కొనియాడే, నిత్యము కొలిచే శివాంశ సంభూతుడు అంజనీసుతుడైన ఆంజనేయుడు.

సీతారాములు, కృష్ణార్జునులు, భీమాదులే కాదు నారద, తుంబురులు కూడా ఆంజనేయుని ప్రాభవాన్ని ప్రస్తుతించినట్లు మన పురాణాలు ఘోషిస్తున్నాయి. ఇలా సకల పురాణేతిహాసాలలో హనుమంతుని ప్రస్తావనను క్రోడీకరించి పదిహేడవ శతాబ్దంలో శ్రీ పుష్పగిరి తిమ్మనాచార్యులు ''సమీర కుమార విజయం'' పేరుతో పద్య కావ్యాన్ని రచించారు. కావ్యభాగంలో ఒకచోట నారదుడు, తుంబురుడు గుణంలో కాని, విద్యలో కాని నీ సాటి లోకంలో ఎవరూ లేరని హనుమంతుణ్ణి వేనోళ్ళ కీర్తిస్తూ...

ఒక గుణంబున నొక విద్య సరణి – నీకు సరియేంచవచ్చునే లోకమునను సాటి మీరితి వన్నిట మేటివౌదు మహిత రుచి చంద్ర! శ్రీహనుమత్సవీంద్ర! అని పేర్కొనబడింది. సాహస కార్యాలలోనే కాదు, సంగీత ప్రావీణ్యంలో కూడా రామబంటు



నిండిన విరాట్ స్వరూపంతో విద్యార్థిగా మార్తాండుని వైపు ముఖం తిప్పి అతని కంటే వేగంగా గమిస్తూ వేద వేదాంగాలు, సకల స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు, సమస్త విద్యలు అభ్యసించాడు. ఆ మహత్తర సన్నివేశాలన్నింటినీ మనో దృష్టితో దర్శించి ఆ సన్నివేశాన్ని సంకీర్తనలోని తొలి చరణంలో అన్నమయ్య హనుమంతుని ఉపాసనను అక్షరీకరిస్తూ ''ఉదయాస్త సమయాలు ఒక జంగగా చాచె – అదివో ధృవమండలమందె శిరసు'' అని అచ్చెరువొందాడు. ఈ రూపంలో హనుమంతుణ్ణి ఉపాసన చేసిన భక్తులకు ఆ శక్తి సామర్థ్యాలు సంప్రాప్తించడమే కాకుండా ఇహ పరాలు సిద్ధిస్తాయనడంలో ఏమాత్రం సంశయం లేదు. ఆ పరంపరలో మారుతి మహాభక్తులు హనుమంతుని స్మరణతో బుద్ధి, బలమూ, కీర్తి, ధైర్యమూ, ఆరోగ్యమూ, వివేకమూ, వాక్పటుత్వమూ ప్రాప్తిస్తాయని నిఖిల లోకవాసులూ విశ్వసిస్తారు.

తనకు తానే సాటి అని నిరూపించుకొని ఆ గాన కళలలో నారదాదులను కూడా అధిగమించాడు ఈ వానర ముఖ్యుడు. చేపట్టిన లక్ష్యం పరమ పవిత్రమైనప్పుడు మనలో ఆత్మశక్తి వేయింతలు అవుతుందనడానికి ఆ అనిలుడే నిదర్శనం. జ్ఞానపిపాసతో సాక్షాత్తు గాయత్రికి సింహాసనమైన సూర్యభగవానుడి వద్దనే విద్యను అభ్యసించాలని కపిశ్రేష్ఠుడు సంకల్పించాడు. ఆ మార్తాండుడి వేగానికి సమానంగా తన గమన వేగాన్ని పెంచి పాఠం నేర్చుకోవడానికి సిద్ధమయ్యాడు. తూర్పు, పడమర కనుమలపై పాదాలను బలంగా నిలిపి గ్రహపతియైన దినకరుడికి ప్రదక్షిణ చేసి బ్రహ్మాండమంతా

**శ్రీరాముడు లంకకు సేతువును నిర్మించే సందర్భములో హనుమంతుడు ప్రతి రోమం చేత మహాశిలలను సైతం బంధించి పూలబంతుల్లా అలవోకగా తెచ్చి వారధికి సాయపడ్డాడు. రాముడిని తన భుజపీఠంపై ఆసీనుడు గావించుకొని ముందుకు నడిచాడు.**

రామ కార్య రంగంలో దిగిన ఆంజనేయుడు లంకలో తన విశ్వరూపాన్ని కనబరుస్తూ బ్రహ్మాండం దాకా తోక మీదికెత్తాడు. దిక్కుల నిండా తన దేహాన్ని వ్యాపింపచేశాడు. రాక్షసులను మట్టి కరిపించాడు. వాయు పుత్రుడి ఇంతటి ప్రతాపం కడు అరుదైనదని అన్నమాచార్యులు వర్ణిస్తూ ''దండిగా బ్రహ్మాండము దాకా తోకను మీదికెత్తె – మెండుగా దిక్కుల నిండా మేను పెంచెను'' అని భక్తిభావంతో పొంగిపోయాడు. దీనిలోని గూఢార్థం ఏమిటంటే మన మనస్సనేది ఒక లంకా నగరమే. సీతమ్మను అపహరించినట్లు చిత్తవృత్తులనే రాక్షసులు మన ఆత్మను అపహరించి ఉంటాయి. మన మనస్సనే లంకా

నగరంలోకి ఒక్కసారి ఆంజనేయుడు ఆగమిస్తే వికృత చేష్టలతో స్వైర విహారం చేస్తున్న చిత్త వృత్తులనే రాక్షసులు పలాయనం చిత్తగించి జీవాత్మ పరమాత్మతో ఏకమై మన జీవితం కూడా రామాయణంలోని సుందరకాండ లాగా శోభిస్తుంది. రామాయణం లోని ఆ కాండ పారాయణం వెనుక అదే పరమార్థం. ఆ ఘట్టాలను చదివినా, విన్నా పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఆ అమిత పరాక్రముడు అనితర సాధ్యంగా సీతాన్వేషణ అనే మహత్కార్యాన్ని పూర్తి చేసినా అంతా రామ మహిమేనని నిజమైన కర్మయోగిలా కర్తృత్వాన్ని మాత్రం తన దైవానికే ఇచ్చేశాడు. అందుకే సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రుడి హృదయాన్ని గెలుచుకోగలిగాడు. ఆ భావనతో ఆధ్యాత్మ రామాయణంలో వ్యాసుడు ''ఎవరి పాదపద్మములను తులసీ దళాదులతో పూజిస్తే సాటిలేని పరమ పదాన్ని పొందుతారో అలాంటి శ్రీరామచంద్రుడే పుణ్యాల రాశి యైన హనుమంతుని అనుగ్రహించి స్వయంగా ఆయనకు తన ఆలింగన భాగ్యాన్ని ప్రసాదించాడు. ఆ మారుతి భాగ్యాన్ని ఎంతని కొనియాడగలమని అంటాడు అన్నమయ్య.

శ్రీరాముడు లంకకు సేతువును నిర్మించే సందర్భములో హనుమంతుడు ప్రతి రోమం చేత మహాశిలలను సైతం బంధించి పూలబంతుల్లా అలవోకగా తెచ్చి వారధికి సాయపడ్డాడు. రాముడిని తన భుజపీఠంపై ఆసీనుడు గావించుకొని ముందుకు నడిచాడు. ఆ సుమధుర ఘట్టాలను సుందరమైన పదాలతో పొదుగుతూ ''దిక్కులు పిక్కటిల్లగ దేహ రోమములు పెంచె'' దేహ రోమాలను దీర్ఘంగా పెంచుకుని అన్ని లోకాలకు ఆయన ప్రాణమై నిలిచాడు. కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడిగా కొలువు దీరిన కోదండరాముడికి బంటుగా భక్తులను కాపాడుతున్నాడు అని వర్ణించడంలో హనుమంతుని దాస్యభక్తి అనన్య సామాన్యమైనదని తెలుస్తోంది.

మరొక చోట ఓ దేవా! నీ దాస్యమొక్కటే నమ్మగలదని వివరిస్తూ...

**"నీ దాస్యమొక్కటే నిలిచి నమ్మగలది**
**శ్రీ దేవుడవు నీ చిత్తము నా భాగ్యము"**
**అనుష్ఠానములు గతియని నమ్మి చేసితినా**
**తను విధి మలమూత్రముల పోగు**
**జనులలో ఉత్తమవు జన్మమే నమ్మిన**
**వోనన కర్మమనే వో దానబడినది ॥**
**చదువులు శాస్త్రముల జాడల నమ్మితివా**
**పొదిలిన మతములు పోరాటమిది**
**మది మది నుండిన నా మనసే నమ్మితివా**
**అదియును ఇంద్రియాల కమ్ముడు పోయినది ॥**
**పుత్ర దార ధన దాస్య భూములను నమ్మితివా**
**పాత్రమగు ఋణానుబంధములవి**
**చిత్రముగా నను గావు శ్రీవేంకటేశా నీవు**
**పత్ర పుష్ప మాత్రమే నా భక్తి యెల్లా నీకు ॥**

ఈ చరాచర జగత్తులో శ్రీహరి దాస్యము ఒక్కటే నమ్మదగినది. ఆ శ్రీదేవి రమణుడైన శ్రీమన్నారాయణుడు తన దాసులను ఎన్నడూ మరువడు. ఈ మానవ శరీరము మల మూత్రములతో నిండిన పోగు. అది ఎప్పుడైనా తెగిపోవచ్చు. ఉన్న ఈ నాలుగు ఘడియలైనా ఈ దేహాన్ని ఆ దేవదేవుని అనుష్ఠానముల కొరకు ఉపయోగించాలి. చదువులు శాస్త్రములు ఎన్ని చదివినా దాస్య తత్త్వము లేకున్న అవి వ్యర్థములని, మన మనస్సును ఇంద్రియాలకు అమ్ముడు పోకుండా మనస్సు నిండా హరినామస్మరణను నింపుకొని ''ఓ దేవా! నేను దాసాన దాసుడను. సదా నీ సేవయే తప్ప అన్యమెరుగనని సునిశ్చల భక్తితో ఆ పరంధాముని సేవించిన వారికి ఆ పరమాత్మ ఎల్లవేళలా రక్షిస్తాడని, భార్య, పిల్లలు, ధన, ధాన్యాలు, భూములు మొదలగునవి అన్నీ ఋణానుబంధాలే. వాటి మాయలో పడి హరి దాస్యం మరచిపోతే సద్గతులు లభించవని, ఆ ఏడు కొండలపై వెలసిన దేవునికి పత్రములు, పుష్పములతో అర్చించినా కరుణిస్తాడని అన్నమయ్య హితవు పలికాడు.

ఆ శ్రీహరిని దాస్యభక్తితో అర్చించిన దేవతలను పాల సముద్రముపై పవళించి రక్షించావు అంటూ...

**"నీ దాసుల భంగములు నీవు జూతురా**
**ఏదని చూచేవు నీకు హెచ్చరించవలెనా? ॥**
**పాల సముద్రము మీద పవళించిన నీకు**
**బేలలై సురలు మొరవెట్టిన యట్లు**
**వేళలో మా మానవులు విన్నవించితిమి**
**ఏల నిద్దిరించెదవో మమ్మిట్టులనే రక్షించరాదా ॥"**

అంటూ వేడుకుంటూ ద్వారకా నగరంలో నుండి బిరాన ద్రౌపదిని రక్షించినట్లు నీ దాసుడనైన నన్ను రక్షించలేవా? అల వైకుంఠము నుండి పరుగు పరుగున వచ్చి గజేంద్రుణ్ణి రక్షించినట్లు ''చనువుతో మా కోరికే విన్నవించితిమి, విని



శ్రీవేంకటేశుండ వేగ రక్షించరాదా'' అని వేంకటేశుణ్ణి వేడుకున్నాడు అన్నమయ్య. అనగా మనసా, వాచా, కర్మణా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుణ్ణి దాస్యభావంతో అర్చిస్తే, శరణు వేడితే తప్పనిసరిగా ముక్తిని ప్రసాదిస్తాడు.

దాస్యభక్తితో తమ జన్మలను సార్థకము చేసుకుని తమ పేర్లను ఆ భగవంతుని పేర్లకు తగిలించి అనితర సాధ్యమైన భక్తి భావాన్ని ప్రకటించిన భక్తాగ్రేసరులు ఎందరో ఈ నేలమీద పునీతులయ్యారు. వారిలో తులసీదాసు, కబీరుదాసు, పురందరదాసు, రామదాసు మొదలగువారు తమ జీవితాంతం ఆ శ్రీరామచంద్రునికి తమ కీర్తనామృతాన్ని పంచి తరించిన భక్తాగ్రేసరులు. వీరిలో భక్తరామదాసు సేవలు అనన్య సామాన్యమైనవి. ఆచంద్ర తారార్కమైనవి. రామదాసు అసలు పేరు కంచర్ల గోపన్న. దక్షిణాది అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం సమీపంలో గల నేలకొండపల్లి వాస్తవ్యుడు. అప్పటి గోల్కొండ ప్రభువైన తానీషా పాలనలో నేలకొండపల్లి తహసీల్దారుగా పని చేస్తూ, అణువణువునా రామనామ స్మరణతో కాలం గడిపేవాడు. ఒకనాడు దమ్మక్క అనే భక్తురాలు శ్రీరామచంద్రమూర్తి విగ్రహం భద్రగిరులలో అనాదరణకు గురి అవుతోందని తెలుపగా, స్వయంగా రామభక్తుడైన గోపన్న భద్రగిరిపై కోదండరామునికి కోవెలను నిర్మించాడు. దానితో గోల్కొండ ప్రభువైన తానీషా తన అనుమతి లేకుండా ప్రజల నుండి వసూలు చేసిన సొమ్ముతో ఆలయ నిర్మాణం చేశాడనే నెపంతో గోల్కొండ కోటలోని చెరసాలలో బంధించి అనేక చిత్రహింసలకు గురి చేశాడు. చివరికి భక్త సులభుడైన, దశరథనందనుడైన శ్రీరామచంద్రమూర్తి తన సోదరుడైన లక్ష్మణునితో కలిసి, రామోజీ, లక్ష్మోజీ అనే మారు పేర్లతో వచ్చి తానీషాకు సొమ్మును చెల్లించి గోపన్నను విడిపించినట్లుగా అనేక చారిత్రక ఆధారాలున్నాయి. అంతేకాదు ఆ భగవంతుని దర్శనభాగ్యం కల్పించిన గోపన్నను గౌరవించి ఆలయాన్ని పూర్తిచేసి రాములవారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. ఆ సాంప్రదాయం భద్రాచలంలో సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు పంపించే సాంప్రదాయం కొనసాగుతోందంటే అది రామదాసు చేసిన దాస్యభక్తికి నిదర్శనమని పేర్కొనవచ్చు. ''తారకమంత్రం కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓ రామా'' అని కీర్తించి తరించిన భక్తాగ్రేసరుడు రామదాసు.

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల తొలిరోజు సాయం సమయాన జరిగే ఉత్సవం ''ధ్వజారోహణం''. ఇందులో భాగంగా శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి వారికి ఏకాంతంగా తిరుమంజన ప్రక్రియ నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. ఆ తరువాత స్వామివారిని ధ్వజస్తంభం వద్దకు చేరుస్తారు.

ఈలోగా ఆగమ శాస్త్రానుసారం కంకణధారణ, అష్టదిక్కుల్లో అర్చకుల బలినివేదన శాస్త్రోక్తంగా జరిపి ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ ఆలయం వద్దకు తీసుకొస్తారు.

మలయప్పస్వామివారి సమక్షంలో, వేదగానాల మధ్య మంగళవాద్యాలు మ్రోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజం లేదా ధ్వజపటం ఎగురవేస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, గరుడుని బొమ్మ చిత్రీకరించిన క్రొత్త వస్త్రమే ధ్వజపటం లేదా గరుడధ్వజం. కొడిత్రాడు సాయంతో దాన్ని ధ్వజస్తంభ శిఖరానికి చేరుస్తారు. గగన తలాన ఎగిరే ఈ గరుడ పతాకమే సకల దేవతలకు, అష్టదిక్పాలకులకు, భూత-ప్రేత-యక్ష-రాక్షస-గంధర్వ గణాలకు ఆహ్వానం పలుకుతుంది. ఈ ఆహ్వానం అందుకుని ఉత్సవాలకు విచ్చేసిన ఆహ్వానితులందరికీ, నైవేద్య రూపంలో బలిని సమర్పిస్తారు. ఈ సందర్భంగా ''ముద్గాన్నం'' అనబడే పెసరపులగం నివేదించబడుతుంది. దీన్ని స్వీకరిస్తే స్త్రీలు సంతానవతులవుతారని భక్తుల విశ్వాసం.

ప్రస్తుతం సాయంకాలాలలో జరుపబడే ధ్వజారోహణం నాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు బేడి ఆంజనేయస్వామి వారి సన్నిధి నుండి ఊరేగింపుగా వచ్చి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. దాంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమైనట్లే.

ఆ రాత్రి నుండే స్వామివారు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేర్వేరు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

### వాహనోత్సవ క్రమం

వాహనోత్సవ క్రమం ఈ విధంగా ఉంటుంది.

బ్రహోత్సవాల ముందురోజు – అంకురార్పణ ఘట్టం.

- మొదటిరోజు సాయంత్రం ధ్వజారోహణం, వెనువెంటనే పెద్దశేష వాహనం
- రెండవరోజు ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం హంసవాహనం
- మూడవరోజు ఉదయం సింహవాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం

- నాల్గవరోజు ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనం
- ఐదవరోజు ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడవాహనం
- ఆరవరోజు ఉదయం హనుమంతవాహనం, సాయంత్రం స్వర్ణరథం, తదుపరి గజవాహనం
- ఏడవరోజు ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం
- ఎనిమిదవరోజు ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం
- తొమ్మిదవరోజు ఉదయం పల్లకీ ఉత్సవం, మధ్యాహ్నం తిరుచ్చి ఉత్సవం, తదనంతరం 6 గంటలకు చక్రస్నానం

ఇలా మొత్తం 17 వాహనాలెక్కి ఊరేగుతుండడం వల్లనే స్వామివారు భక్తజనులకు ప్రీతిపాత్రుడయ్యాడట. అందుకే అన్నమయ్య స్వామివారిని ఈ విధంగా కీర్తించాడు.

**"ఎట్టు నేరిచితివయ్య ఇన్ని వాహనములెక్క**
**గట్టిగా నిందుకే హరి కడు మెచ్చేమయ్యా!"**

## తండ్రిగారికి తనయుడు చేసే సేవ

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఉత్సవ వాహనాల ముందుగా ''బ్రహ్మరథం'' వెళుతూ ఉంటుంది. ఎందుకంటే శ్రీవారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మదేవుని నేతృత్వంలో, ఆయన సమక్షంలో జరుగుతున్నాయని లోకాలకు తెలియపరచడం కోసం. శ్రీవారి వాహనానికి ముందు, శోభయామానంగా అలంకరించిన ఓ చిన్న రథంలో, నిరాకార నిర్గుణ స్వరూపంలో బ్రహ్మదేవుడు వేంచేసి ఉత్సవాలకు ఆధ్వర్యం వహిస్తాడు. కానీ ఒక్క రథోత్సవం నాడు మాత్రం అదృశ్యంగా స్వామివారి రథం యొక్క పగ్గాలను స్వయంగా పట్టి లాగుతూ రథోత్సవంలో పాల్గొంటాడు. అందుకే ఆ రోజు స్వామివారి వాహనం ముందు బ్రహ్మదేవుడు వేంచేసి ఉండే చిన్న రథం ఉండదు.


లోక కళ్యాణార్థమై ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసిన బ్రహ్మను గుర్తుకు తెస్తూ, శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో ''ఓం బ్రహ్మకృతోత్సవాయ శ్రీవేంకటేశాయ నమః'' అనే నామం చేర్చబడింది. దీనర్థం, ''బ్రహ్మచే ఏర్పాటు చేయబడిన మహోత్సవాలనుస్వీకరించిన శ్రీవేంకటేశ్వరునికి ప్రణామం''.

బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారు అధిరోహించే ప్రతి వాహనానికి జన్మ జన్మల ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. ప్రతి జన్మలోనూ వాటికి శ్రీవారితో విడదీయరాని అనుబంధం ఉంది. ఒక్కో వాహనం ఒక్కో సందేశాన్నిస్తుంది. ఆ పదిహేడు వాహనాల చరిత్ర, అవి మనకందించే సందేశాలు ఇప్పుడు వివరంగా చూద్దాం.

## పెద్ద శేష వాహనం

అన్నమయ్య, బ్రహ్మోత్సవాల్లో శేషవాహన శోభనీ విధంగా వర్ణించాడు.

**వీడుగదే శేషుడు శ్రీవేంకటాద్రి శేషుడు**
**వేడుక గరుడునితో బెన్నుద్దైన శేషుడు ॥**
**పట్టుపు వాహనమైన బంగారు శేషుడు**
**చుట్టు చుట్టుకొనిన మించుల శేషుడు**
**నట్టుకొన్న రెండువేల నాలుకల శేషుడు**
**నెట్టిన వారి బొగడ నెరుపరి శేషుడు ॥**



ధ్వజారోహణ జరిగిన రోజు, అంటే బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు రాత్రివేళలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామివారికి ఏడు పడగల బంగారు ''పెద్దశేషవాహనం''పై ఉత్సవం జరుగుతుంది. కృతయుగంలో అనంతునిగా, త్రేతాయుగంలో లక్ష్మణునిగా, ద్వాపరంలో బలరామునిగా, కలియుగంలో భగవద్రామానుజాచార్యులుగా అవతరించి,

శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితునిగా ప్రసిద్ధికెక్కినవాడు ఆదిశేషుడు.

శారీరక దృఢత్వం మరియు బుద్ధిబలం సమృద్ధిగా, సమపాళ్ళలో కలిగిన ఈ ఆదిశేషుడు, శ్రీమహావిష్ణువుకు సింహాసనంగా, శయ్యగా, పాదుకలుగా, వస్త్రంగా, ఛత్రంగా, ఆనుకునే దిండుగా – ఇలా సమస్త సేవలు ఎల్లవేళలా అందిస్తున్నాడు. ఆదిశేషుడు నాగజాతికి అధిపతి.

ఆదిశేషునికి సంబంధించి ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ఒకానొకప్పుడు కశ్యప ప్రజాపతి భార్యలైన వినత-కద్రువల మధ్య ఒక వివాదం ఏర్పడింది. ఇంద్రుని ఉచ్చైశ్రవం వాస్తవంగా స్వచ్ఛమైన శ్వేతవర్ణంతో ఏ విధమైన మచ్చలు లేకుండా ఉంటుంది. దాని తోకపై ఓ నల్లటి మచ్చ ఉందని, ఒకవేళ అది నిజమైతే వినత తనకు దాస్యం చేయాలని, లేకుంటే తానే వినతకు దాస్యం చేస్తానని కద్రువ, వినతతో పందెం కాసింది. అయితే ఉచ్చైశ్రవం మీద ఏ విధమైన మచ్చ లేదని తరువాత తెలుసుకున్న కద్రువ తన కుమారులైన నాగులను పిలిచి, ఎవరైనా ఒక నాగు ఉచ్చైశ్రవం తోకకు చుట్టుకుని దాన్నే నల్లటి మచ్చగా భ్రమింపచేసి తనను పందెంలో గెలిపించాలని కోరింది. అటువంటి అనైతిక కార్యం సాకారం చెయ్యడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. తనయుల ధిక్కారంతో ఆగ్రహం చెందిన కద్రువ, వారందరూ తల్లి మాట వినని కారణం చేత జనమేజయుని సర్పయాగంలో మాడి మసైపోతారని శపించింది. నాగుల్లో ఒకడైన కర్కోటకుడనే వాడు మాత్రం శాపానికి భయపడి, తల్లి మాట ననుసరించి ఉచ్చైశ్రవం తోకను చుట్టుకుని ఆమెను పందెంలో గెలిపింపచేశాడు.

మిగిలిన నాగుల్లో ఒకడైన ఆదిశేషుడు తన తల్లి, సోదరుడు చేసిన అనైతిక కార్యానికి విరక్తి చెంది బ్రహ్మను గూర్చి దీర్ఘ తపస్సు చేశాడు. అతని ధర్మనిరతి, సత్యనిష్ఠకు సంతృప్తి చెందిన బ్రహ్మదేవుడు ఆదిశేషునికి భూమిని ధరించే మహత్తర కార్యాన్ని అప్పగించాడు. ఆ ప్రకారం అపరిమిత బలసంపన్నుడైన ఆదిశేషుడు, తన పడగలపై భూ భారాన్నంతటినీ నిరంతరం మోయసాగాడు. అత్యంత కష్టతరమైన ఆ కార్యాన్ని ఎంతో శ్రద్ధగా, త్యాగనిరతితో నిర్వహిస్తున్న ఆదిశేషుణ్ణి చూసి సంతోషించిన శ్రీమహావిష్ణువు అతన్ని తన శయ్యగా, సింహాసనంగా ఎంచుకున్నాడు.

ఈ వాహనసేవను చూసి తరించిన భక్తులకు ఆదిశేషునికున్నంత సహనం, త్యాగనిరతి, ధర్మనిష్ఠ, శ్రీనివాసుని యెడల అచంచలమైన భక్తి కలుగుతాయని ప్రతీతి.

ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామిని పుష్పమాలాలంకృతుణ్ణి చేసి, వాహనమండపంలో ఉన్న ఆదిశేషునిపై అధిరోహింపచేసి, మాడవీధుల్లో జరిపించే ఊరేగింపును బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైనదిగా పరిగణిస్తారు. మొదట్లో తొమ్మిదవ రోజు ఉదయం ఊరేగింపునకు ఉపయోగించే ఈ వాహనం, కారణాంతరాల వల్ల ఇప్పుడు మొదట్లోనే వినియోగించబడుతోంది.

శేషవాహనం దాస్యభక్తికి నిదర్శనం. ఆ భక్తితో అంకిత భావం పెంపొంది, పశుత్వం నశించి, క్రమంగా మానవత్వం, అందుండి దైవత్వం, దానిద్వారా పరమపదం సిద్ధిస్తాయని నమ్మిక.

మామూలు రోజుల్లో ఈ వాహనాన్ని సంపంగి ప్రదక్షిణ మార్గంలోని రంగమండపంలో మనం దర్శించుకోవచ్చు.

## చిన్న శేషవాహనం

రెండవరోజు ఉదయం మలయప్పస్వామివారు ఒంటరిగా చిన్నశేషవాహనంపై, మురళీకృష్ణునిగా లేదా నవనీతగోపాలునిగా దర్శనమిస్తారు.

మునుపటి రోజున స్వామివారు అధిరోహించిన ''పెద్దశేషవాహనం'' విష్ణుమూర్తి సింహాసనమైన ఆదిశేషుని ప్రతిరూపం కాగా, ఈ రోజు ఉదయం శ్రీవారు



ఊరేగే ''చిన్నశేషవాహనం'' క్షీరసాగర మథనంలో మంథరపర్వతానికి కవ్వపు త్రాడుగా వ్యవహరించిన ''వాసుకి'' యొక్క ప్రతిరూపం.

ఆదిశేషుడు ''నాగజాతి''కి రాజైతే, వాసుకి ''సర్పజాతి''కి పాలకుడు. ఆదిశేషునికి నిత్య సాన్నిధ్యభాగం కల్గించిన విష్ణువు సాగర మథన కార్యానికి తోడ్పడ్డ వాసుకికి మాత్రం ''చిన్నశేషవాహనం''గా మారి బ్రహ్మోత్సవాల్లో తన సేవ చేసుకునే అదృష్టాన్ని కల్పించాడు.

శేషుడు, వాసుకి ఇద్దరూ చైతన్యశక్తికి సంకేతాలు. కావున ఈ రెండు వాహనాల దర్శనంతో, భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరుస్తుంది. యోగశాస్త్రంలో సర్పాన్ని కుండలినీ శక్తికి సంకేతంగా భావిస్తారు. కావున ఈ వాహన సేవలను దర్శించిన భక్తులకు కుండలినీ యోగఫలం సిద్ధించి, మానవుడు మాధవునికి నిజమైన సేవకుడయ్యే అవకాశం లభిస్తుంది.

తరిగొండ వెంగమాంబ ఈ రెండు వాహనాలను ఈ విధంగా వర్ణించింది.

**అలఘు శేషవాహనోత్సవంబును**
**మరునాడుదయంబు నందు**
**లఘుశేషవాహనోత్సవంబును**

## హంస వాహనం

**హంస వాహనముపైన హరి నేడు చూడరు**
**వీణాపాణియై వేయి రాగాలతో**
**అందరి గుండెలోను అమృతం కురియగా**

రెండవరోజు సాయంత్రం, శ్రీవారు వీణాపాణి, ధవళవస్త్రధారి, చల్లని వెన్నెల లొలికించే తెల్లని పుష్పాలు ధరించిన చదువుల తల్లి రూపంలో, బంగారు హంసవాహనారూఢుడై మాడవీధులలో విహరిస్తారు. పురాణాల ప్రకారం – ఒకప్పుడు లోకాలన్నీ అజ్ఞాన తిమిరంలో మునిగిపోయి ఉండగా, దేవతల కోర్కెపై, విష్ణువు హంసవాహనమెక్కి హయగ్రీవునిగా లోకాలకేతెంచి తిమిరాన్ని పారద్రోలాడు. అలాగే బ్రహ్మోత్సవాలలో స్వామివారు హంసవాహనమెక్కి ''అన్ని కళలకూ, సర్వ విజ్ఞానానికి కారణభూతుణ్ణి నేనే, అన్నీ నా ద్వారానే సిద్ధిస్తాయి'' అన్న సందేశమిస్తారు.

**జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే**



అన్న శ్లోకంతో మొదలయ్యే ''హయగ్రీవ స్తోత్రం'' సారాంశమిదే.

చదువులతల్లి సరస్వతి రూపంలో ఉన్న స్వామివారిని దర్శించుకుంటే, అజ్ఞానతిమిరం తొలగిపోకుండా ఉంటుందా? సృష్టికర్తయైనట్టి బ్రహ్మదేవుని వాహనమైన హంసకు, వేరెవ్వరికీ లేనటువంటి ఓ అద్భుతమైన విచక్షణా శక్తి ఉంది.

**గుంభనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ జనిత మహాయశో విభవసారము**

అనగా ఓ పాత్రలో క్షీర నీర మిశ్రమాన్ని ఉంచితే, హంస పాలను మాత్రం గ్రహించి, నీటిని త్యజిస్తుంది. అలాగే సృష్టిలో విచక్షణాజ్ఞానం కలిగి ఉన్న ఏకైక జీవి మానవుడు, నిరంతర సాధన చేస్తూ, చరాచర విశ్వంలో సమ్మిళితమై ఉన్నటువంటి బ్రహ్మతత్వాన్ని ఆకళింపు చేసుకుని, ఐహిక వాంఛలన్నీ పరిత్యజించాలి. నిస్సారమైన ప్రాపంచిక పాశాలలో నిగూఢంగా నిక్షిప్తంగా ఉన్న ఆత్మసాక్షాత్కారాన్ని ఆవిష్కరింప చేసుకోవాలి. హంసవాహనా రూఢుడైన శ్రీవారు అందించే సందేశమిదే.

## సింహ వాహనం

బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు ఉదయం మలయప్పస్వామి ఒక్కరే సింహవాహనంపై ఊరేగుతారు.

''మృగాణాం చ మృగేంద్రో అహం'' అంటూ భాగవతంలో శ్రీకృష్ణభగవానుడు తనను తాను ''మృగాల్లో సింహరాజు''గా అభివర్ణించుకున్నాడు. అపరిమితమైన ''సింహబల'' మంత భక్తి గలవారిని స్వామి అనుగ్రహిస్తారనే సందేశం ఈ వాహనసేవ ద్వారా పంపబడుతుంది.

సింహానికీ – శ్రీవారికీ అనేక సారూప్యాలు, అత్యంత



సాన్నిహిత్యం ఉన్నాయి –

- శ్రీవారి నిలయమైన ఆనందనిలయ విమానంపై నలుదిక్కులా, సింహప్రతిమలు వేంచేసి ఉంటాయి.
- విష్ణుసహస్రనామ పారాయణంలో సింహనామం రెండు పర్యాయాలు వస్తుంది (శ్లోకాల సంఖ్య 22 మరియు 52)
- దశావతారాల్లో నృసింహావతారం నాలుగవది. అలాగే, బ్రహ్మోత్సవాల్లో కూడ సింహవాహనం నాల్గవది కావడం విశేషం.

యోగశాస్త్రంలో సింహం సహనశక్తికీ, గమనశక్తికీ ప్రతీకగా చెప్పబడుతుంది. సింహాన్ని చూసి ఇతర జంతువులు భయపడినట్లు, సింహాసనాన్ని అధిష్ఠించిన శ్రీవారిని చూసి సమస్త మానవులు ''తప్పు చేసినచో భగవంతుని దండన తప్పదు'' అనే భయం కలిగి విచక్షణా జ్ఞానంతో వ్యవహరిస్తారు. యోగ నరసింహస్వామిగా సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు దుష్టజనసంహార, భక్తజనసంరక్షణ సంకేతాలు జనియింపచేస్తారు.

హిరణ్యకశిపుని చీల్చి చెండాడిన నరసింహావతారాన్ని ఆళ్వార్లు ఎంతో భక్తితో పూజించారు. ఈ సింహం ప్రహ్లాదుని ప్రార్థనకు పూర్వం అదృశ్యశక్తిగా రాక్షసభవన స్తంభంలో దాగి ఉంది. శ్రీహరి పరమభక్తుడైన ప్రహ్లాదుడు ''హరి ఎందెందు వెదకిన అందందే గలడు'' అంటూ తన తండ్రికి ధైర్యంగా సమాధానమిచ్చాడు. ఆ బాలభక్తుని వాక్కు సాకారం చేయడం కోసం, సకల చరాచర సృష్టిలో నిక్షిప్తమై ఉన్నటువంటి శ్రీహరి స్తంభాన్ని చీల్చుకుని, నారసింహుని రూపంలో ప్రత్యక్షమై, దుష్టుడైన హిరణ్యకశిపుణ్ణి అంతమొందిచాడు. కృతయుగంలో ఆ నాస్తికస్తంభాన్ని ఛేదించి వెలికి వచ్చి దుష్టసంహారం గావించినట్లు; ఈ కలియుగంలో నాస్తికత్వాన్ని పటాపంచలు చేసి మానవుల హృదయాలలో భక్తిభావాన్ని పెంపొందించి వారిని సన్మార్గంలో నడిపించడానికై స్వామివారు సింహవాహనంపై ఊరేగుతారు.

**జయజయ నృసింహ సర్వేశ**
**భయహర వీర ప్రహ్లాద వరద !!**
**మిహిర శశినయన మృగన రవేష**
**బహిరంతస్థల పరిపూర్ణ అహినాయక సింహాసన రాజిత**
**బహుళ గుణగణ ప్రహ్లాద వరద !!**

ప్రతి సంవత్సరం వాహనాలు స్థిరంగా ఉంటాయి కానీ, అందులో మలయప్పస్వామి వేషధారణలో మాత్రం స్వల్పమార్పులు ఉంటాయి. ఉదాహరణకు, ఒక సంవత్సరం నవనీత గోపాలుడైతే, మరో సంవత్సరం కాళియమర్దనుడవుతాడు.

## ముత్యపు పందిరి వాహనం

మూడవరోజు రాత్రి ముత్యపుపందిరి వాహనంపై శ్రీదేవి-భూదేవులతో కూడిన మలయప్పస్వామివారు తిరుమల మాడవీధుల్లో విహరిస్తారు. వాహనాన్ని నిండుగా ముత్యాల సరాలతో అలంకరించి, వాటి చివర్ల పట్టుకుచ్చులు అమర్చి, కళ్యాణశోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతారు. వాహనానికి నలువైపులా కట్టబడి యున్న సరిగంచు పట్టుపరదాలకు, శ్వేతవర్ణంతో తళుకులీనుతున్న ముత్యాలను ఒద్దికగా పేర్చి ఫల పుష్ప, జంతు, వస్తు ఆకృతులను సృష్టిస్తారు.

చల్లని ముత్యాల పందిరిలో వేంచేసి యున్న శ్రీనివాసుని దర్శనం, భక్తుల మదిలోని తాపత్రయాలను తొలగించి, జీవితాలకు అలౌకిక ప్రశాంతత చేకూర్చుతుంది. స్వచ్ఛతకు, నిర్మలత్వానికి, అసమాన సౌందర్యానికి ప్రతీక అయిన ముత్యం, స్వాతి కార్తెలో పడిన వర్షపు చినుకు ద్వారా సముద్రగర్భంలోని ముత్యపు చిప్పలో ఉద్భవిస్తుంది. సాగరం ప్రసాదించే మేలి వస్తువుల్లో ''ముత్యం'' ముఖ్యమైనది.

అంతటి ప్రాశస్త్యం ఉన్న ముత్యాలకు – శ్రీమహావిష్ణువుకు ఉన్న అనుబంధం యుగయుగాలుగా కొనసాగుతోంది.

- ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు ''నాసాగ్రే నవమౌక్తికం'' – అనగా ''ముక్కు కొనలో నూతన ముత్యాన్ని ధరించినవాడు''గా కీర్తింపబడ్డాడు.
- కలియుగంలో శ్రీనివాసుడు – ''మౌక్తిక స్రగ్వి'' అంటే, ''ముత్యాలహారాన్ని ధరించినవాడు'' అని ప్రస్తుతింపబడ్డాడు.
- స్వామివారు అనునిత్యం ధరించే అనేకానేక ఆభరణాలలో మేలుజాతి ముత్యాలు పొదగబడి ఉంటాయి.
- పద్మపురాణంలో ముత్యాలతో చేయబడిన ఓ ఛత్రం విష్ణుమూర్తికి నీడనిచ్చినట్లుగా చెప్పబడింది.
- కృతయుగంలో శ్రీమహావిష్ణువు ''ముక్తాత ప్రతితానంత మండలుడు'' అంటే ''ముత్యాల గొడుగుల రూపంలో ఉన్న ఆదిశేషుని యొక్క వేయి పడగల క్రింద విశ్రాంతి తీసుకుంటున్నట్లు'' వర్ణించబడింది.
- నేడు కలియుగంలో ఈ ముత్యాలపందిరి స్వామివారికి నీడనిస్తూ, చల్లదనం చేకూరుస్తుంది.

శరన్నవరాత్రులలో నిర్మలాకాశంలో మెరుస్తున్న నక్షత్రాలతో పోటీపడుతూ, విద్యుద్దీపాల కాంతిలో ప్రకాశిస్తున్న ముత్యాల పందిరి వాహనం రస రమ్య భరితంగా ఉంటుంది. శ్రీనివాసుని భక్తిలో ఓలలాడిన భక్తులందరూ పులుకడిగిన ముత్యంలా స్వచ్ఛమైన మనస్సుతో ఆవిష్కరింపబడతారు.

## కల్పవృక్ష వాహనం

బ్రహ్మోత్సవాలలో నాల్గవ రోజు ఉదయం శ్రీదేవి-భూదేవి సమేతుడైన మలయప్పస్వామి, కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులను అలరిస్తారు. కాండము, శాఖలు, పత్రాలు, పుష్పాలు, లతలు ఇలా వృక్షభాగాలన్నింటినీ మేలిమి బంగారంతో, కళాకౌశలం ఉట్టిపడేలా, సృజనాత్మకంగా తీర్చి దిద్దుతారు. ప్రకృతికి శోభనిచ్చేది వృక్షం. సృష్టిలోని వృక్షాలన్నింటికీ మేటి కల్పవృక్షం. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన ఈ కల్పవృక్షం మనోవాంఛా ఫలాలను సిద్ధిస్తుంది.

**ఎల్ల ఋతువులందు నెలరారి పరువమై కోరివచ్చువారి కోర్కెలు నీనెడు వేల్పుమాను పాలివెల్లి బుట్టె** -అంటే దేవతలు, రాక్షసులు క్షీరసముద్రాన్ని అమృతం కోసం చిలుకుతున్నప్పుడు అన్ని ఋతువులలోనూ పచ్చగా ఉండి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షం ఉద్భవించింది.

అది ఐహిక సుఖాలను మాత్రమే అందిస్తుంది. కానీ ఆ



వాహనాన్ని అధివేష్ఠించి ఉన్న శ్రీనివాసుడు ఐహిక, ఆముష్మిక సుఖాలను కూడా ప్రసాదిస్తాడు.

అన్నమయ్య రామావాతారుడైన శ్రీమహావిష్ణువును కోర్కెలు తీర్చే కల్పవృక్షము, కామధేనువు, చింతామణిగా ఇలా వర్ణించాడు.

**గౌతము భార్యాపాలిటి కామధేను వితడు,**
**ధాతల కౌశికుపాలి కల్పవృక్షము.**
**సీతాదేవి పాలిటి చింతామణి ఇతడు**
**ఈతడు దాసులపాలి ఇహపరదైవము ॥**

కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు సత్యభామ కోర్కె తీర్చడం కోసం పారిజాతవృక్షాన్ని దివి నుంచి భువికి తెచ్చి ప్రతిష్ఠించాడు. ఇప్పుడు కలియుగంలో ఆశ్రిత భక్తజన వాంఛితాలను యీడేర్చడం కోసం శ్రీవారు కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్నారు.

వృక్షం అనంతమైన జీవజాలానికి ఆలవాలం. చెట్టు తొర్రలు, బొరియలు, వ్రేళ్ళు, శాఖలు సమస్తం పక్షులకు, చీమలకు, పాములకు ఇంకా అనేక రకాల క్రిమికీటకాలకు ఆవాసం కల్పిస్తాయి. చెట్లు మానవజాతికి ఫల పుష్పాదులను ప్రసాదించడమే గాకుండా, జీవం కోల్పోయిన తర్వాత కూడా కలపనిచ్చి శాశ్వత నివాసం కల్పించడానికి తోడ్పడతాయి. అనేక ఔషధాలు చెట్ల నుండి తయారవుతాయి. అదేవిధంగా, కల్పవృక్ష వాహనంలో కొలువైన శ్రీవారిని దర్శించుకుంటే ''పండిన పెరటి కల్పము వాస్తవ్యుండు'' అన్నట్లు స్వామివారు కల్పవృక్షంలా భక్తుల కోర్కెలను కాదనకుండా తీర్చుతారు.

**(సశేషం)**




# యమునా నదీ పుష్కరాలు

– చిల్లర సీతారామారావు

గంగానదికి రెండవ అతిపెద్ద ఉపనది యమునానది. యమునానదికి 2026 వ సంవత్సరం జూన్ మాసము రెండవ తేదీ నుండి పదమూడవ తేదీ వరకు పుష్కరాలు జరుగుతాయి.

మేషరాశి మొదలుకొని పన్నెండు రాశుల యందు వరుసగా బృహస్పతి (గురువు) సంచరించు సమయమే నదులకు పుష్కర కాలము. పుష్కరుడు నదులలో అంతర్వాహినిగా ఉండటమును పుష్కరము అని పిలుస్తారు. బృహస్పతి ఆయా నదుల జన్మరాశిలో ఉన్నప్పుడు సకల భూ తీర్థాలు ఆయా నదుల లోనికి ప్రవేశిస్తాయి. ఆ సమయంలోనే పుష్కరుడు వస్తాడు కనుక ఒక్కొక్క నదికి పుష్కరాలు రావడానికి పన్నెండు సంవత్సరముల సమయం పడుతుంది. పుష్కరము అను శబ్దమునకు జలము, పర్వము, పన్నెండు సంవత్సరాల సమయము అను అర్థాలు ఉన్నాయి. 'పోషయ తీతి పుష్కరః' అనగా అందరినీ పోషించేది పుష్కరము అని అర్థము. పుష్కర సమయాలలో నదీ జలాలు అధిక దైవిక తేజస్సును పొంది ఉంటాయి. కనుక పుష్కర సమయాలలో స్నాన, దాన, జప, అర్చన, ధ్యాన, హోమ, తర్పణాది అనుష్ఠానాలను, పితృ పిండ ప్రదానాలను చేయవలెనని మహర్షులు బోధించారు. నిత్యము చేసే స్నానము, దానము, దేవతార్చన మున్నగునవి పుష్కరాల సమయంలో చేస్తే వంద రెట్ల ఫలితము లభిస్తుంది.

పుష్కరాలు ఏర్పడటానికి సంబంధించి ఒక కథ ఉంది. పూర్వం తుందిలుడు అను విప్రుడు పరమశివుని గురించి తపమాచరించి ఆయన అనుగ్రహముతో శివుని అష్టమూర్తులలో ఒకటైన జలస్వరూపమును వరంగా పొందాడు. ఫలితంగా తుందిలునకు పుష్కరుడు అను పేరు వచ్చింది. పుష్కరుడి

నుండి మూడున్నర కోట్ల తీర్థాలు ఉద్భవించాయి. ఆ తీర్థములకు రాజై పుష్కరుడు ప్రఖ్యాతి చెందాడు. సృష్టి చేయ సంకల్పించిన బ్రహ్మ జలమే సృష్టికి మూలం కనుక తనకు తోడ్పడవలసిందిగా పుష్కరుడిని కోరాడు. పుష్కరుడు అంగీకరించాడు. జలరూపములో ఉన్న పుష్కరుడిని తన కమండలములో పెట్టుకుని బ్రహ్మ సృష్టి గావించసాగాడు. దేవతల గురువు బృహస్పతి. బ్రహ్మ గురించి తపము గావించిన బృహస్పతి తీర్థరాజైన పుష్కరుడు తన అధీనంలో ఉండేలా వరమును అడిగాడు. బ్రహ్మ తథాస్తు అని పలికాడు. కాని పుష్కరుడు బ్రహ్మను వదిలి వెళ్ళటానికి ఇష్టపడలేదు. తుదకు ఎలాగో ఒక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం బృహస్పతి కొత్తగా ఒక రాశి లోనికి ప్రవేశించినప్పుడు మొదటి పన్నెండు రోజులు, చివరి పన్నెండు రోజులు, మిగతా రోజులలో 4 ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి అధీనంలో ఉండాలి. ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుడిని అనుసరించాలి. ఈవిధంగా నిరంతరం బ్రహ్మతోనూ, బృహస్పతితోనూ పుష్కరుడు ఉండే వీలు కలుగుతుంది. దేవతలందరి సాన్నిధ్యం నదులలో ఉండటం వలన అప్పుడు ఆచరించిన స్నాన తర్పణాది కర్మలవల్ల అంతులేని పుణ్యసంపద కలుగుతుంది. ఈ విధంగా పుష్కరాలు ఏర్పడ్డాయి.

**శ్లో ॥ "జన్మ ప్రభృతి యత్పాపం స్త్రియావా పురుషేణవా**
**పుష్కరే స్నాతమాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి"**

స్త్రీ గాని పురుషుడు గాని వారు పుట్టినప్పటి నుంచి చేసిన సమస్త పాపములు పుష్కర సమయంలో స్నానమాచరిస్తే తొలగిపోతాయి.

సమస్త ప్రాణికోటి మనుగడకు ఆధారము జలము. జలము లేకుండా ఏ ప్రాణి జీవించలేదు. అందువలననే జలమును పంచభూతములలో శ్రేష్ఠమైనదిగా చెప్పబడుతున్నది. జలము యొక్క స్థానము అంతరిక్షము. జలమునకు అధిపతి వరుణుడు. ఆయన అనుగ్రహముతో జలము అంతరిక్షము నుండి క్రిందికి దిగుతున్నప్పుడు 'అహి' అను మేఘమునకు తగిలి వర్షముగా మారిపోతుంది. ఆ వర్షము పలు ప్రాంతములందు పడి, చిన్న కాలువలుగా పారుతూ నదిగా మారిపోతుంది. నదులు ప్రవహించు తరుణములో అరణ్యములు మున్నగు వాటిని దాటుకుంటూ ప్రవహిస్తూ ఉంటాయి. ప్రవహించే సమయంలో రకరకములైన ఓషధులు వాటితో కలిసి పయనిస్తూ ఉంటాయి. ఆ కారణము చేత నదులలో స్నానము చేసినట్లయితే సమస్త రోగములు నశించిపోవడానికి అవకాశమున్నది.

అన్ని ఋతువులలోనూ ఎండిపోకుండా ప్రవహించు నదులను జీవనదులు అని అంటారు. భారతదేశంలో 12 జీవనదులు ఉన్నాయి. గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, ప్రణీత అనునవి జీవనదులు. బృహస్పతి పన్నెండు రాశులలో ప్రవేశించినప్పుడే పుష్కరాలు వస్తాయి.

**శ్లో ॥ "మేషే గంగా వృషే రేవా మిథునేచ సరస్వతీ**
**కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా**
**కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ఘటకే స్మృతా**
**వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కరవాహినీ**
**మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా**
**మీనే ప్రణీతాచ నదీ గురోస్సంక్రమణే స్మృతా**
**పుష్కరాభ్యో మునీనాంహి ప్రదేశోఽత్ర బుద్ధై స్మృతః"**

బృహస్పతి (గురువు) పుష్కరునితో కలిసి మేషరాశి యందు ప్రవేశించినప్పుడు గంగకు, వృషభరాశిలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకములో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో తామ్రపర్ణికి (భీమరథి), ధనుస్సులో వాహిని (బ్రహ్మపుత్ర)కి, మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతానదికి పుష్కరాలు వస్తాయి. పుష్కరాలు ఎప్పుడు వస్తాయా, ఎప్పుడు స్నానములు చేస్తామా అని ఎదురు చూస్తుంటారు.

జూన్ మాసంలో 2వ తేదీ నుండి పుష్కరాలు జరుపుకోబోతున్న యమునానది గంగానదికి రెండవ అతిపెద్ద ఉపనది. ఈ నది గంగానదికి ఎడమవైపున పుట్టి, గంగానదిని కుడివైపునుండి కలిసే ఏకైక ఉపనది యమునానది. 1370 కిలోమీటర్ల పొడవు ఉన్న యమునానది గంగానదితో సమానంగా పూజలందుకుంటున్నది. యమునా నదికి పలు పర్యాయ నామములు ఉన్నాయి. సూర్యుని కుమార్తె అవడము వలన సూర్య తనయ అని, యముని సోదరి అవడము వలన యమి అని, కళింది పర్వత శిఖరము నందు జన్మించినందువలన కాళింది యని పిలువబడుతున్నది. ఇవియే గాక 'శమన స్వస్రా' అని మరొక పేరు కూడా ఉంది.

సూర్యుని కూతురు అయిన యమున నదిగా మారడానికి సంబంధించి ఒక కథ ఉంది. సూర్యుని భార్య సంజ్ఞాదేవి. ఆమె




ఒకసారి సూర్యభగవానుని తేజస్సును చూడలేక కనులు మూసుకున్నది. ఆగ్రహించిన సూర్యుడు ''నీకు నిఖిల జనైక సంయముడగు తనయుడు జన్మిస్తాడు'' అని పలికాడు. ఫలితంగా సంజ్ఞాదేవికి యముడు జన్మించాడు. కొంతకాలము గడిచిపోయింది. ఒకనాడు సంజ్ఞాదేవి సూర్యుడిని చంచల దృష్టితో చూచింది. ఆగ్రహించిన సూర్యుడు ''నీకు విలోలమైన కూతురు కలుగుతుంది'' అని పలికాడు. ఫలితముగా చంచలమైన యమున జన్మించిది. సూర్యుడు యమునతో – నీవు భరత వర్షమున నదీ రూపము ధరించి, స్నానమొనర్చువారి సమస్త పాపములను పోగొట్టుచు కీర్తిని పొందుము అని పలికాడు. సూర్యుని వచనానుసారం యమున నదిగా మారిపోయింది.

యమునానది ఉత్తరాఖండ్ రాష్ట్రములోని ఉత్తర కాశీ జిల్లాలో హిమాలయ పర్వత శ్రేణులలోని యమునోత్రి గ్లేసియర్ (హిమానీ నదం) వద్ద, కళింది పర్వత (బందర్ పూంఛ్ శిఖరం) సమీపంలో జన్మించింది. ఇది సముద్ర మట్టానికి సుమారు 6,387 మీటర్ల ఎత్తులో ఉంటుంది. హిమాలయాలలో జన్మించిన యమునానది ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ, అలహాబాద్ వద్ద గంగానదిలో కలుస్తుంది. టాన్స్, చంబల్, సింధ్, బెట్వా, కెన్ అనునవి యమునానదికి ఉపనదులు. ఈ నదులు హిమాలయాలు, మధ్యభారత దేశం నుండి ఉద్భవించి యమునానదిలో కలుస్తాయి.

యమునానది పుష్కరాలు ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలోని యమునానది ఒడ్డున జరుగుతాయి. ముఖ్యంగా మధుర, బృందావన్, ప్రయాగ మొదలైన చోట్ల భక్తులు స్నానమాచరిస్తుంటారు. మధురలో యమునానదికి అనేక స్నాన ఘట్టాలు ఉన్నాయి. వాటిలో విశ్రామ్ ఘాట్, ధృవ ఘాట్, కంస ఘాతికా ఘాట్ ముఖ్యమైనవి. మధురకు సమీపములో బృందావనము ఉన్నది. బృందావనములో 32 స్నాన ఘట్టాలున్నాయి. ఈ తీర్థాలలో పుష్కరస్నానము పుణ్యప్రదము. త్రివేణీ సంగమంలో 60 కోట్ల పుణ్యతీర్థాలు కలిసి ఉండటం చేత, పుష్కరసమయంలో త్రివేణీ సంగమంలో స్నానమాచరిస్తే విశేషమైన పుణ్యసంపద ప్రాప్తిస్తుందని మహాభారతం వచిస్తోంది.

యమునానది మహిమాన్వితమైనది. మార్కండేయ మహర్షి యమునానది మహిమను వర్ణిస్తూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

**శ్లో॥ "తపనస్య సుతాదేవీ త్రిషులోకేషు విశ్రుతా**
**సమాగతా మహాభాగా యమునాయత్ర నిమ్నగా**
**యే నైవనిః సృతా గంగాతే నైవ యమునా గతా**
**యోజనాం సహస్త్రేషు కీర్తనాత్ పాపనాశినీ**
**తత్ర స్నాత్వాచ పీత్వాచ యమునాయాం యుధిష్ఠిర**
**సర్వపాప వినిర్ముక్త పునాత్యా సప్తమం కులం"**

యుధిష్ఠిరా! ముల్లోకములందు ప్రసిద్ధికెక్కిన సూర్యుని పుత్రిక యమునా నది, గంగానది ప్రవహిస్తున్న మార్గములోనే ప్రవహిస్తున్నది. వేల యోజనాల దూరములో ఉన్నప్పటికీ, యమునానది పేరును స్మరించుకోగానే సమస్త పాపములు నశించిపోతాయి. యమునానదిలో స్నానమాచరించి, యమునా జలమును త్రాగితే సమస్త పాపముల నుండి విముక్తులవడమే కాకుండా ఏడు తరాల వారిని పునీతులను గావిస్తారు.

యమునానది జన్మస్థానమైన యమునోత్రికి వెళ్ళే వాహనాలు, యమునోత్రికి ఆరు కిలోమీటర్ల దూరములో ఉన్న జానకీచట్టి వరకు మాత్రమే వెళతాయి. అక్కడి నుండి

ఆరు కిలోమీటర్ల దూరములో ఉన్న యమునోత్రికి కాలినడకన ద్వారా గాని, గుర్రాల మీద గాని, బుట్టలో కూర్చుని గాని వెళ్ళవలసి ఉంటుంది. ఇక్కడ నదిలో స్నానమాచరించేందుకు అవకాశము లేదు. ఆలయమునకు దిగువ ప్రాంతమున ఉష్ణ జలధారల ఊటలున్నాయి. ఇక్కడి ఉష్ణధారలు అతి ఉష్ణంగా ఉంటాయి. ఈ కుండాలలో భక్తులు స్నానమాచరిస్తారు. బియ్యం మూటకట్టి ఉష్ణజలధారలో ఉంచితే పచనమౌతుంది. దానినే ప్రసాదంగా స్వీకరిస్తారు.

హైందవ సంస్కృతి, సాహిత్యాలలో యమునా నదికి విశిష్టమైన స్థానమున్నది. శ్రీకృష్ణభగవానుని లీలా విన్యాసాలు, బాల్యక్రీడలతో ముడిపడిన పుణ్యనది యమునానది. వసుదేవుడు చెరసాలలో జన్మించిన శిశువును యశోదమ్మ దగ్గరకు తీసుకువెళ్ళే సందర్భములో యమునానది చీలిపోయి దారి ఇచ్చింది. శ్రీకృష్ణుడు తన స్నేహితులతో కలిసి బాల్యమును గడిపింది యమునానదీ తీరముననే. ఆధ్యాత్మిక ఆర్ష సంస్కృతిని పరిరక్షించేందుకు కృషి సల్పిన ప్రజ్ఞా దురంధరుడు వేదవ్యాసుడు జన్మించింది యమునానది తీరముననే. పాండవుల తొలి రాజధాని ఇంద్రప్రస్థం యమునానదీ తీరంలోనే ఉన్నది. ఒకసారి బలరాముడు బంధువులను చూడటానికి వెళ్ళినప్పుడు గోపికలతో కలిసి స్నానమునకు వెళ్ళాడు. యమునానది తీరమునకు చేరుకొని యమునను పిలిచాడు. ఆమె రాలేదు. ఆగ్రహించిన బలరాముడు నీవు రానిచో, నిన్ను చీల్చెద అని పలికి హలమును దింపాడు. ఆమె భయపడి స్త్రీ రూపమున వచ్చి వినీలాది రత్నములను కానుకగా సమర్పించి వెళ్ళిపోయింది. హలమును దింపుట చేత యమున అప్పటినుండి తెల్లగా అయింది అని భారతం పేర్కొన్నది.

పుష్కర సమయములో కొన్ని నియమములను పాటించాలి. వీటిలో నదియందు స్నానము చేయడము, నదిని పూజించడము, పితృదేవతలకు పిండప్రదానము చేయడం, దానములు చేయడం ప్రధానమైనవి. స్నానం చేస్తున్నప్పుడు నదులయందు ఉమ్మివేయడం, మలమూత్రాదులను విసర్జించడం చేయకూడదు. పురుషులు పంచె, ఉత్తరీయం, స్త్రీలు సంప్రదాయ దుస్తులు ధరించి స్నానం చేయాలి. సబ్బులు, షాంపూలు వాడకూడదు. బట్టలు ఉతకకూడదు. తడిబట్టలతో పూజాది కార్యక్రమములు చేయకూడదు. తోటి భక్తులకు ఇబ్బందులు కలుగజేయకూడదు. సంకల్పము చెప్పుకొనిన తర్వాతనే స్నానం చేయాలి. నదిలోనికి దిగిన తర్వాత మూడు మునకలు వేయాలి. పుష్కరాల సమయంలో ప్రాతఃకాల స్నానము చాలా ముఖ్యము. మధ్యాహ్న స్నానము మధ్యమము. అపరాహ్ణమున స్నానము అధమము. స్నానము చేసిన తరువాత తూర్పు దిక్కుకు తిరిగి దేవతలకు అర్ఘ్యము నివ్వాలి. నదీమతల్లిని పూజించాలి. శక్త్యానుసారము దానములు చేయాలి. మొదటి రోజున ధాన్యము, రెండవ రోజున ఉప్పు, మూడవ రోజున బెల్లము, నాలుగవ రోజున చక్కెర, ఐదవ రోజున పండ్లు, ఆరవరోజున కర్పూరము, ఏడవ రోజున పీట, ఎనిమిదవ రోజున అల్లము, తొమ్మిదవ రోజున పిండప్రదానములు, పదవరోజున పుస్తకం, పదకొండవ రోజున తాంబూలము, పన్నెండవ రోజున నువ్వులు – ఈ విధముగా పన్నెండు రోజులు దానము చేయాలి.

'యోజనానాం సహస్రేషు కీర్తనాత్ పాపనాశినీ' ఎక్కడ నుంచి అయినా సరే, స్మరించిన మాత్రముననే సమస్త పాపములను తొలగించే పుణ్యనది యమునానది.



శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

## 101 వ కళ్యాణం

ఇది తేది 27-05-2026, బుధవారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. హబ్సీగూడ రవీంద్రనగర్ కాలనీలోని ఎస్. ఆర్ అపార్టుమెంట్ ప్రక్కన శ్రీమాన్ భూత్ పూరి వెంకట్ రెడ్డి, సంధ్యారాణి దంపతుల నిర్వహణలో అంగరంగ వైభవంగా జరిగింది.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

తెలియని సమస్యలు పరిష్కారమగుటకు వినాయక, సరస్వతీ, కాలభైరవ, చిత్రగుప్త అష్టోత్తర పూజలు చేయుట వలన మనశ్శాంతి కలుగును. ఆరోగ్య విషయంలో ధైర్యంగా ఉండగలరు. వివాహ ప్రయత్నములు ఫలించును. బంధుమిత్రులతో విందు వినోదములు, ఆకస్మిక ధనలాభము.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

సామాన్య లాభములు కలుగును. గ్రహదోష ప్రభావములు ఉండుటవలన కుటుంబ కలహములు వచ్చును. లక్ష్మీగణపతి పూజ చేయుట ద్వారా పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకోవచ్చు. ఏదైనా ఒక పని కార్యరూపం దాల్చును. విశ్వాసముతో ముందుకు సాగవలెను.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు గ్రహానుకూలత తక్కువగా ఉండును. తెలియని వ్యక్తుల వలన నష్టములు కలుగుటకు అవకాశములు ఉన్నాయి. కాలమును కష్టకాలముగా భావించి జాగ్రత్తగా వ్యవహరించవలెను. సత్యదేవుని వ్రతము ఆచరించి, నవగ్రహ అనుగ్రహము పొందవలెను.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశివారికి ఆర్థికంగా ఆశించినంత బలం ఉండదు. అప్పులు చేయవలసి వచ్చే సూచనలు ఉన్నవి. ఖర్చుల విషయంలో జాగ్రత్తలు తీసుకొని, ఆకస్మిక ధనవ్యయం కాకుండా ఆలోచనతో వ్యవహరించవలెను. తొందరపాటు త్యజించి దైవారాధన చేయుట మంచిది.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి వారికి సామాన్య ఫలితములు. ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. అధిక వడ్డీలకు అప్పులు చేయరాదు. నూతన పరిచయములు కాలయాపనకు దారి తీస్తాయి. స్త్రీలు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే మనోవ్యథకు గురయ్యే అవకాశం ఉంది.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్యంగా అనుకూలత ఉంటుంది. బంధు–మిత్రుల సహకారం, వ్యాపారంలో అనుకూల ఫలితములు. భార్యాభర్తల అనురాగం వలన ఆర్థిక అభివృద్ధి కలుగుతుంది. సంఘంలో, సమాజంలో గౌరవ–మన్ననలు. శ్రీ లలితాదేవి పూజలు చేయవలెను.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలత ఉంటుంది. ఆకస్మిక ధనలాభం కలుగగలదు. అయితే ఆకస్మిక తగాదాల వలన ధనం నీళ్లలా ఖర్చు కావచ్చు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన చేసి ఓం శరవణభవ నమః జపం చేయుట వలన శుభఫలితములు కలుగును.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు ఆర్థికాభివృద్ధి ఉంటుంది. ఇష్టపూర్వకంగా చేపట్టిన పనులు నెరవేరుతాయి. అనుమానంతో ప్రారంభించిన పనులలో చిన్న ఆటంకాలు రావచ్చు. నెగటివ్ ఆలోచనలు విడిచిపెట్టి పాజిటివ్‌గా ఆలోచించాలి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య లాభములు. ముఖ్యంగా గురుబలం తగ్గినందున ప్రతి విషయంలో చికాకులు కలగవచ్చు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఉద్యోగులకు బదిలీ సూచనలు ఉన్నాయి. గురువారం శనగలు, గుగ్గిళ్లు ప్రసాదంగా పంచుట శ్రేయస్కరం.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య లాభములు. బంధుమిత్రులు అనుకూలమా కాదా అన్నది స్పష్టంగా తెలియదు. రాజీ పడకుండా ధర్మమార్గంలో నిలబడితే దైవారాధన వలన ఆగిన పనులు మళ్లీ గాడిలో పడతాయి. స్వకార్య విషయాలలో ప్రత్యేక శ్రద్ధ అవసరం.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ మాసమున కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. ఎవరికైనా అతిగా నమ్మకం ఉంచితే మోసపోయే అవకాశమున్నది. పోలీస్, కోర్టు సంబంధిత విషయాలు మనసును కుదిపేయగలవు. స్వలాభాపేక్ష లేకుండా, ఉద్రేకం త్యజించి వినయంగా వ్యవహరించాలి. శివారాధన శ్రేయస్కరం.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. శనిభగవానునికి శనివారం తైలాభిషేకం చేయించాలి. ఆరోగ్య విషయంలో భయం అవసరం లేదు. ఒక శనివారం మహాన్యాస రుద్రాభిషేకం ఇంట్లో చేయించి, ఆవ నూనెతో ఈశ్వరునికి తైలాభిషేకం, దీపారాధన చేయండి.



# మీ విజ్ఞానం

నిర్వహణ: డా. లలితవాణి

జూన్-2026

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదిలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ కింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. బలిచక్రవర్తి కుమార్తె ఎవరు?
2. వేంకటేశ మంత్రపీఠం వారు రథయాత్ర ఎన్ని రోజులు చేస్తారు?
3. భూమిని ఉద్ధరించిందెవరు?
4. ఆంజనేయుడు ఎవరి అంశతో జన్మించాడు?
5. అగస్త్య మునిని ఎప్పుడు దర్శించుకోవాలి?
6. ఇంద్రద్యుమ్నుడికి ముక్తిమార్గాన్ని చూపించిందెవరు?
7. విభీషణుని నమ్మమని రామునికి చెప్పిందెవరు?
8. కః అంటే ఎవరు?
9. యమునానదిని పంట పొలాలవైపు మళ్ళించిన వీరుడెవరు?
10. కల్కి అవతారంలో శ్రీహరి ఎవరిని వధిస్తాడు?
11. ధూమకేతువునే ఆయుధంగా ధరించిందెవరు?
12. శ్వేతద్వీప నివాసులు ఎవరు?
13. శ్రీకృష్ణదేవరాయని తమ్ముడెవరు?
14. మంత్రాలయం పూర్వనామం ఏమిటి?
15. వ్యాసరాయలు శ్రీవారికి దేవాదాయంగా ఇచ్చిన గ్రామమేది?

1 ______
2 ______
3 ______
4 ______
5 ______
6 ______
7 ______
8 ______
9 ______
10 ______
11 ______
12 ______
13 ______
14 ______
15 ______

పేరు: ______

చిరునామా: ______

______

______

పిన్‌కోడ్: ______ ఫోన్: ______


## శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. పరీక్షిత్తు
2. శృంగి మహర్షి
3. జగన్నాథ్ జెట్టి మురళీకృష్ణ
4. సత్యవ్రతుడు
5. ఇంద్రద్యుమ్నుడు
6. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి
7. తమిళనాడులోని తిరువత్తూరు నుండి
8. విశ్వకర్మ
9. బ్రహ్మదేవుడు
10. జయదేవుడు
11. 24
12. విష్వక్సేనుడు
13. వేదనారాయణస్వామి
14. మధ్వాసురుడు
15. శ్రీకృష్ణ దేవరాయలు

## సరైన సమాధానాలు రాసినవారు

1. చిల్లర సీతారామారావు
2. చింతలపాటి శివశంకరశాస్త్రి
3. పి. సుబ్రమణ్యం
4. ఎస్. ముకుంద

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

చిల్లర సీతారామరావు


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy,** Cell: **93482 12354.** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com


EXIT

RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq